గురువారం
29•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 65
• పేజీలు: 14 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

ఆర్టికల్ 370 రద్దుపై
సుప్రీంకోర్టు సమీక్ష

- ఐదుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనం
- అన్ని పిటిషన్లూ ఆ బెంచ్‌కు బదిలీ
- అక్టోబర్ మొదటివారంలో విచారణ
- కేంద్రం, కశ్మీర్ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

"ఏం చేయాలో మాకు తెలుసు. మేం ఆదేశాలు జారీ చేశాం. వాటిని మార్చడం లేదు.
- కోర్టు నోటీసులు ఇవ్వకూడదన్న కేంద్ర ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 28:

జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటుచేసింది. వీటిపై అక్టోబర్ మొదటివారంలో ధర్మాసనం విచారణ చేపడుతుందని తెలిపింది. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, జమ్ముకశ్మీర్ పాలనా యంత్రాంగానికి నోటీసులు జారీచేసింది. ఆర్టికల్ 370 రద్దును సవాల్‌చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. కోర్టు నోటీసుల వల్ల 'సీ మాంతర పరిణామాలు' ఎదురవుతాయని, న్యాయస్థానంలో జరిగే వాదనలు ఐక్యరాజ్యసమితి వరకు చేరుతాయని వారు పేర్కొన్నారు. కేంద్రానికి నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదని విన్నవించారు. అయితే కోర్టు ఈ వాదనను తోసిపుచ్చింది. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి రిఫర్ చేస్తామని పేర్కొంటూ కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఈ సమయంలో వాది, ప్రతివాదుల మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకోగా, జస్టిస్ గొగోయ్ స్పందిస్తూ.. 'ఏం చేయాలో మాకు తెలుసు. మేం ఆదేశాలు జారీ చేశాం. వాటిని మార్చడం లేదు' అని స్పష్టంచేశారు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మొట్టమొదట న్యాయవాది ఎంఎల్ శర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం జమ్ముకశ్మీర్‌కు చెందిన మరో న్యాయవాది షకీర్ షబీర్ ఆయనకు తోడయ్యారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తిని రద్దుచేయడం ద్వారా రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాశారని ఆరోపిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) పార్టీ ఈ నెల 10న

మిగతా 5వ పేజీలో

ఏచూరి కశ్మీర్ పర్యటనకు
సుప్రీం అనుమతి

మాజీ ఎమ్మెల్యే తరిగామిని కలుసుకునేందుకే పరిమితం

5

అక్టోబర్ లేదా నవంబర్‌లో
ఇండో-పాక్ యుద్ధం!

ఇదే చివరిది కావొచ్చు
పాక్ మంత్రి రషీద్ సంచలన వ్యాఖ్యలు

5

బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి రెండు బ్యాడ్మింటన్ రాకెట్లను ఆయనకు బహూకరిస్తున్న ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్ పీవీ సింధు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా ఉన్నారు

క్రీడావిజేతల వేదిక
హైదరాబాద్

పీవీ సింధు దేశానికే గర్వకారణం
భవిష్యత్ టోర్నమెంట్ల సన్నద్ధానికి ప్రభుత్వమే ఏర్పాట్లు చేస్తుంది
సింధును అభినందించిన సందర్భంగా సీఎం కేసీఆర్

2

నేడు సీఎం కేసీఆర్
పాలమూరుకు

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏరియల్ సర్వే
కరివెన, వట్టెం, నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల సందర్శన
ప్రాజెక్టు ప్రగతిపై ఏదులలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధానప్రతినిధి, నమస్తే తెలంగాణ/ తిమ్మాజీపేట:

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు. ఉదయం 9 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా బయలుదేరి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కరివెనకు చేరుకుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని భూములను, కరివెన రిజర్వాయర్ పనులను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తారు. అనంతరం వట్టెం, అక్కడనుంచి నార్లాపూర్ రిజర్వాయర్ల వద్దకు చేరుకుంటారు. నార్లాపూర్ వెళుతున్న సమయంలోనే ఇప్పటికే సాగునీరు అందిస్తున్న మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్ఐ) కాల్వలు, రిజర్వాయర్‌ను హెలికాప్టర్ నుంచే పరిశీలిస్తారు. నార్లాపూర్ వద్ద శ్రీశైలం బ్యాక్‌వాటర్ ప్రాంతంలో పాలమూరు– రంగారెడ్డికి నీటిని ఎత్తిపోసే కోతిగుండు ప్రాంతం, రిజర్వాయర్ పనులను పరిశీలిస్తారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల చేరుకుని అక్కడ జరుగుతున్న ప్రాజెక్టు పనులను పరిశీలించడంతోపాటు అధికారులు, జిల్లామంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు. జెడ్పీ చైర్మన్లతో ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. సీఎం పర్యటన కోసం

మిగతా 2వ పేజీలో

పురపోరులోనూ జయభేరి

మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరాలి

- టీఆర్ఎస్ క్యాడర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- నెలాఖరులోగా కమిటీల ఏర్పాటు పూర్తికావాలి
- ఆ తర్వాత శిక్షణ తరగతుల నిర్వహణ
- పార్టీ ప్రధాన కార్యదర్శులతో కేటీఆర్ సమీక్షాసమావేశం
- నలుగురు నేతలకు పార్టీ కార్యాలయాల నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలు
- ఎన్నికలంటేనే భయపడుతున్న ప్రతిపక్షాలు: పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బుధవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులతో సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

"ఈ నెలాఖరుకల్లా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ గ్రామ, వార్డు, మండల కమిటీల ఎన్నికలను పూర్తిచేయాలి. ప్రతి మున్సిపాలిటీలోనూ తప్పనిసరిగా బూత్ కమిటీలను వేయాలి. ప్రజలు టీఆర్ఎస్ పార్టీని ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారు. అనేక ఎన్నికల్లో ఇదే విషయాన్ని రుజువుచేశారు.
- కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండాలని.. అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగురవేసేలా పనిచేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఈ నెలాఖరుకల్లా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు, మండల కమిటీల ఎన్నికలను పూర్తిచేయాలని ఆదేశించారు. తెలంగాణభవన్‌లో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శులతో కేటీఆర్ సుదీర్ఘంగా సమీక్షాసమావేశం నిర్వహించారు. పార్టీ కమిటీల ఎన్నిక, జిల్లా పార్టీ కార్యాలయాల నిర్మాణాల పురోగతి, మున్సిపల్ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంపై పలు నిర్ణయాలు తీసుకొన్నారు. నాయకులకు పలు ఆదేశాలు, అవసరమైన సూచనలుచేశారు. ఒక్కో ప్రధాన కార్యదర్శి ద్వారా వారివారి పరిధిలోని జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికలపై తాజా సమాచారాన్ని సేకరించారు. ఆయా మున్సిపాలిటీల్లో ఉన్న రాజకీయ పరిస్థితులను తెలుసుకొన్నారు. ప్రతి మున్సిపాలిటీలోనూ తప్పనిసరిగా బూత్ కమిటీలను వేయాలని ఆదేశించారు. ప్రజలు టీఆర్ఎస్ పార్టీని ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని, అనేక ఎన్నికల్లో ఇదే విషయాన్ని రుజువుచేశారని కేటీఆర్ తెలిపారు. ఈ నెలాఖరుకల్లా గ్రామ, మండల కమిటీలను పూర్తిచేసి మున్సిపాలిటీల్లో పర్యటించాలని కొత్తగా నియమించిన ఇంచార్జి ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను కేటీఆర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడున్న తాజా రాజకీయ పరిస్థితులను అంచనా వేసి నివేదిక

మిగతా 2వ పేజీలో

ఆఫ్ఘనిస్థాన్ ఇస్లామిక్ బ్యాంక్
సీఈవోగా హైదరాబాదీ

హఫీజ్ సయ్యద్ ముసా కలీమ్ నియామకం

9

నేడు, రేపు ఓ మోస్తరు వానలు

24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

2

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	65.00	రిటైల్ లైవ్	87.00
డ్రెస్‌డ్	126.00	స్కిన్‌లెస్	144.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	322.00	రంగారెడ్డి	322.00
మెదక్	322.00	కరీంనగర్	325.00
వరంగల్	325.00	చిల్లర ధర	3.80

ఊళ్లోలేరని పట్టా మార్పు

కౌలుదారుకు భూమి బదలాయింపు

- ఆర్డీవో కోర్టులో కేసు గెలిచినా అందని పాస్‌పుస్తకాలు
- వరంగల్ రూరల్ జిల్లా నడికూడలో రెవెన్యూ లీలలు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు నల్లాని పుష్పలీల

6

ధర్మగంట

ఆర్డీవో కోర్టులో కేసు గెలిచిన అనంతరం తాసిల్దార్ మంజూరుచేసిన పాస్‌పుస్తకాన్ని చూపుతున్న నల్లాని పుష్పలీల

రెవెన్యూ అధికారుల గురించి ఎంతచెప్పినా ఒడవని ముచ్చటే. కొంతమంది అధికారుల ధనదాహానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ గ్రామీణ జిల్లాలో నడికూడ మండలంలో ఓ రైతుకు 5.17 ఎకరాల భూమి ఉన్నది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. వారిలో పెద్దకూతురు, అల్లుడు చనిపోయారు. చిన్న కూతురేమో భర్తతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సదరు రైతు కూడా అనారోగ్యంతో మరణించారు. ఆయన మరణానంతరం ఆ భూమి అసలైన వారసురాలైన చిన్నకూతురుకు దక్కాలి. కానీ రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి ఆ భూమిని కౌలు చేసుకొంటున్న రైతుకు అక్రమంగా పట్టాచేశారు. ఈ వ్యవహారంపై బాధితులు ఆర్డీవో కోర్టుకు వెళ్లగా అక్కడ బాధితురాలి పక్షానే తీర్పువచ్చింది. అయినప్పటికీ.. రెవెన్యూ సిబ్బంది మాత్రం రికార్డులు సరిచేసి పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా సతాయిస్తున్నారు. తమ గోడును ఎవరూ పట్టించుకోకపోవడంతో బాధితురాలు పుష్పలీల న్యాయంకోసం ధర్మగంటను ఆశ్రయించారు.

- వేములవాడ శివారులో ఘటన
- 22 మందికి గాయాలు
- పరామర్శించిన మంత్రి ఈటల రాజేందర్
- మెరుగైన చికిత్స అందించాలని కేటీఆర్ ఆదేశం

బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ తిప్పాపూర్‌లో డివైడర్‌ను ఢీకొట్టిన స్కూల్‌వ్యాన్

స్కూల్‌వ్యాన్ బోల్తాపడి
ముగ్గురు విద్యార్థులు దుర్మరణం

వేములవాడ నమస్తేతెలంగాణ:

ప్రైవేటు పాఠశాల వాహనం బోల్తా పడి ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందగా, 22 మంది గాయపడ్డారు. ఈ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. వేములవాడలోని వాగేశ్వరి శ్రీచైతన్య పాఠశాలకు చెందిన వ్యాన్‌లో 27 మంది విద్యార్థులతో చింతలఠాణా, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న పాఠశాల కరస్పాండెంట్ రేగులపాటి రవిచందర్‌రావు నివాసంలోని హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. పాఠశాల నుంచి హాస్టల్‌కు ఐదు కిలోమీటర్ల దూరంఉంది. ఇంకో అరకిలోమీటర్ దూరం వెళ్తే హాస్టల్ వస్తుందనగా ప్రమాదం జరిగింది. తిప్పాపూర్‌లోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలోకి చేరుకోగానే అతివేగంతో ఒక్కసారిగా వ్యాన్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న విద్యార్థులు కాసారపు మణిచందనరాణి(15), గుగులోతు దీక్షిత(8) అక్కడికక్కడే మృతి చెందగా, గుగులోతు రిషి(7) దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయాడు. కాగా, వెల్పుల అజయ్(14), ఠాకూర్ రాకేశ్(14), నిఖిల్(8), రాజు(9)ను జిల్లా దవాఖానకు తరలించి వైద్యం అందిస్తున్నారు. మృతుల్లో మణిచందనరాణిది

మిగతా 7వ పేజీలో

ఎఫ్‌డీఐల్లో సంస్కరణల జోష్

నాలుగు రంగాల్లో నిబంధనలు సరళతరం
బొగ్గు గనులు, కాంట్రాక్టు తయారీలో..
100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి
దేశంలో కొత్తగా 75 ప్రభుత్వ వైద్య కాలేజీలు
2021-22నాటికి ఏర్పాటు
అందుబాటులోకి రానున్న 15,700 ఎంబీబీఎస్ సీట్లు
కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

వివరాలు 5, 9వ పేజీల్లో

పన్ను చెల్లింపుదారులకు ఊరట?

రూ.5-10 లక్షల లోపు ఆదాయంపై పన్ను 10 శాతానికి తగ్గించాలి
రూ.20 లక్షల లోపు ఆదాయంపై 20 శాతానికి కుదించాలి
కేంద్రప్రభుత్వానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిఫారసు

9

epaper.ntnews.com

బుధవారం ప్రగతిభవన్‌లో ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలిచిన భారత షట్లర్ పూసర్ల వెంకట సింధుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీపీలు అంజనీకుమార్, మహేశ్ భగవత్, కోచ్ గోపీచంద్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరినాథ్, సింధు తల్లి విజయ ఉన్నారు.

క్రీడావిజేతల వేదిక హైదరాబాద్

- పీవీ సింధు దేశానికే గర్వకారణం
- భవిష్యత్ టోర్నమెంట్ల సన్నద్ధానికి.. ప్రభుత్వమే ఏర్పాట్లు చేస్తుంది
- సింధును అభినందించిన సందర్భంగా సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలువడం ద్వారా పీవీ సింధు దేశానికే గర్వకారణంగా నిలిచిందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్లలో పాల్గొనేందుకు, సిద్ధమయ్యేందుకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వపరంగాచేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ క్రీడాపోటీల్లో విజేతలను తయారుచేసే వేదికగా హైదరాబాద్ మారిందన్నారు. పీవీ సింధు, ఆమె తల్లిదండ్రులు, కోచ్ గోపీచంద్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరినాథ్ బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. పీవీ సింధు తనకు వచ్చిన మెడల్‌ను సీఎం కేసీఆర్‌కు చూపించారు. రెండు రాకెట్లను సీఎంకు బహూకరించారు. సింధుకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సీఎం సన్మానించారు. 'పీవీ సింధు దేశ గౌరవాన్ని నిలబెట్టింది. ప్రపంచ చాంపియన్‌షిప్ గెలువడం ద్వారా 130 కోట్ల మంది భారతీయుల్లో ఒకరిగా నిలిచారు. ఇది మనందరికీ గర్వకారణం. ఇలాంటి ఘనతలు సాధించడం ఆషామాషీ విషయం కాదు. కఠోరసాధన, శ్రమ, శ్రద్ధ అవసరం. స్వతహాగా జాతీయ క్రీడాకారులైన రమణ దంపతులు కూతురును గొప్పగా తీర్చిదిద్దారు. గోపీచంద్ చక్కగా శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు అంతర్జాతీయ విజేతలను తయారుచేసే వేదికగా హైదరాబాద్ మారుతున్నది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. సింధు భవిష్యత్తులో ఇంకా అనేక టోర్నమెంట్లలో పాల్గొనాలి. ఒలింపిక్స్‌కు వెళ్లాలి. భవిష్యత్తు టోర్నమెంట్లకు సమాయత్తం కావడానికి, ఇతర ఏర్పాట్లకు సహకారం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నద'ని సీఎంకేసీఆర్ చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీపీలు అంజనీకుమార్, సజ్జనార్, మహేశ్ భగవత్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్ పాల్గొన్నారు.

పురపోరులోనూ జయభేరి

మూడోపేజీ తరువాయి...

ఇవ్వాలని సూచించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నందున టీఆర్ఎస్‌ను ఆదరించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ చెప్పారు. సభ్యత్వ నమోదును విజయవంతంగా పూర్తి చేయడంపై నాయకులను, పార్టీ క్యాడర్‌ను కేటీఆర్ అభినందించారు. కమిటీల ఎన్నికలను ఈ నెలాఖరుకల్లా పూర్తిచేయాల్సిందేనని స్పష్టంచేశారు. సభ్యత్వ నమోదు పుస్తకాలను వెంటనే రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపించాలని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణాలను దసరానాటికి పూర్తయ్యే విధంగా చూడాలని తెలిపారు.

బుధవారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు

ప్రతిపక్షాలకు ఎన్నికలంటేనే భయం: పల్లా

ప్రతిపక్షాలు ఎన్నికలకు భయపడి వాటిని అడ్డుకోవాలని చూస్తున్నాయని పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్, జెడ్పీ, సర్పంచ్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టడంతో.. మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే రకమైన తీర్పు మళ్లీ వస్తుందనే భయంతోనే కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూస్తున్నాయని ఎద్దేవాచేశారు. ప్రతిపక్షాలు ఎన్నికలంటేనే భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. సమీక్షా సమావేశపు వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శులు బండాప్రకాశ్, పీ రాములు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి మీడియాకు వెల్లడించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మున్సిపల్ ఎన్నికలకోసం ఒక సన్నాహక కమిటీని నియమించారని పల్లా చెప్పారు. రాష్ట్రంలో పార్టీ సభ్యత్వం 60 లక్షలకు చేరడంపై కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రూ.22 కోట్లు పార్టీ కార్యాలయానికి జమ అయ్యాయని తెలిపారు. సభ్యత్వానికి సంబంధించిన డాటా ఎంట్రీ తుదిదశకు చేరిందని వివరించారు. ఈ నెల 31లోగా కమిటీలను పూర్తిచేసి వాటి వివరాలను రాష్ట్ర పార్టీకి అందించాలని కేటీఆర్ ఆదేశించినట్లు పల్లా తెలిపారు. కమిటీలు పూర్తయినచోట నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించాలని ఈ సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీ , ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ, ఓడీసీఎమ్మెస్ చైర్మన్లు, చట్టసభల మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గానికి చెందిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, రాష్ట్ర కమిటీ బాధ్యులను ఆహ్వానించాలని కేటీఆర్ సూచించినట్లు వెల్లడించారు. పార్టీ కార్యాలయ నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యతలను ఉమ్మడి జిల్లాలవారీగా నలుగురు నాయకులకు అప్పగించారని చెప్పారు. ఎంపీ సంతోష్‌కుమార్- మెదక్, కరీంనగర్.. ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి-వరంగల్, ఖమ్మం, నల్లగొండ.. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి- రంగారెడ్డి, మహబూబ్‌నగర్.. పార్టీ ప్రధానకార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డి- ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కార్యాలయాల నిర్మాణాలను పర్యవేక్షిస్తారని పల్లా తెలిపారు. పార్టీ సంస్థాగత తనిఖీలు భాగంగా కమిటీల ఎన్నిక, నియోజకవర్గ స్థాయి సమావేశాల అనంతరం పార్టీ శ్రేణులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గాలవారిగా మున్సిపల్ ఎన్నికల కమిటీల ఇంచార్జీలు

లోక్‌సభ నియోజకవర్గం	ప్రధాన కార్యదర్శి	కార్యదర్శులు
ఆదిలాబాద్	రావుల శ్రవణ్‌రెడ్డి	డీ విఠల్‌రావు, లోక భూమారెడ్డి, దండే విఠల్
పెద్దపల్లి	నారదాసు లక్ష్మణ్‌రావు	అరికెల నాగేశ్వర్‌రావు, కర్ర శ్రీహరి, మూల విజయారెడ్డి
నిజామాబాద్	తుల ఉమ	ఫారూఖ్ హుస్సేన్, లోక బాపురెడ్డి, రూప్‌సింగ్
కరీంనగర్	బస్వరాజు సారయ్య	టీ భానుప్రసాద్, కోలేటి దామోదర్‌గుప్తా, గూడూరి ప్రవీణ్
మెదక్	సీహెచ్ నరేంద్రనాథ్	పీ భూపతిరెడ్డి, రాధకృష్ణశర్మ, బక్కి వెంకటయ్య
జహీరాబాద్	ఫరీదుద్దీన్	జే వెంకటేశ్‌గౌడ్, బండారి లక్ష్మారెడ్డి
వరంగల్	గ్యాదరి బాలమల్లు	వై కృష్ణారెడ్డి, కుసుమ జగదీశ్
మహబూబాబాద్	సత్యవతి రాథోడ్	మందుల సామేల్, టీ వెంకట్రావు
నల్లగొండ	టీ రవీందర్‌రావు	వై వెంకటేశ్వర్లు, ఈ వెంకటరత్నం, నిరంజన్‌వలీ
భువనగిరి	పల్లా రాజేశ్వర్‌రెడ్డి	కర్నె ప్రభాకర్, కంచర్ల రామకృష్ణారెడ్డి, సోమ భరత్‌కుమార్‌గుప్తా, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాంబాబుయాదవ్
ఖమ్మం	నూకల నరేశ్‌రెడ్డి	టీ మధుసూదన్
మహబూబ్‌నగర్	బండాప్రకాశ్	అందె బాబయ్య, వాల్యానాయక్, ఇంతియాజ్
నాగర్‌కర్నూల్	పీ రాములు	చాడ కిషన్‌రెడ్డి, ఎల్ కిషన్‌రావు, బీ శ్రీనివాస్‌యాదవ్
చేవెళ్ల	వీ గంగాధర్‌గౌడ్	గట్టు రాంచందర్‌రావు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుండు సుధారాణి, సీహెచ్ రాకేశ్, కే వాసుదేవరెడ్డి
మల్కాజిగిరి	ఎం సుధీర్‌రెడ్డి	శంభీపూర్‌రాజు, కట్టెల శ్రీనివాస్‌యాదవ్, బీ వెంకటేశ్వర్లు, తాడూరి శ్రీనివాస్, పీ పురుషోత్తం
సికింద్రాబాద్	బండి రమేశ్	————
హైదరాబాద్	ఎండీ జహంగీర్	————

టీఆర్ఎస్వీ నాయకుడు పల్లా ప్రవీణ్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

నేడు, రేపు ఓ మోస్తరు వానలు

- 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్ సిటీబ్యూరో/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది మరింత ఎత్తుకు వెళ్లి నైరుతి వైపు తిరుగుతుందని చెప్పారు. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడొచ్చని ఆయన తెలిపారు.

వేడెక్కిన గ్రేటర్ హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లో వాతావరణం వేడెక్కింది. మొన్నటివరకు వర్షపు జల్లులతో చల్లగా ఉండగా, బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో తేమశాతం తగ్గడంతో ఎండల తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 32.8 డిగ్రీలు, గాలిలో తేమ 53 శాతంగా నమోదైందని పేర్కొన్నారు.

ప్రైవేటు వర్సిటీలకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఇందుకోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక వైబ్‌సైట్ (www.tsche.ac.in/private-universities)ను అందుబాటులోకి తెచ్చింది. యూనివర్సిటీల కోసం ప్రైవేటు సంస్థలు రూ.50 వేల ఫీజు చెల్లించి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి సూచించారు. దరఖాస్తు ఫారాన్ని నింపి తిరిగి సమర్పించే క్రమంలో నాన్ రిఫండబుల్ కింద రూ.10 లక్షలు చెల్లించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు నెలరోజుల గడువు విధించే అవకాశమున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం టెక్‌మహేంద్ర, విట్, గీతం, ఇక్ఫాయ్, కేఎల్ వంటి పలు డీమ్డ్ వర్సిటీలతోపాటు రాష్ట్రంలో కొన్ని అటానమస్ ఇంజినీరింగ్ కాలేజీలు కూడా ప్రైవేటు యూనివర్సిటీ ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని పాపిరెడ్డి తెలిపారు. సీబీఐటీ, వీబీఐటీ, మల్లారెడ్డి, సెయింట్ మేరీ వంటి పలు రకాల ప్రైవేటు విద్యాసంస్థలు దరఖాస్తులు చేసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

గురుకుల జూనియర్ లెక్చరర్ అభ్యర్థుల ఎంపిక పూర్తి

టీఆర్ఈఐ-ఆర్బీ వెబ్‌సైట్‌లో 281 మంది జాబితా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గురుకుల జూనియర్ కళాశాల లెక్చరర్ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. భర్తీ ప్రక్రియలో భాగంగా రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల పరిశీలన ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఆర్ఈఐ-ఆర్బీ) బుధవారం విడుదలచేసింది. 281 మందితోకూడిన తాత్కాలిక ఎంపిక జాబితాను టీఆర్ఈఐ-ఆర్బీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇతర వివరాల కోసం www.treirb.telangana.gov.in, www.treirb.net వెబ్‌సైట్లను పరిశీలించాలని సూచించారు. గురుకుల జూనియర్ కళాశాలల్లో 12 సబ్జెక్టుల్లో బోధన కోసం 281 జూనియర్ లెక్చరర్ పోస్టుల నియామకానికి టీఆర్ఈఐ-ఆర్బీ గతేడాది నోటిఫికేషన్ జారీచేసింది.

ఐసెట్ సీట్ల కేటాయింపు పూర్తి

ఎంబీఏ కాలేజీల్లో 18,364 సీట్లు భర్తీ

ఎంసీఏ కాలేజీల్లో 1,740 సీట్లు భర్తీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 313 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో 25,389 సీట్లు ఉండగా వాటిలో 20,104 సీట్లు నిండాయని ఐసెట్-2019 అడ్మిషన్ కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. బుధవారం ఐసెట్ తుది విడుత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిచేసినట్టు పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు ఈ నెల 31 వరకు గడువు విధించినట్టు వెల్లడించారు. 276 ఎంబీఏ కాలేజీల్లో 22,434 సీట్లు ఉండగా 18,364 సీట్లు నిండాయని, 4,070 సీట్లు మిగిలాయని తెలిపారు. 37 ఎంసీఏ కాలేజీల్లో 1,955 సీట్లు ఉండగా 1,740 సీట్లు నిండాయని, 215 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. ఎంబీఏలో 81.85 శాతం, ఎంసీఏలో 89 శాతం సీట్లు నిండాయని ఆయన ప్రకటించారు. ఎంబీఏ, ఏంసీఏలో కలిపి 184 కాలేజీల్లో100 శాతం సీట్లు భర్తీకాగా, ఒక్క కాలేజీలో సున్నా ప్రవేశాలు నమోదయ్యాయని వివరించారు. పూర్తి వివరాలకు https://tsicet.nic.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.05 గంటలకు

సూర్యాస్తమయం: 6.29 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, చతుర్దశి రాత్రి 7.57 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: ఆశ్లేష రాత్రి 8.11 వరకు, తదుపరి మఖ, అమృతఘడియలు: సాయంత్రం 6.46 నుంచి రాత్రి 8.22 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.50 నుంచి 3.23 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.10 నుంచి సాయంత్రం 4.50 వరకు, వర్జ్యం: ఉదయం 10.16 నుంచి 11.52 వరకు.

నిరంతర విద్యుత్ కోసమే ప్రాజెక్టుల నిర్మాణాలు

- టీఎస్‌పీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు పీ రత్నాకర్‌రావు, సదానందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలన్న ఉద్దేశంతోనే ప్రాజెక్టుల నిర్మాణాలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు పారదర్శకంగా చేపడుతున్నట్టు టీఎస్‌పీఈఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీ రత్నాకర్‌రావు, సదానందం తెలిపారు. బుధవారం టీఎస్‌పీఈఏ భవనంలో మీడియాతో వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వస్తే అంధకారం అవుతుందన్న దశ నుంచి కేసీఆర్ సర్కారు చేపట్టిన ప్రత్యేక చర్యల కారణంగా అన్ని రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఎంతో పురోగతి సాధించాయని, అందులో భాగంగా రికార్డుస్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారని, వేల కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు, వందల కొద్దీ సబ్‌స్టేషన్ల నిర్మాణం, సోలార్ పాలసీని దేశంలోనే గొప్పగా చేపట్టారని అన్నారు. దశాబ్దాలుగా ఎరుగని అభివృద్ధి ఐదేండ్లలో జరగడం సామాన్యమైన విషయం కాదని, దీనికి సీఎం కేసీఆర్ దూరదృష్టితోపాటు ప్రభుత్వం అందించిన తోడ్పాటు, అపార అనుభవం ఉన్న టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాలరావు కృషి ఉందన్నారు. జెన్‌కో విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణాలు కేంద్ర సంస్థ బీహెచ్ఈఎల్ ద్వారా పాదర్శకంగా చేపట్టారని చెప్పారు. సమావేశంలో టీఎస్‌పీఈఏ ప్రతినిధులు కే కిరణ్‌కుమార్, ఏ వెంకటనారాయణరెడ్డి, ఎల్ జనప్రియ, ప్రశాంత్, సురేశ్‌బాబు, యుగంధర్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం కరివెన రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రొనాల్డ్‌రోస్ తదితరులు

నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నేడు సీఎం కేసీఆర్ పాలమూరుకు

మూడోపేజీ తరువాయి...

పోలీసులు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లుచేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. భూత్పూరు మండలం కరివెన రిజర్వాయర్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుపనులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ రొనాల్డ్‌రోస్‌తో కలిసి పర్యవేక్షించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలో బీజేఆర్ కంపెనీ వద్ద జరుగుతున్న ప్రాజెక్టు పనులను, హెలిప్యాడ్ ఏర్పాట్లను మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. సీఎంను చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉండటంతో బారికేడ్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా దాదాపు గంటసేపు అధికారులు, పార్టీ ముఖ్యనాయకులతో వారు చర్చించారు.

సీఎం షెడ్యూల్ ఇదీ..

- గురువారం ఉదయం 9.00: ప్రగతిభవన్ నుంచి రోడ్డుమార్గం ద్వారా బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.
- ఉదయం 9:10: బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం కరివెనకు బయలుదేరుతారు.
- ఉదయం 9.40: కరివెన రిజర్వాయర్ వద్దకు చేరుకుంటారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలిస్తారు.
- ఉదయం 10:15: కరివెన నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10:40 గంటలకు నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం రిజర్వాయర్‌కు చేరుకుంటారు. అక్కడ 20 నిమిషాలపాటు ఉంటారు.
- ఉదయం 11.00: నాగర్‌కర్నూలు జిల్లా వట్టెం నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11:20 గంటలకు నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ చేరుకుంటారు. అక్కడ సుమారు అరగంటపాటు పనుల తీరును గమనిస్తారు.
- ఉదయం 11:50: నార్లాపూర్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12:15 గంటలకు వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుల రిజర్వాయర్ చేరుకుంటారు. ఏదులలో మధ్యాహ్న భోజనం అనంతరం రిజర్వాయర్, పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తారు. తర్వాత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై సమీక్ష నిర్వహిస్తారు.
- సాయంత్రం 5:30: ఏదుల నుంచి బయలుదేరి సాయంత్రం 6.20 నిమిషాలకు హైదరాబాద్ చేరుకుంటారు.

అడ్డంకులు దాటుకుని శరవేగంగా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ 2015 జూన్ 11న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించారు. పనులు బాగా సాగుతున్న తరుణంలో ప్రతిపక్షపార్టీల నాయకులు ఈ ప్రాజెక్టుపై కోర్టులో కేసులు వేయడంతో నిలిచిపోయాయి. అయినా పట్టువీడని తెలంగాణ ప్రభుత్వం ఒక్కోకేసును కొలిక్కి తెస్తూనే.. పర్యావరణ, అటవీ అనుమతులు సాధించింది. 18 ప్యాకేజీలుగా ప్రారంభించిన ఈ పథకం పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. ఏదుల రిజర్వాయర్ పనులు దాదాపుగా పూర్తికాగా. కరివెన, నార్లాపూర్ రిజర్వాయర్లలో 65 శాతం పనులు జరిగాయి. వట్టెం రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయి. ఇన్నాళ్లు భూసేకరణ సమస్యలతో ఆలస్యమైన ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు కూడా వేగం పుంజుకున్నాయి. టన్నెల్, సర్జ్‌పూల్, పంప్‌హౌస్ పనులు కొనసాగుతున్నాయి. అటవీ అనుమతులు సైతం రావడంతో ఆగిపోయిన పనుల్లోనూ వేగం అందుకున్నది. వచ్చే వానకాలం నాటికి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని సీఎం కేసీఆర్ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందుకోసం రాత్రింబవళ్లు మూడు షిఫ్టుల్లో పనిచేయాలని ఆదేశించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పనుల కోసం ఇప్పటికే పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.10 వేల కోట్ల రుణం మంజూరైన నేపథ్యంలో.. మిగతా పనులను రాష్ట్రప్రభుత్వం ఖర్చుచేసి వేగంగా పూర్తిచేసేందుకు నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి గురువారం పాలమూరు జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం కేసీఆర్ రాకతో పాలమూరు ప్రాజెక్టు పనులు మరింత వేగంగా పూర్తయ్యే అవకాశం ఉన్నది.

లోకం పోకడ

అవునమ్మా.. మంత్లీ స్కీము మొదట్లో మీరు ముత్యాల హారమే తీసుకుందామనుకున్నారు.. కానీ, ఇప్పుడు ఈ ముక్కు పుడక తప్ప మరేం రాదు!

కాంగ్రెస్ నేతలది హనీమూన్ యాత్ర

- టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఎద్దేవా
- నాలుగేండ్ల క్రితం ఇలాగే షికారు చేశారు: వేణుగోపాలాచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్, కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలను టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఖండించారు. తమ్మిడిహట్టిపై కాంగ్రెస్ నేతలది హనీమూన్ యాత్ర అని, వారు నైరాశ్యంలో ఉండి అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, టీఆర్ఎస్ నేత రామ్మూర్తి యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు మహారాష్ట్రలో.. మూడుచోట్లా కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పుడు తమ్మిడిహెట్టి వద్ద తట్టెడుమట్టి కూడా ఎందుకు తవ్వలేకపోయారని ప్రశ్నించారు. కానీ, సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం పెన్‌గంగ, మేడిగడ్డ, తమ్మిడిహట్టి వద్ద బరాజ్‌లు కట్టడానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్నదని చెప్పారు. ప్రపంచం అబ్బురపడేలా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేశామన్నారు. కాంగ్రెస్ నేతల్లో నైరాశ్యం నెలకొన్నదని, అందుకే అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) రిజర్వాయర్లో ఇప్పటికే 12 టీఎంసీల నీరు నిల్వచేశారని, ఇవేమీ చూడని కాంగ్రెస్ నాయకులు ఈర్ష్య, కండ్లమంట, కడుపుమంటతో కారుకూతలు కూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, సరైన సమయంలో వారికి బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టు ద్వారా 20 టీఎంసీలతో రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడానికి సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి కంపెనీలను తీసుకరావడంలో కేటీఆర్ పాత్ర కీల

చట్టసభల సమయం వృథా కారాదు

- మీడియాను ఆకర్షించేందుకు సభ్యుల యత్నం దురదృష్టకరం
- రాష్ట్రాల స్పీకర్ల సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చట్టసభల్లో ఒక్కనిమిషం కూడా వృథా కారాదని, అక్కడ జరిగే చర్చలపై దేశప్రజలు ఆసక్తి చూపుతారని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసం వారి అంచనాలకనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఢిల్లీలో బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన పార్లమెంట్ ప్రధానకమిటీ హాలులో అన్నిరాష్ట్రాల స్పీకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా పోచారం మాట్లాడుతూ దేశప్రజలకు చట్టసభలు ప్రతీకలుగా నిలుస్తాయని, మెరుగైనపాలన, సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై నిర్ణయాత్మక చర్చలు జరిగేది చట్టసభల్లోనే అన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఆ అంశం పరిధిలోనే ఉండాలని, చర్చ పక్కదారి పట్టకూడదని తెలిపారు. వ్యక్తిగత విమర్శలు, దూషణలతో సమయం వృథా అవుతున్నదని, చట్టసభలలో అల్లరి చేయడం ద్వారా మీడియాను ఆకర్షించేందుకు కొంతమంది సభ్యులు యత్నించడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ శాసనసభలో రోజుకు 10 ప్రశ్నలతోకూడిన క్వశ్చన్ అవర్ ఉన్నదని, ఇలాంటి సమావేశాల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

పార్లమెంట్ కమిటీ హాలులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో తెలంగాణ స్పీకర్ పోచారం

నూతన సచివాలయ నిర్మాణంపై నివేదిక

క్యాబినెట్ సబ్‌కమిటీకి సమర్పించిన టెక్నికల్ కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన సచివాలయ నిర్మాణంపై ఇంజినీర్స్ ఇన్ చీఫ్‌లతో కూడిన టెక్నికల్ కమిటీ.. క్యాబినెట్ సబ్ కమిటీకి నివేదికను సమర్పించింది. బుధవారం ఆర్‌అండ్‌బీ మంత్రి కార్యాలయంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌కు ఈ నివేదికను అందజేసింది. దీనిని పరిశీలించి త్వరలో సీఎం కేసీఆర్‌కు అందజేస్తామని మంత్రులు తెలిపారు.

బుధవారం మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌కు నివేదిక అందజేస్తున్న ఇంజినీర్స్ ఇన్ చీఫ్ టెక్నికల్ కమిటీ సభ్యులు



'రెవెన్యూ వ్యవస్థ- నిన్న నేడు రేపు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్. చిత్రంలో రచయిత ఏనుగు నరసింహారెడ్డి, జూలూరు గౌరీశంకర్, బాలాచారి ఉన్నారు.

రెవెన్యూవ్యవస్థలో మార్పులురావాలి

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ వ్యవస్థలో కాలానుగుణంగా మార్పులు రావాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఏనుగు నరసింహారెడ్డి రాసిన 'రెవెన్యూ వ్యవస్థ– నిన్న నేడు రేపు' పుస్తకాన్ని బుధవారం తన క్యాంపు కార్యాలయంలో బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ బాలాచారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఏనుగు నరసింహారెడ్డి అనుభవపూర్వకంగా ఈ పుస్తకాన్ని రాశారని తెలిపారు. ఈ శాఖలో సమూలమైన సంస్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఇలాంటి పుస్తకం రావడం హర్షణీయమన్నారు. 1985 కంటే ముందు భూమిశిస్తు వసూలుచేసే శాఖగానే రెవెన్యూశాఖకు పేరుండేదని.. భూమిశిస్తును ఎన్టీఆర్ రద్దు చేయడంతో సాధారణ పరిపాలనశాఖగా మారిందన్నారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ అనేక విమర్శలు, అసహనాన్ని ఎదుర్కొంటుందని తెలిపారు. ఇందుకు కారణాలు ఏమిటి? దాని చరిత్ర ఏమిటి? ప్రజలకు ప్రియమైన శాఖగా ఎలా మార్చగలమనే తపనతో నరసింహారెడ్డి ఈ గ్రంథాన్ని రాశారని భావిస్తున్నానన్నారు.

పల్లె నేపథ్యం ప్రతిభకు అడ్డుకాదు

బుధవారం హైదరాబాద్‌లో కొత్త జడ్జీలు తడకమళ్ల వినోద్, అభిషేక్‌రెడ్డి, కూనూరు లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ సభ్యులు

- సన్మానసభలో జస్టిస్ కూనూరు లక్ష్మణ్
- నూతన న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ సత్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామీణ నేపథ్యం విజయానికి అడ్డంకి కాదని, అందుకు తానే నిదర్శనమని జస్టిస్ కూనూరు లక్ష్మణ్ పేర్కొన్నారు. నూతనంగా న్యాయమూర్తులుగా నియామకమైన జస్టిస్‌లు తడకమళ్ల వినోద్‌కుమార్, అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి, కూనూరు లక్ష్మణ్‌లను హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ కూనూరు లక్ష్మణ్ మాట్లాడుతూ.. గ్రామీణ, తెలుగు మాధ్యమం నేపథ్యం, అట్టడుగువర్గాల నుంచి వచ్చే యువ న్యాయవాదులను సీనియర్ న్యాయవాదులు ప్రోత్సహించాలని అన్నారు. తమ పిల్లలను ఎలా చూస్తారో జూనియర్ న్యాయవాదులను కూడా అలాగే చూడాలని సూచించారు. ఇంగ్లిష్ రాదని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చామనే ఆత్మన్యూనతా భావం ఉన్న జూనియర్లలో ఆ భావన తొలిగిపోయేలా చూడాలని పేర్కొన్నారు. జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ మాట్లాడుతూ కెరీర్ ప్రారంభించినప్పుడు ఈ స్థాయికి ఎదుగుతామని ఊహించలేదని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. జస్టిస్ అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. మొన్నటి వరకు న్యాయవాదులుగా ఉన్న తమకు న్యాయవాదుల సమస్యలు ఏమిటో స్పష్టంగా తెలుసని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పీపీ ప్రతాప్‌రెడ్డి, బార్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అడోబ్ సిస్టమ్స్ ప్రతినిధులతో సీఎస్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐటీ రంగంలో భవిష్యత్ నైపుణ్యాలు, సృజనాత్మకత, డిజిటల్ అండ్ క్యారియర్స్‌పై అడోబ్ సిస్టమ్స్ ఇండియా కంపెనీ ప్రతినిధులతో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కేజోషి చర్చించారు. బుధవారం బీఆర్కేభవన్‌లోని తన చాంబర్‌లో వారితో సమావేశమయ్యారు. ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి సుప్రీత్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైకోర్టులో చేపట్టిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతమైందని టీఆర్ఎస్ న్యాయవాదులు తెలిపారు. ఈ మేరకు సభ్యత్వ నమోదు పుస్తకాలను తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ ప్రధా న కార్యదర్శి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కల్యాణ్‌రావు, రాము, మురళీధర్, రవిశంకర్ పాల్గొన్నారు.

నానమ్మ, తాతయ్యలకు మనుమలే పంతుళ్లు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని నానమ్మలకు, తాతయ్యలకు చదువుకున్న మనుమలే పంతుళ్లు కానున్నారు. రాష్ట్ర వయోజన విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి అందుకు ఆదేశాలు జారీచేశారు.. రాష్ట్రంలో 50 ఏండ్లకు పైబడిన వయోజనులకు వచ్చేనెల 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో చదువు నేర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించాలని కలెక్టర్లు, డీఈవోలను ఆదేశించారు. రాష్ట్రంలో 66.54 శాతం ఉన్న అక్షరాస్యతను వంద శాతానికి పెంచాలన్నారు. 50ఏండ్లు దాటినవారు 40 లక్షల మంది ఉండగా, నిరక్షరాస్యులు కోటిమంది ఉన్నారని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలపై విచారణ వాయిదా

కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కోరిన మున్సిపల్‌శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 132 మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల నిర్వహణ అంశంలో దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ మరోసారి వాయిదాపడింది. చీఫ్‌జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్లు దాఖలుచేసిన అఫిడవిట్లపై స్పందించేందుకు ప్రభుత్వానికి 12 రోజుల సమయం ఇస్తూ.. వచ్చేనెల 9కి విచారణను వాయిదా వేసింది. మున్సిపాల్టీల్లో వార్డుల విభజనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని చట్టసభల సభ్యులకు సమాచారం ఇచ్చామని, వారి అభిప్రాయాలు తీసుకున్నాకే ప్రక్రియను చేపట్టామని మున్సిపల్‌శాఖ గతవారం పూర్తివివరాలో అదనపు కౌం టర్‌ను దాఖలు చేసింది. దీనికి ప్రతిగా పిటిషనర్ తరపు న్యాయవాదులు.. వార్డుల విభజనపై తమ అభిప్రాయాలు తీసుకోలేదని పలువురు ఎంపీలు ఇచ్చిన లిఖితపూర్వక వాంగ్మూలాలను హైకోర్టుకు సమర్పించారు.

పదిరోజుల్లో బీమా మొత్తం ఇవ్వాలి

- మరింత సమర్థంగా రైతు బీమా పథకం అమలుచేయాలి
- వ్యవసాయ, బీమా, ఐటీ సంస్థల ప్రతినిధులతో పార్థసారథి

ఎల్ఐసీ, వ్యవసాయశాఖ, ఎన్ఐసీ, ఐటీ అధికారులతో బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతేడాది తలెత్తిన సమస్యలను అధిగమించి మరింత సమర్థంగా మార్గదర్శకాలకు అనుగుణంగా పదిరోజుల్లోనే రైతుబీమా పథకం క్లెయిమ్స్ సెటిల్‌చేయాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి రాష్ట్రస్థాయి అధికారుల సమన్వయంతో రైతుబీమా విజయవంతంగా అమలైందన్న ఆయన.. ఈ పథకం చిన్న, సన్నకారు రైతుకుటుంబాల్లో భరోసా నింపిందని చెప్పారు. పథకం అమలుతీరుపై ప్రపంచ ఆహారసంస్థతోపాటు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు, పొరుగు రాష్ట్రాలు కూడా ప్రశంసించాయని అన్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ నెల 14 నుంచి అమల్లోకి వచ్చిన రైతుబీమా పథకంపై ఎల్ఐసీ, వ్యవసాయశాఖ, ఎన్ఐసీ, ఐటీ అధికారులతో బుధవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. మొదటివిడుత సేకరించిన రైతుల డాటాను యథావిధిగా రెండోవిడుతకు వినియోగిస్తూ అందులో 60 ఏండ్లు దాటిన వారిని గుర్తించాలని సూచించారు. బీమా రెన్యువల్ అయిన రైతులందరికీ ఆగస్టు 14 నుంచి బీమా వర్తిస్తుందని తెలిపారు. మొదటి విడుతలో పేర్లు, ఆధార్ నంబర్, నామిని వివరాలు తప్పుగా నమోదుకావడంతో బీమా చెల్లింపులు నిలిచిపోయాయని, అలాంటి వాటిని పూర్తిగా పరిశీలించాలని సూచించారు. డెత్ సర్టిఫికెట్‌లోని సమాచారానికి ఆధార్‌కార్డు సమాచారానికి వ్యత్యాసం ఉంటే క్లెయిమ్స్‌కు ఇబ్బంది తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక ఫార్మాట్‌లో డెత్ సర్టిఫికెట్ జారీచేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఎల్ఐసీ సెంట్రల్ ఆఫీస్ ముంబై అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి ఆర్పీ సింగ్, డిప్యూటీ సెక్రటరీ సూర్యనారాయణ, ప్రతినిధులు సవిత గోపి, వ్యవసాయశాఖ అదనపు కమిషనర్ విజయకుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లోలు



నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఉప్పొంగుతున్న గోదావరి జలాలు

జలాభిషేకం

- నాగార్జునసాగర్‌కు 29 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌లో 13.07 టీఎంసీల జలాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా, గోదావరి బేసిన్లలోని పలు ప్రాజెక్టులకు స్వల్పంగా ఇన్‌ఫ్లోలు నమోదవుతున్నాయి. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలకు పదివేల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండగా.. కర్ణాటక అధికారులు నదిలోకి విడుదల చేయడం లేదు. ఉజ్జయిని నుంచి 1200 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే ద్వారా దిగువకు విడిచిపెడుతున్నారు. జూరాల జలాశయానికి 4,500 క్యూసెక్కుల వరద వస్తుండగా.. కరంటు ఉత్పత్తి ద్వారా 6,340 క్యూసెక్కుల జలాలను దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా 11వేల క్యూసెక్కులకుపైగా నీటిని విడిచిపెడుతున్నారు. బుధవారం శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. నాగార్జునసాగర్‌కు 29 వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండగా.. పులిచింతలకు మాత్రం వరద నిలిచిపోయింది.

సాగుతున్న ఎత్తిపోత

గోదావరి బేసిన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు లింక్–2 లో ఎత్తిపోతలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి.రాజరాజేశ్వర జలాశయానికి 10,289 క్యూసెక్కుల మేర కాళేశ్వరం జలాలు వస్తున్నాయి. బుధవారం సాయంత్రం వరకు రిజర్వాయర్‌లో 13.07 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆరో ప్యాకేజీ ధర్మారం మండలంలోని నంది పంప్‌హౌస్‌లో 1,2,3 మోటర్ల ద్వారా ఎత్తిపోతలు సాగుతున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. రాజరాజేశ్వర జలాశయం బ్యాక్‌వాటర్ 19 కిలోమీటర్ల మేర నిండుగా ఉన్నది. సిరిసిల్ల మానేరు కరకట్ట దగ్గర గోదావరి జలాలకు టీఆర్ఎస్ గంభీరావుపేట నేతలు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పీఏ గన్‌రాజ్ పూజలు నిర్వహించారు. మరోవైపు కడెం జలాశయానికి 519 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్‌కు 1,006 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తున్నది.

వివిధ ప్రాజెక్టుల్లో బుధవారంనాటి నీటిమట్టాల వివరాలు

రిజర్వాయర్	ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1704.72	129.72	128.19	10,000	10,000
నారాయణపుర	1615.00	1614.93	37.64	37.59	11,078	7,100
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	1,482	4,350
జూరాల	1045.00	1044.42	9.66	9.30	4500	6340
తుంగభద్ర	1633.00	1633.00	100.86	100.86	12,035	11,846
శ్రీశైలం	885.00	880.70	215.81	191.65	0	31,842
నాగార్జునసాగర్	590.00	588.80	312.05	308.47	29,059	18,795
పులిచింతల	175.00	173.42	45.77	43.35	0	10,000
సింగూరు	1717.93	1670.48	29.91	0.46	0	20
నిజాంసాగర్	1405.00	1368.54	17.18	0.15	0	10
శ్రీరాంసాగర్	1091.00	1063.50	90.31	18.02	1,006	400
లోయర్‌మానేర్	920.00	881.80	24.07	3.51	0	204
శ్రీరాజరాజేశ్వర	1043.31	1020.67	25.873	13.07	11,088	83
కడెం	700.00	697.45	7.60	6.95	519	803
ఎల్లంపల్లి	485.56	474.41	20.18	11.86	0	0

ప్రస్తుత సెక్రటేరియట్ స్థానంలో నూతన భవనం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అక్కడి కార్యాలయాల సామాగ్రిని తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బీఆర్కేభవన్‌లోని సెక్రటేరియట్‌కు తరలిస్తున్న కూలీలు

- హైదరాబాద్, నమస్తేతెలంగాణ

96.98 లక్షల ఎకరాల్లో సాగు

- తాజా నివేదికలో వెల్లడించిన వ్యవసాయశాఖ
- తొమ్మిది జిల్లాల్లో తక్కువ వానలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వానకాలం పంటల సీజన్ ముమ్మరంగా సాగుతున్నది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పంటల సాగు విస్తీర్ణం దాదాపు కోటి ఎకరాల చేరువలోకి వచ్చింది. వానకాలంలో అన్ని పంటలు సాధారణ సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు ఏకంగా 96.98 లక్షల ఎకరాల్లో సాగయినట్టు వ్యవసాయశాఖ బుధవారం తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇందులో వరి సాధారణ సాగు విస్తీర్ణం 24.11 లక్షల ఎకరాలు కాగా, 23.21 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 43.12 లక్షల ఎకరాలకుగాను ఏకంగా 44.51 లక్షల ఎకరాల్లో సాగయింది. ఆహారధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 48.25 లక్షల ఎకరాలుగా ఉండగా, 42.47 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వీటిలో పప్పుధాన్యాల సాధారణ సాగువిస్తీర్ణం 10.37 లక్ష ల ఎకరాలకుగాను 9.03 లక్షల ఎకరాల్లో, కంది 93 శాతం, మొక్కజొన్న 73 శాతం సాగైంది. ఇదిలాఉండగా సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, వికారాబాద్, జోగుళాంబ గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో లోటు వానలు కురిసింది.

26న ఎంపీలతో రైల్వే జీఎం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్తగా అవసరమైన రైల్వే ప్రాజెక్టులపై ప్రతిపాదనలు అందించడానికి లోక్‌సభ సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా సెప్టెంబర్ 26న హైదరాబాద్‌లో భేటీ కానున్నారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు లోక్‌సభ సభ్యులు.. వారి నియోజకవర్గాల పరిధిలో అవసరాలు, కొత్త ప్రతిపాదనలను అందించాలని గజానన్ మాల్యా సూచించారు. కొత్త లైన్లు, స్టేషన్ల ఆధునీకరణ, కొత్త రైళ్లు తదితర అంశాలపై ప్రతిపాదనలు పంపించాలని కోరారు.

తగ్గిన రైలు పట్టాల లోపాలు

రైలు పట్టాల లోపాలను తగ్గించేందుకు అల్యూమినో–థర్మిక్ (ఏటీ) వెల్డింగ్ నాణ్యతను మెరుగుపరిచిన దక్షిణ మధ్య రైల్వేను రైల్వేబోర్డు ప్రశంసించింది. పశ్చిమ, ఈశాన్య సరిహద్దు (నార్త్ ఫ్రాంటియర్) రైల్వేలతో పాటు దక్షిణ మధ్య రైల్వే ఈ విధానాన్ని అమలుచేస్తున్నాయి. ఏటీ వెల్డింగ్‌ను ఉపయోగించడానికి దక్షిణ మధ్య రైల్వే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి పట్టాల వెల్డింగ్ విభాగంలో అమలుపరిచింది. లోహరహితంగా పట్టాల జాయింట్లను తయారుచేసేందుకు, రైలు పట్టాల వెల్డింగుల్లో వైఫల్యాలను నివారించేందుకు వెల్డింగులు ఉపయోగపడుతాయి. దీనికి కృషిచేసిన అధికారులు, ఉద్యోగులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా ప్రశంసించారు.

అనుబంధరంగాలతోనే అదనపు ఆదాయం

- ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి
- వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలపై అంతర్జాతీయ సదస్సు

వ్యవసాయం, పశుసంవర్ధకరంగాలపై నిర్వహించిన అంతర్జాతీయసదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డబ్ల్యూఆర్ రెడ్డి, దేవీ ప్రసాద్, శ్రీనివాస్‌రావు తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులు వ్యవసాయం ద్వారానే ఆదాయం పెంచుకోవడం కష్టమని.. వ్యవసాయ అనుబంధరంగాలను చేపడితే అదనపు ఆదాయం లభిస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్డీ) డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి అన్నారు. ప్రతిరైతూ వ్యవసాయ అనుబంధరంగాల్లో ఏదో ఒకదానిని చేపట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ లైఫ్‌సైన్సెస్ సొసైటీ, పసురా గ్రీన్ విజనరీస్, ఎండ్లింగ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సంస్థలు సంయుక్తంగా హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నిర్వహించిన వ్యవసాయం, పశుసంవర్ధకరంగాలపై అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయం, పాడిపరిశ్రమరంగాల్లోకి యువత పెద్దఎత్తున రావాలని సూచించారు. పోషకాహారలోపాన్ని శాశ్వతంగా తొలగించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ పోషణ అభియాన్ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు తాత్కాలికంగా ఉపశమనమేనని.. అవిశాశ్వత పరిష్కారం కాదన్నారు. పంటలకు అదనపు విలువ జోడింపు పద్ధతులను కల్పించినప్పుడే 2022 నాటికి రైతుల ఆదాయాలు రెట్టింపవుతాయని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జువ్వాడి దేవీప్రసాద్ రావు, నారమ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ రత్నాకర్‌రావు, హెచ్‌సీయూ డిప్యూటీ వీసీ జీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రెసాలో టీజీటీఏ విలీనం

ట్రెసా ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌కుమార్ ఎన్నిక

మలక్‌పేట: రెవెన్యూశాఖ పటిష్టతకు, ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం పనిచేయనున్నట్టు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగా రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్ చెప్పారు. బుధవారం మలక్‌పేట సలీంనగర్‌లోని రెవెన్యూభవన్‌లో జరిగిన సమావేశంలో రెండు సంఘాల ఈసీ కార్యవర్గసభ్యుల ఆమోదం మేరకు తెలంగాణ గెజిటెడ్ తహసిల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ)ను ట్రెసాలో విలీనంచేశారు. టీజీటీఏ అధ్యక్షుడు గౌతమ్‌కుమార్‌ను ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ట్రెసా మాజీ ప్రధాన కార్యదర్శి ఎం నారాయణరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంజుల, బీ వెంకటేశ్వర్‌రావు, మన్నె ప్రభాకర్‌రావు, రవీందర్, సంతోష్, నిరంజన్, సీసీఎల్ఏ అధ్యక్షుడు ఎల్లారెడ్డి రమణారెడ్డి, మనోహర్ చక్రవర్తి, సీఎల్‌బీ శాస్త్రి, శుక్లా రాములు, బానాల రాంరెడ్డి, టీజీటీఏ అసోసియేట్ అధ్యక్షుడు పూల్‌సింగ్, నాయకులు రాజ్‌కుమార్, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, మధుసూదన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

epaper.ntnews.com

మనమిప్పుడు మన దేశ సరిహద్దుల గురించి మాట్లాడుకుంటున్నాం. కానీ మన సరిహద్దులు మరోవిధంగా ఉన్నాయి. మనం మన సరిహద్దులను తిరిగి గీసుకోవాలి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా, గిల్గిత్, బాల్టిస్థాన్ ప్రాంతాలను కూడా దేశంలో కలుపుకొని మనం కొత్త దేశ చిత్రపటాన్ని గీసుకోవాలి.

జితేంద్రసింగ్, కేంద్ర మంత్రి

ఉత్తరప్రదేశ్‌లో మహిళలకు రక్షణ లేదు. స్వామి చిన్మయానంద్‌పై ఫిర్యాదు చేసిన 'లా' విద్యార్థి కనిపించకుండాపోయింది. ఇది మరో 'ఉన్నావ్' లాంటిదే. బీజేపీ నేతలకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేసి, న్యాయం పొందే పరిస్థితి లేదు. ఫిర్యాదుదారుల ప్రాణాలకు కూడా రక్షణ లేదు.

ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

చరిత్రలో నేడు



1831

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేసిన మైఖెల్ ఫారడే.

1862

రెండో బుల్ రన్ యుద్ధం. అమెరికా అంతర్యుద్ధంలో వర్జీనియా, మనస్సాస్‌లో సంకీర్ణసేనల విజయం.

1947

భారత రాజ్యాంగ రచనా కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నియామకం.

అభద్రతాభావం ప్రతిదాన్నీ అనుమానించేలా చేస్తుంది. ఇప్పుడు కాంగ్రెస్‌ను ఇదే వెంటాడుతున్నది. కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రధాని మోదీపై వ్యక్తంచేసిన అభిప్రాయం పట్ల కేరళ కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. వెంటనే వివరణ ఇవ్వాలని కోరింది. మోదీ మంచి పనులు చేసినప్పుడు మెచ్చుకుంటే తప్పేమీ లేదని మోదీనుద్దేశించి థరూర్ అన్నారు. గతంలో జైరాం రమేశ్ కూడా మోదీ చేసిన ప్రతిదాన్నీ తక్కువచేసి చెప్పటం తగదన్నారు. ఏదేమైనా పార్టీలకు అతీతంగా మంచిని గుర్తించే సంస్కృతి హరించుకుపోవటమే దీనికి తార్కాణం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

కర్ణాటకలో బీజేపీ అధికారం చేపట్టి నెలరోజులు కావస్తున్నా ఇంకా మంత్రివర్గ నియామకం జరుగలేదు. సీఎం యడ్యూరప్ప అన్నివర్గాలను సంతుష్టి పర్చేందుకు చేస్తున్న కసరత్తు కొలిక్కి రాక పోవటమే దీనికి కారణం. మంత్రివర్గంలో 34 మందిని తీసుకునే అవకాశం ఉన్నా 17 మందితోనే సరిపుచ్చారు. మిగతావారి ఎంపిక కత్తిమీద సాములా మారింది. మరోవైపు సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఓ డిప్యూటీ సీఎం నియామకంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ అధికారం చేజిక్కించుకున్నంత సులువుగా పాలనను కొనసాగించటం జరుగదని తెలిసివస్తున్నది.

ది హిందూ

నిష్ఫల చర్చలు!

ఫ్రాన్స్‌లోని బియారిట్జ్ నగరంలో జీ 7 దేశాల శిఖరాగ్ర సదస్సు అత్యంత పేలవంగా సాగడం వర్తమాన అంతర్జాతీయ రాజకీయ-ఆర్థిక పరిస్థితికి నిదర్శనం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెడసరి వైఖరి మూలంగా యూరప్ దేశాలతో ఏకాభిప్రాయం సాధించలేకపోయారు. వాతావరణ మార్పు సమస్యపై చర్చలకు ట్రంప్ కనీసం హాజరుకాకపోవడం ఆయన మొండివైఖరిని తెలుపుతున్నది. అమెరికా చైనా వాణిజ్య యుద్ధ ప్రభావం ఇతర దేశాల మీద కూడా పడుతున్నది. రెండు దేశాల మధ్య సఖ్యత కుదుర్చడానికి యూరప్ దేశాలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇరాన్ సమస్యపై అమెరికా, యూరప్ దేశాల వైఖరులు భిన్నంగా ఉన్నాయి. ఈ వివాదాన్ని కొలిక్కి తేవడానికి ఫ్రాన్స్ తీవ్ర ప్రయత్నం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి జావేద్ జరీఫ్ జీ 7 దేశాల సమావేశ స్థలికి చేరుకొని ఫ్రాన్స్, బ్రిటన్, జర్మన్ అధికారులతో చర్చలు జరిపారు. వచ్చే కొద్దివారాలలో రాజీ కుదురుతుందని అంటున్నారు. కానీ సౌదీ అరేబియా ముందు పెట్టి గల్ఫ్ దేశాల చిత్రపటాలు మార్చాలనే భారీ అజెండాతో ఉన్న అమెరికా ఇరాన్‌లోకి పాలక వ్యవస్థను కూల్చివేయాలనే పట్టుదలతో ఉన్నది. ఈ నేపథ్యంలో రాజీ కుదుర్చడం అంత సులభం కాదు. రష్యాను జీ 7 కూటమిలోకి తేవాలని ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మిగతా సమస్యలు ఎట్లా ఉన్నా జీ7 పారిశ్రామిక దేశాల కూటమి కనుక కనీసం ఆర్థిక అంశాల పరిష్కారానికి పూనుకోవలిసింది. ప్రపంచాన్ని పీడిస్తున్న ఆర్థికమాంద్యంపై అర్థవంతమైన చర్చ సాగనేలేదు. ప్రపంచీకరణ ప్రారంభమైన తర్వాత యూరప్ దేశాల ఆర్థికవ్యవస్థలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఆర్థిక అసమానతలు సామాజిక సంక్షోభాలకు దారితీస్తున్నాయి. ఈ సామాజిక అనిశ్చితిని ఉపేక్షిస్తే ఆర్థిక వ్యవస్థలు, పాలకవ్యవస్థలు కుప్పకూలిపోతాయి. ఒకవైపు ప్రపంచీకరణ నేపథ్యంలో అమలవుతున్న ఆర్థికసంస్కరణలు, మరోవైపు ట్రంప్ వంటి జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టే నాయకులు ప్రపంచాన్ని మరింత సంక్షోభం వైపు నెట్టే సూచనలు కనిపిస్తున్నప్పటికీ, జీ7 చర్చలు అందుకు దీటుగా సాగలేదు.

ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు ఇతర దేశాలలో కార్యాలయాలు లేకుండానే వ్యాపారాలు సాగిస్తుంటాయి, సేవలు అందిస్తుంటాయి. ఈ కొత్తరకం వ్యాపారాలు ఎక్కువగా మేధో ఆస్తులు కలిగి ఉంటాయి. ఇవి ఒకచోట నిలకడగా ఉండాలని లేదు. తాము వ్యాపారం చేస్తున్న దేశాలలో విస్తారంగా వినియోగదారులను కలిగి ఉంటాయి. కానీ ఉద్యోగులు ఉండరు. లాభాలు మాత్రం భారీగా ఉంటాయి.

ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు బలహీనపడటంతో అమెరికా, నాటో కూటమి యథేచ్ఛగా తమ ఆధిపత్య విధానాలను అమలుచేస్తున్నాయి. రాజ్యాల మధ్య విభేదాలు ఎట్లా ఉన్నా ప్రపంచాన్ని ఉమ్మడిగా పీడిస్తున్న సమస్యలపైన కూడా ఐక్యరాజ్యసమితి చూపే చొరవకు ప్రాధాన్యం లేకుండా పోతున్నది. అందువల్ల జీ 7 వంటి దేశాలు సమావేశమైనప్పుడు ఆర్థికాది అంశాలు చర్చకువచ్చి పరిష్కారానికి నోచుకోవాలనే ఆశాభావం వ్యక్తం కావడం సహజం. కానీ ఇటీవలికాలంలో జీ 7 వంటి ఉమ్మడి వేదికలపై కూడా భావ సారూప్యం కరువైంది. జీ 7 చర్చల్లో ఒక కొలిక్కివచ్చిన అంశంగా డిజిటల్ పన్ను వివాదాన్ని చెప్పుకోవచ్చు. డిజిటల్ టాక్స్‌పై ఎంతో చర్చించిన మీదట అమెరికా, ఫ్రాన్స్ మధ్య అవగాహన కుదిరింది. ఫ్రాన్స్ నుంచి ఆదాయం పొందుతున్న పెద్ద సంస్థలపై ఆ దేశం మూడు శాతం పన్ను విధించింది. దీనిపై అమెరికా ఆగ్రహించింది. తాము ఫ్రెంచి మద్యంపై అదనపు పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆస్ట్రియా, బ్రిటన్, స్పెయిన్, ఇటలీ తదితర దేశాలు కూడా పన్ను వేయడానికి సిద్ధంగా ఉన్నాయి. దీన్ని అరికట్టాలని అమెరికా భావిస్తున్నది. జీ 7 దేశాల సమావేశాల సందర్భంగా అమెరికా, ఫ్రాన్స్ రాజీకి వచ్చాయి. ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిజిటల్ టాక్స్‌పై చర్చలు సాగుతున్నాయి. ఈ చర్చలో ఏ మేర పన్ను విధించాలనేది నిర్ణయం కావచ్చు. అంతర్జాతీయ ఒప్పందం కుదిరేవరకు ఫ్రాన్స్ మూడు శాతం పన్నును కొనసాగిస్తుంది. ఆ తర్వాత అవసరమైతే ఈ పన్ను వసూళ్ళను ఆయా సంస్థలకు తిరిగి చెల్లిస్తుంది.

సాధారణ వ్యాపారాలకు కేంద్ర కార్యాలయం ఉత్పత్తి లేదా అమ్మకం కేంద్రాలుంటాయి. వీటిపై పన్ను విధించడం సులభం. కానీ డిజిటల్ వ్యాపారాలపై ఇది వీలుపడదు. ఈ వ్యాపారాలు సాగిస్తున్న దేశాలలో సంస్థలు భౌతికంగా నెలకొల్పి ఉండవు. ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు ఇతర దేశాలలో కార్యాలయాలు లేకుండానే వ్యాపారాలు సాగిస్తుంటాయి, సేవలు అందిస్తుంటాయి. ఈ కొత్తరకం వ్యాపారాలు ఎక్కువగా మేధో ఆస్తులు కలిగి ఉంటాయి. ఇవి ఒకచోట నిలకడగా ఉండాలని లేదు. తాము వ్యాపారం చేస్తున్న దేశాలలో విస్తారంగా వినియోగదారులను కలిగి ఉంటాయి. కానీ ఉద్యోగులు ఉండరు. లాభాలు మాత్రం భారీగా ఉంటాయి. అందువల్ల ఈ కొత్త ఆర్థిక రంగంపై పన్నుల విధింపునకు విధివిధానాలను ఖరారు చేసుకోవలసి ఉంటుంది. భారత్ కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నది. అమెరికా నుంచి ఒత్తిడులకు గురవుతున్నది. దేశీయంగా ఈ కామర్స్ సంస్థలను వృద్ధి చేసుకోవడంతోపాటు స్వీయ పన్ను వ్యవస్థలను రూపొందించుకోవలసి ఉంటుంది. భవిష్యత్తులో ఖరారయ్యే అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా దేశీయ నియమాలు సర్దుబాటు చేసుకోవలసిన పరిస్థితి రావచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిధికి బయటనే బల ప్రదర్శన ద్వారా ఒప్పందాలు కుదుర్చుకోవాలని అమెరికా భావిస్తున్నది. ఈ విషయంలో అమెరికాకు, యూరప్ దేశాలకు కూడా విభేదాలున్నాయి. అందువల్ల ఈ విషయంలో భారత్ జాగ్రత్తగా దృఢ వైఖరితో చర్చలు సాగించవలసి ఉంటుంది.

జనగళం

అభినందనీయం

భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించటం చరిత్రాత్మకం. సింధు విజయం పట్ల సాధారణ అభిమాని నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అభినందనలు, హర్షం వ్యక్తం చేయటం గమనార్హం. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాలనే తన కల నెరవేరిందంటూ సింధు సంతోషాన్ని వ్యక్తంచేశారు. 2020లో టోక్యోలో జరుగనున్న ఒలింపిక్స్ పోటీల్లో కూడా సింధు మరిన్ని పతకాలు సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలి. సింధుతో పాటు సాయిప్రణీత్ కూడా ప్రపంచ ఛాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పథకం సాధించడం హర్షణీయం. ఈ విజయాలు బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతాయ నడంలో సందేహం లేదు.

- మాసగోని రజనీ గౌడ్, బద్దిపల్లి, కరీంనగర్

నిర్ణయం వెనక్కి తీసుకోవాలె

ఈ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలుకాబోయే ట్రాఫిక్ నిబంధనల పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఇంతకుముందు ఉన్న పెండింగ్ ఛాలన్లకు కూడా కొత్త నిబంధనలు వర్తిస్తాయంటూ ఒక వదంతు జోరుగా సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నది. సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు అబద్ధపు వార్తలని పోలీసులు కూడా ప్రకటనలు జారీ చేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

- బోనగిరి వేదేశ్వర్, యాదాద్రి భువనగిరి జిల్లా

దోమలను నివారించాలె

ఈ మధ్య విషజ్వరాలు తీవ్రంగా ప్రబలినాయి. దవాఖానలన్నీ రోగులతో నిండిపోతున్నాయి. దీనికి దోమలు, ఈగలే కారణమని గ్రహించాలి. వానకాలం కావటంతో మురికినీరులో దోమలు పెరిగిపోయాయి. దోమల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జీహెచ్‌ఎంసీ, గ్రామ పంచాయతీ అధికారులు కూడా ఎప్పటికప్పుడు చెత్తకుండీలను మారుస్తూ దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేయాలి.

- కొత్వాల్ ప్రవీణ్‌కుమార్, బేగంపేట, హైదరాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన

టంకశాల అశోక్

'అదే' భావజాలానికి దాసోహమా?

మనదేశంలో ఒక సంప్రదాయికమైన సామాజిక వ్యవస్థ ఉంది. దానిని ఆవరించుకొని ఒక భావజాలం ఉన్నది. వాటిని సృష్టించిన వారు కొన్ని తరగతులను సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేస్తూ వస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన వేల ఏండ్ల చరిత్ర. ఇప్పటికీ కొనసాగుతున్న విషాదగాథ. అటువంటి భావజాలం వల్ల పీడితులైన దళిత బహుజనులలో కొందరు అదే పీడకశక్తుల పార్టీలకు దాసోహమంటున్నారు. తమతోటి బాధిత ప్రజలను నిస్సహాయులుగా గాలికి వదలి, కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పీడకుల భావజాలంతో రాజీపడటం వర్తమాన విషాదం.

కొన్ని తరగతుల వారిని సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేస్తున్న శక్తులు, వాటి భావజాలాలు క్రీస్తుపూర్వం నుంచి ఉన్నాయి. అవి ప్రాచీనకాలంలో, మధ్యయుగాల కాలంలో వివిధ శక్తుల రూపం తీసుకొని వ్యవహరించాయి. భారతదేశంలో ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామికవ్యవస్థలు ఏర్పడిన తర్వాత రాజకీయపార్టీల రూపాన్ని కూడా తీసుకున్నాయి. వాటికి గతనుంచీ గల సామాజిక రూపాలు, సాంస్కృతిక రూపాలు, ఆర్థిక రూపాలు, రాజకీయ రూపాలకు ఈ ఆధునిక రాజకీయపార్టీ రూపాలు అదనం. మరొక విధంగా చెప్పాలంటే, దళిత బహుజన తరగతులను పైన పేర్కొన్న వివిధ రూపాలలో వీరు పీడిస్తూ వస్తున్న చరిత్రకు, ఈ ఆధునిక రాజకీయపార్టీలు ఒక కొత్తముఖం అన్నమాట. ఇతర రాజకీయపార్టీలకు ఈ తరహా పార్టీలకు ఒక కీలకమైన వ్యత్యాసం ఉన్నది. ఇవి ఈ తరగతుల ప్రజలను 'సామాజికంగా-సాంస్కృతికంగా' కూడా వివక్షలు చూపి పీడించే భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇతర పార్టీలలోని శక్తులది ప్రధానంగా ఆర్థిక-రాజకీయ ప్రాబల్యం. అందుకు ఒకమేరకు సామాజికం తోడవుతుంది. కానీ తిరోగామి పార్టీలు, శక్తుల పీడనలో, వాటి మౌలిక భావజాలంలో 'సామాజిక-సాంస్కృతిక' కోణాలకు ప్రధాన స్థానం ఉంటుంది. ఆర్థిక-రాజకీయ కోణాలతో కనీసం సమాన స్థానం ఉంటుంది. అందువల్ల ఈ భావజాలశక్తులు ఎక్కువ ప్రమాదకరమైనవి. వీటితో రాజీపడటం, స్వప్రయోజనాల కోసం వాటితో చేతులు కలపటం అతి ప్రమాదకరమైన స్వార్థమవుతుంది. తమవారికి ద్రోహం చేయటమవుతుంది. అయినా కొందరు నాయకులు ఆ పనిచేస్తున్నారు.

ఇటువంటి విచారకర పరిస్థితులను మనం ఇప్పుడు చూస్తున్నాము. ఒకానొక సంప్రదాయిక భావజాలం వల్ల బాధితులైన వర్గాలకు చెందిన వారు గత చరిత్రను, వర్తమాన వాస్తవాలను విస్మరించి అదే భావజాలపు పార్టీలలో చేరటం ఇతర రాష్ట్రాలలో, జాతీయస్థాయిలో కొంతకాలం కిందటే మొదలైంది. ఇటీవల తెలంగాణలోనూ కన్పిస్తున్నది. ఈ ధోరణి మంచి చెడులను చర్చించేముందు, అసలు ఈ ధోరణి ఎపుడు, ఎట్లా మొదలైందో అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. ఈ ధోరణిలో రెండు దశలు, రెండు స్థాయిలు ఉన్నాయి. ఒకటి గతకాలపు దశ, రెండు ఆధునిక దశ. దళిత బహుజనులతో సహా సాధారణ ప్రజలందరికీ ఆధ్యాత్మిక భావనలు, దైవచింతన సహజమైన రీతిలో ఉండేవి. వాటివల్ల వారు ఒకవైపు తమ భావనలు, చింతనలు తమకు ఉంటూనే, మరొకవైపు ఉన్నతవర్గాల భావనలు, చింతనలతో కూడా సంబంధం కలిగి ఉండేవారు. ఆధ్యాత్మికత, దైవత్వభావనల స్వరూప స్వభావాలు అటువంటివి కావటం వల్ల ఈ ద్వంద్వత్వం ఉండేది. ఇందువల్ల రెండు తరగతుల మధ్య కొంత ఏకత్వం, కొంత ఘర్షణ కూడా ఉండేవి.

ఇదే స్థితి సమాజం, ఆర్థికం, రాజకీయాలు, ఆధునికం కావటం మొదలైన తర్వాత కొనసాగింది. అదే సమయంలో ప్రాచీనకాలంతో, మధ్యయుగాలతో పోల్చినపుడు నెమ్మదిగా బలహీనపడటం మొదలైంది. ఆర్థిక, రాజకీయరంగాలు ఆధునికమవుతుండటం ఇందుకు కారణం. ఈ రంగాలు ఆధునికం కావడమంటే దళిత బహుజనులతో సహా అన్నివర్గాల వారి జీవితాలలో ఈ రెండురంగాల ప్రాధాన్యం పెరుగుతూ పోవడమన్నమాట. తిరిగి ఇదొక ద్వంద్వస్థితి. గత కాలంలో వలె ఆధ్యాత్మికత, దైవచింతన వర్తమానంలోనూ కొనసాగుతూనే, ఆర్థిక-రాజకీయరంగాల ప్రాధాన్యాలు ఆధునీకరణల మూలంగా గతంకన్న పెరుగుతాయి. ఈ పెరుగుదల ఏ స్థాయికి చేరుతుందో గమనించండి.

ఆధ్యాత్మిక, దైవచింతనల కోసం ఆర్థిక-రాజకీయ ప్రయోజనాలను వదులుకోవటం లేదా ఉపయోగించుకోవటం ఎప్పుడూ ఉన్నదే. అట్లా వదులుకోవటాన్ని గాని లేదా ఉపయోగించుకోవటాన్ని గాని అందరూ ఒకేవిధంగా చేసి ఉండరు. అది వారి సామాజిక-ఆర్థిక స్థాయినిబట్టి, ప్రయోజనాలను బట్టి, భక్తి తీవ్రతను బట్టి ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఈ వ్యవహారణలో ఒక రాజుకు, ఒక వ్యాపారికి, ఒక దళిత బహుజనుడికి మధ్య తేడాలు తప్పక ఉండే ఉంటాయి. అట్లా ఈ వదులుకోవటాలు, ఉపయోగించుకోవటాలు గతంలో ఉండిన తీరుకు, ఆర్థిక-రాజకీయాలు ఆధునిక దశలోకి ప్రవేశించిన తర్వాత కనిపించే తీరుకు తేడా ఉంటుంది. ఈ విషయమై పరిశోధనలు జరిగాయో లేదో తెలియదు గాని, తార్కికంగా ఆలోచించినపుడు, ప్రాచీనకాలం కన్న మధ్యయుగాల కాలానికి, మధ్యయుగాల కన్న ఆధునిక కాలానికి తేడాలు తప్పక ఉండి ఉండాలి. లేనట్లయితే ఆధునికత అన్నదే ఒక అతార్కికమైన దృక్పథం అవుతుంది.

గతాన్ని వదిలివేసి ఆధునికానికి, వర్తమానానికి వద్దాం. దళిత బహుజనులు తమ ఆధ్యాత్మికతను, దైవచింతనలను కొనసాగిస్తూనే అందుకోసం తమ ప్రత్యేక వేదికలను, భక్తి ధోరణులను ఎంచుకోవటం ఇప్పుడు ఇంకా ప్రస్ఫుటంగా కనిపించసాగింది. ఇది అంతకుముందటి ఉన్నత తరగతుల వారి సాంప్రదాయిక ధోరణులకు, నిమ్న తరగతుల వారి జానపద ధోరణులకు ఆధునికమైన కొనసాగింపు అనవచ్చు. ఇవి స్థూలంగా చూసినపుడు ఆధ్యాత్మిక, దైవచింతనలే అయినా వాటివెనుక దాగి సామాజిక, సాంస్కృతిక, రాజకీయమైన ఆలోచనలు కూడా ఉండేవి అంటే పొరపాటు కాబోదు. భక్తి సాహిత్యకాలాన్ని విశ్లేషించినపుడు కన్పించేది ఇదే. అనగా, పైన ప్రస్తావించినట్లు రెండు ధోరణుల మధ్య ద్వంద్వత, అంతర్లీనమైన ఘర్షణ ఉండేదన్నమాట. వాస్తవానికి దళిత బహుజనుల ఈ ప్రత్యామ్నాయ ధోరణిని సహించని ఉన్నతవర్గాల వారు, ఈ తరగతులపై దండనలకు పాల్పడిన ఉదాహరణలు తక్కువేమీకాదు.

ఈ పరిణామ క్రమాలు గత వందేండ్లలో మరొక దశలోకి ప్రవేశించాయి. బ్రిటిష్ వలస పాలనా కాలంలో ప్రకృతి వనరులను వినియోగంలోకి తెచ్చి కొత్త సంపదలను సృష్టించటం వేగాన్ని పుంజుకున్నది. ఆధునిక సాంకేతికతలు, కమ్యూనికేషన్లు, దేశవిదేశీ మార్కెట్లు ఇందుకు ఊపునిచ్చాయి. దళిత బహుజనులు ప్రాచీనకాలంలో బౌద్ధంలోకి, మధ్యయుగాలలో ఇస్లాంలోకి మారటాలు జరుగగా, పాశ్చాత్యుల కాలంలో క్రైస్తవంలోకి మతాంతరీకరణలు చెందారు. ఆధ్యాత్మికత, దైవచింతనల కోసం తమ ప్రత్యామ్నాయ వేదికలను ఏర్పాటుచేసుకునే ధోరణి కూడా బలపడింది. పరిణామక్రమాలు ఒకవైపు ఈవిధంగా ఉండగా, మరొకవైపు వలసకాలపు అభివృద్ధి ఈ దళిత బహుజన తరగతులను నెమ్మదిగా ఆధునికత వైపు నెట్టసాగింది. చదువులు, చిన్నచిన్న ఉద్యోగాలు, చిన్నచిన్న వ్యాపారాలు, కౌలు వ్యవసాయాలు, గనుల్లో కమ్యూనికేషన్ పనులలో ఉత్పత్తిరంగాలలో పట్టణాల్లో కార్మికులుగా మారటం మొదలైంది. స్వాతంత్ర్యం వచ్చేనాటికే ఈ వర్గాల నుంచి ఒక కొత్త తరగతి రూపుదిద్దుకోసాగింది. ఆ తరగతి నుంచే చదువుల వాళ్ళు, డబ్బుల వాళ్ళు, రాజకీయల వాళ్ళు చిన్నగా బయల్దేరారు. అందులో కొందరు తమ అభోజగత్ సహోదరులను ఇంకా దృష్టిలో ఉంచుకొని వారికోసం పాటుపడ చూడగా, కొందరు తమకు లభించిన చదువు, డబ్బు, రాజకీయం వంటి సాధనాలతో వ్యక్తిగతంగా లాభపడజూస్తూ స్వార్థపరులయ్యారు. వీరి గురించి మొదట అంబేద్కర్, తర్వాత కాన్షీరాం స్పష్టంగానే విమర్శించారు.

> బ్రిటిష్ వలస పాలనాకాలంలో ప్రకృతి వనరులను వినియోగంలోకి తెచ్చి కొత్త సంపదలను సృష్టించటం వేగాన్ని పుంజుకున్నది. ఆధునిక సాంకేతికతలు, కమ్యూనికేషన్లు, దేశవిదేశీ మార్కెట్లు ఇందుకు ఊపునిచ్చాయి. దళిత బహుజనులు ప్రాచీనకాలంలో బౌద్ధంలోకి, మధ్యయుగాలలో ఇస్లాంలోకి మారటాలు జరుగగా, పాశ్చాత్యుల కాలంలో క్రైస్తవంలోకి మతాంతరీకరణలు చెందారు. ఆధ్యాత్మికత, దైవచింతనల కోసం తమ ప్రత్యామ్నాయ వేదికలను ఏర్పాటుచేసుకునే ధోరణి కూడా బలపడింది. పరిణామక్రమాలు ఒకవైపు ఈవిధంగా ఉండగా, మరొకవైపు వలసకాలపు అభివృద్ధి ఈ దళిత బహుజన తరగతులను నెమ్మదిగా ఆధునికత వైపు నెట్టసాగింది.

ఇటువంటి తరగతి ఒకసారి రూపుదిద్దుకున్న తర్వాత అది ముందుకు వెళ్లేందుకు రెండు మార్గాలుంటాయి. ఒకటి, తమవద్ద అవసరమైన వనరులు ఉన్నందున తమ అభోజగత్సహోదరులను వెంట తీసుకొని వారి సముద్ధరణకు, గౌరవప్రదమైన స్థానాల సాధనకు కృషిచేయటం. రెండు, వారిని తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవటం. ఇందులో రెండవ మార్గాన్ని ఎంచుకున్నవారు తమవర్గాల ప్రాచీన చరిత్రను, మధ్యయుగాల చరిత్రను, ఆధునిక పరిణామాలను అన్నింటిని మరిచి అన్నివిధాలుగా రాజీలు పడుతారు. అన్ని రాజీలలోకి హీనమైనది తమను సామాజికంగా, సాంస్కృతికంగా వివక్షతలతో పీడించి, వేల ఏండ్ల పాటు బానిసలుగా చేసి ఈ రోజున కూడా అవే వివక్షలు చూపించే భావజాలంతో రాజీపడటం. అదేవిధమైన పార్టీలలో చేరటం. ఆర్థిక, రాజకీయ కోణాలు వేరు, సామాజిక-సాంస్కృతిక కోణాలు వేరని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. బలహీన పరిస్థితుల వల్ల, నిస్సహాయత వల్ల ఇతర ప్రత్యామ్నాయ పార్టీల వైఫల్యం వల్ల దళిత బహుజనుల్లోని సామాన్యులు విరుద్ధ భావజాల పార్టీలకు ఓటు వేయటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ వర్గాల్లోని శిష్ట తరగతి స్వార్థం, అవకాశవాదం, ఆ తరహా పార్టీలలో చేరటం మాత్రం అర్థం చేసుకోలేనిది, చేసుకోగూడనిది.

కేరళ వరదలు చెప్తున్న పాఠాలు

జాతీయం

డానియెల్ పర్సోన్స్
క్రిస్టఫర్ స్కిన్నర్

కేరళ మున్నెన్నడూ లేనివిధంగా వరదల ఉధృతితో అతలాకుతలమయ్యింది. 350 మందికిపైగా చనిపోయారు. నాలుగు వేల సహాయక శిబిరాల్లో లక్షమందికిపైగా ఆశ్రయం పొందారు. అంతకుమించిన సంఖ్యలో సర్వస్వం కోల్పోయి ఏ దిక్కూ లేనివారిగా మిగిలారు. వర ద బీభత్సం వాతావరణ మార్పులతోనే వస్తున్నదని చెప్పుకున్నా, వరద ముప్పు ఏటా పెరుగుతూనే ఉన్నది. ఇదొక్క కేరళ విషయమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా వరదలు సృష్టిస్తున్న ఆస్తి, ప్రాణనష్టం నానాటికీ పెరుగుతూనే ఉండటం గమనార్హం. కరువు పీడిత ప్రాంతాలుగా, అనావృష్టి ప్రాంతాలుగా పేరున్న ప్రాంతాలను కూడా ఎప్పుడో ఒకప్పుడు తీవ్ర వరదలు ముంచెత్తుతున్నాయి. సాధారణ వర్షపాతానికి, అంచనాకు మించి కురిసే కుండపోత వానలకు ఆ ప్రాంతాలు వరదనీటిలో మునిగిపోతున్నాయి.

వానకాలం ప్రారంభం కాగానే సాధారణంగా కేరళలో వర్షాలు బాగానే కురుస్తాయి. కానీ ఈసారి ఊహించిన దానికన్నా 42 శాతం వానలు ఎక్కువగా కురిశాయి. ఒక్క జూన్ నెలలోనే 2,300 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆగస్టులో 700 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సరిగ్గా ఇదేవిధంగా 2017లో అమెరికా హూస్టన్‌ను తుఫాన్ ముంచెత్తింది. 1,500 మిల్లీమీటర్ల వాన కురిసింది. తుఫానులు, ఈదురుగాలులతో కురిసే కుంభవృష్టి హార్వేను జలమయం చేసింది. భూ తాపం పెరుగటం మూలంగానే పది శాతం ఎక్కువ వర్షపాతం నమోదవుతున్నదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇలా వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఈ శతాబ్దంలో ఆరు రెట్ల వర్షపాతం పెరిగింది. దీంతో ఆయా ప్రాంతాలు, దేశాల్లో ఉన్న కాలువలు, నదులు, నగరాల్లోనైతే డ్రైనేజీ కాలువలు సరిపోవటం లేదు. దీంతో ఆ ప్రాంతాలన్నీ అకస్మాత్తు వరదల కారణంగా నీటిలో తేలియాడుతున్నాయి.

సాధారణంగా వరదనీటి ప్రవాహాన్ని చెట్లు, వాటి వేళ్లు నియంత్రిస్తాయి. కానీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి విధానాలు, పర్యావరణ నిర్లక్ష్యాల కారణంగా గత 40 ఏండ్లలో సగానికిపైగా అడవి నరికివేతకు గురైంది. 9000 చదరపు కిలోమీటర్ల మేర అడవి కనుమరుగైంది. మరోవైపు నగరీకరణ పెరిగిపోతున్నది. ఈ క్రమంలో వర్షపు నీటికి ఉండే సహజ నిరోధకాలు లేకుండాపోయాయి. దీంతో వర్షపు నీరంతా దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తూ మైదానాలను ఆక్రమిస్తున్నది.

కేరళ వరదలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు చూస్తే.. వరద నీరంతా ఉదా రంగుతో నిండి ఉంటున్నది. అంటే ఆ నీరంతా భూమికోత కారణంగా మట్టి కణాలతో నిండిపోతున్నది. దీనికితోడు కొండచరియలు విరిగిపడటం కూడా పెద్ద సమస్య. ఈ మధ్య చేసిన అధ్యయనాలు తెలిపిందేమంటే.. గత కొన్నేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా వరదలతో భూ ఉపరితలం విపరీతమైన కోతకు గురవుతున్నది. దీంతో ఉపరితలం వ్యవసాయానికి, ఇతర ఉపయోగాలకు పనికిరాకుండ

జమ్ముకశ్మీర్ అభివృద్ధిపై మంత్రుల బృందం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: జమ్ముకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల్లో అభివృద్ధి, ఆర్థిక, సామాజిక అంశాల గురించి చూసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం మంత్రుల బృందాన్ని ఏర్పాటుచేసింది. ఇది అక్టోబర్ 31న ఉనికిలోకి వస్తుంది. న్యాయశాఖమంత్రి రవిశంకర్ ప్రసాద్, సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లోట్, వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, పీఎంవో మంత్రి జితేంద్ర సింగ్, పెట్రోలియంశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఈ బృందంలో ఉంటారని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన అంశాలపై మంత్రుల బృందం దృష్టిపెట్టనుందని, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర అంశాలపై సూచనలు చేయనుందని పేర్కొన్నాయి. మంత్రుల బృందం తొలి సమావేశం సెప్టెంబర్ మొదటివారంలో జరిగే అవకాశం ఉన్నదని తెలిపాయి.

త్వరలోనే అమెరికా-తాలిబన్ ఒప్పందం ఖరారు

కాబూల్: అమెరికా, తాలిబన్ మధ్య ఒప్పందం దాదాపు పూర్తికావొచ్చిందని తాలిబన్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌లో తమ బలగాలను అమెరికా తగ్గించుకోనుంది. ఇందుకు ప్రతిగా తాలిబన్ భద్రతాపరమైన హామీలను ఇవ్వాల్సి ఉంటుంది. ఈ చారిత్రక ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ఇరు పక్షాలు ఇటీవల దోహాలో చర్చలు జరిపాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా దౌత్య కార్యాలయం మాత్రం దీనిపై స్పందించలేదు.

దేశంలో కొత్తగా 75 ప్రభుత్వ వైద్య కాలేజీలు

- 2021-22నాటికి ఏర్పాటు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయం
- అందుబాటులోకి రానున్న 15,700 ఎంబీబీఎస్ సీట్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కొత్తగా 75 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. 2021-22 నాటికి వీటి నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించింది. దీంతో దేశవ్యాప్తంగా అదనంగా 15,700 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు వైద్య కాలేజీలు లేని ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, జవదేకర్ చెప్పారు. బుధవారం వారు క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు

వివరించారు. కనీసం 200 పడకలు గల జిల్లా దవాఖానలు, రెఫరల్ దవాఖానలతో వీటిని అనుసంధానిస్తారన్నారు. 'ఆకాంక్షిత' (వెనుకబడిన) జిల్లాలకు, 300 పడకలు గల జిల్లా దవాఖానలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కేంద్రం పేర్కొంది. రూ.24,375 కోట్ల అంచనా వ్యయంతో వీటిని నిర్మిస్తామన్నది. తద్వారా దేశంలో మరింత మంది వైద్య నిపుణులు అందుబాటులోకి వస్తారని, ప్రస్తుత జిల్లా దవాఖానల్లోని వసతులను సమర్థంగా వినియోగించుకునేందుకు వీలు అవుతుందన్నదన్నది. జిల్లా, రెఫరల్ దవాఖానాల అప్‌గ్రేడింగ్ ద్వారా కొత్త వైద్య కాలేజీలు ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రాయోజిత పథకం ఫేజ్-3లో భాగంగానే ఈ కాలేజీలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపింది. కేంద్రం ఇదివరకే ఫేజ్-1 కింద 58 కాలేజీలు, ఫేజ్-2 కింద 24 కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. మొదటి ఫేజ్‌లో ఆమోదం లభించిన 58 కాలేజీల్లో ఇప్పటికే 39 కాలేజీలు ప్రారంభమయ్యాయి. మిగిలినవి 2021-22నాటికి ప్రారంభంకానున్నాయి.

భారత్‌లో అంతర్భాగం

కశ్మీర్‌లో పాక్ జోక్యానికి తావే లేదు

- లోయలో హింసను ప్రేరేపిస్తున్నదీ పాకిస్థానే
- కాంగ్రెస్ నేత రాహుల్ వ్యాఖ్యలు



వయనాడ్ జిల్లాలో ఎంపీ కార్యాలయం ప్రారంభం అనంతరం ఓ ఫైల్‌ను పరిశీలిస్తున్న రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: జమ్ముకశ్మీర్ అంశం భారత్ అంతర్గతమని, పాకిస్థాన్ జోక్యానికి ఎంతమాత్రమూ అవకాశం లేదని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. కశ్మీర్ లోయలో హింసను రెచ్చగొడుతున్నదీ, హింసాత్మక చర్యలకు మద్దతునిస్తున్నదీ పాకిస్థానేనని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదానికి మద్దతునిస్తున్న దేశం పాకిస్థాన్ అని అందరికీ తెలుసునని పేర్కొంటూ బుధవారం వరుస ట్వీట్లు చేశారు. జమ్ముకశ్మీర్‌పై తప్పుడు ప్రచారాన్ని, అబద్ధాలను సమర్థించుకునేందుకు ఐక్యరాజ్యసమితి (ఐరాస) ముందు దాఖలు చేసిన పిటిషన్‌లో తన పేరును పాక్ 'ద్రోహపూరితంగా' ప్రస్తావించడంపై రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విపక్ష నేతగా తాను ప్రభుత్వంతో పలు అంశాలపై విభేదించవచ్చని, కానీ కశ్మీర్ భారత్ అంతర్భాగం అని స్పష్టం చేశారు. 'నేను ప్రభుత్వం తో చాలా అంశాల్లో విభేదించవచ్చు. కానీ నేను ఒక విషయం ఖచ్చితంగా తెలియజేయదలుచుకున్నా.. కశ్మీర్ అంశం భారత్ అంతర్గత వ్యవహారం. పాక్ గానీ, మరే ఇతర దేశం గానీ జోక్యం చేసుకునేందుకు ఆస్కారమే లేదు' అని పేర్కొన్నారు. 'కశ్మీర్‌లో హింస కొనసాగుతున్నది. ఈ హింసను రెచ్చగొడుతున్నదీ, దానికి మద్దతునిస్తున్నదీ పాకే. అంతర్జాతీయ ఉగ్రవాదానికి ప్రధాన మద్దతుదారు పాకిస్థాన్ అని అందరికీ తెలుసు' అని పేర్కొన్నారు. ఇటీవల కశ్మీర్‌కు వెళ్లిన విపక్షాలు, మీడియాకు కశ్మీరీలపై బలవంతంగా దుర్మార్గపు పాలన సాగిస్తున్నట్లు కనిపించిందని రాహుల్ అన్నారు. కశ్మీరీలు మృత్యుకోరల్లో చిక్కుకున్నారని ఆయన చేసిన వ్యాఖ్య లు వివాదాస్పదమయ్యాయి. దీన్ని పాక్ అస్త్రంగా మార్చుకోవడంతో రాహుల్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో భారత్‌లో కశ్మీర్ అంతర్భాగం అని రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు.

జమ్ముకశ్మీర్, లడఖ్.. భారత్‌లో భాగం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఐరాసకు పాక్ లేఖపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు ఎల్లవేళలా భారత్‌లో అంతర్భాగమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా తెలిపారు. జమ్ముకశ్మీర్‌పై పాక్ తన తప్పుడు ప్రచారాన్ని, అబద్ధాలను సమర్థించుకునేందుకు ద్రోహపూరితంగా తమ పార్టీ నేత రాహుల్ గాంధీ పేరును లాగిందని ఆరోపించారు. పాక్ వంచనపూరిత చర్యలు తిరుగులేని వాస్తవాలను మార్చలేవన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్‌గిత్-హుంజా-బలూచిస్థాన్‌ల్లో మానవ హక్కుల ఉల్లంఘనపై పాక్ జవాబివ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది జూలై 13న బలూచిస్థాన్ అవామీ మూవ్‌మెంట్ ఎన్నికల సభలో జరిగిన 128 మంది అమాయకుల ఊచకోతను ప్రపంచమంతా వీక్షించిందని సుర్జేవాలా గుర్తుచేశారు. పాక్ రాజకీయ నేతలు, సైన్యం పలు ఉగ్రవాద సంస్థలను పోషిస్తున్న వైనంపై పాకిస్థాన్ సమాధానం చెప్పాలన్నారు.

అక్టోబర్ లేదా నవంబర్‌లో

ఇండో-పాక్ యుద్ధం!

ఇదే చివరిది కావొచ్చు ▪ పాకిస్థాన్ రైల్వేమంత్రి రషీద్ సంచలన వ్యాఖ్యలు

ఇస్లామాబాద్, ఆగస్టు 28: కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని రద్దు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నానాయాగీ చేస్తున్న పాకిస్థాన్.. అంతర్జాతీయంగా ఒంటరవుతుండటంతో విలవిలలాడుతున్నది. భారత్‌తో యుద్ధానికి దిగుతామంటూ వరుసగా సంకేతాలు ఇస్తున్నది. తాజాగా ఆ దేశ రైల్వేమంత్రి ఏకంగా అక్టోబర్‌లో యుద్ధం జరుగొచ్చని వ్యాఖ్యానించారు. మరోవైపు భారత్‌ను ఇరుకున పెట్టేందుకు కరాచీ మీదుగా విమానాల రాకపోకలపై పాక్ నిషేధం విధించింది. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను సాకుగా చూపెట్టి ఐరాసకు ఓ లేఖ రాసింది. అక్టోబర్ లేదా నవంబర్‌లో భారత్-పాక్ మధ్య పూర్తిస్థాయి యుద్ధం సంభవించొచ్చంటూ పాకిస్థాన్ రైల్వేశాఖ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీరీల సమస్యల పరిష్కారానికి సమయం ఆసన్నమైందని చెప్పారు. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగే చివరి యుద్ధం కూడా ఇదే కావొచ్చని పేర్కొన్నారు. కశ్మీర్ విషయంలో అవసరమైతే అణుయుద్ధానికి సిద్ధమని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ రెండ్రోజుల కిందట ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ దేశ రైల్వే మంత్రి రషీద్ యుద్ధం గురించి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భారత ప్రభుత్వం జమ్ముకశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిని రద్దు చేయడంపై రషీద్ బుధవారం రావల్పిండిలో మీడియాతో మాట్లాడారు. కశ్మీరీలకు సంఘీభావంగా అండగా నిలువాలని పాక్ ప్రజలను కోరారు. మొహర్రం తర్వాత మరోసారి కశ్మీర్‌లో పర్యటిస్తానని ప్రకటించారు. 'భారత్‌లో ముస్లిం వ్యతిరేక ఆలోచనలు ఉన్నట్టు జిన్నా గతంలోనే అంచనావేశారు. ఇప్పటికీ భారత్‌తో చర్చల గురించి ఆలోచించడం మూర్ఖత్వమే అవుతుంది' అని రషీద్ పేర్కొన్నారు. మరోవైపు వచ్చేనెల న్యూయార్క్‌లో జరుగనున్న ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తేందుకు పాకిస్థాన్ సిద్ధమవుతున్నది. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి షా మహ్మద్ ఖురేషి ధ్రువీకరించారు. ఇస్లామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కశ్మీర్ అంశంపై తమ వాదనను బలంగా వినిపిస్తారని పేర్కొన్నారు.

కరాచీ మీదుగా భారత విమానాలు బంద్

భారత విమానాలు తమ గగనతలం మీదుగా వెళ్లకుండా పాకిస్థాన్ మరోసారి నిషేధం విధించింది. కరాచీ మీదుగా వెళ్లే మూడు గగనతల మార్గాలను మూసివేసింది. ఈ నెల 31 వరకు ఈ నిషేధం కొనసాగుతుందని ఆ దేశ పౌర విమానయాన శాఖ తెలిపింది. దీంతో కరాచీ మీదుగా వెళ్లే భారత విమానాలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత విమానాలు తమ గగనతలంలోకి ప్రవేశించకుండా పాక్ పూర్తిస్థాయిలో నిషేధం విధించనుందని వార్తలు వెలువడిన మరునాడే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. భారత్‌కు పూర్తిగా గగనతలాన్ని మూసివేయాలని తమ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ భావిస్తున్నారని ఆ దేశ శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఫవాద్ చౌధురి మంగళవారం పేర్కొన్న విషయం తెలిసిందే. గగనతలంతోపాటు ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ వాణిజ్యానికి వినియోగించే రోడ్డు మార్గాన్ని కూడా నిషేధించడంపై క్యాబినెట్‌లో చర్చ జరిగినట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలాకోట్ దాడుల అనంతరం భారత విమానాలు రాకుండా పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. తర్వాత మార్చి 27న తిరిగి గగనతలాన్ని తెరిచింది. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో తాజాగా గగనతల ఆంక్షలకు తెరతీసింది.

రాహుల్ వ్యాఖ్యలు సాకుగా ఐరాసకు పాక్ లేఖ

కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ సమస్యగా చేయడానికి ప్రయత్నిస్తున్న పాకిస్థాన్.. తాజాగా ఐరాస మానవ హక్కుల సంఘానికి లేఖరాసింది. పాక్ మానవ హక్కుల శాఖ మంత్రి షిరీన్ మజారీ ఈ లేఖ రాశారు. కశ్మీర్‌లో ప్రజలు మృత్యుకోరల్లో చిక్కుకున్నారని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ కూడా ఆరోపించారని అందులో పేర్కొన్నారు. ఇది కశ్మీర్‌లో తప్పిదాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.ఆమె తన లేఖ పూర్తిపాఠాన్ని ఐరాస మానవహక్కుల సంఘం ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. మరోవైపు బుధవారం పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. కశ్మీర్ అంశంపై ఇరువురు చర్చించారు.

త్వరలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

- జమ్ముకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ప్రకటన
- నేతల నిర్బంధం వారి రాజకీయ భవిష్యత్‌కు మేలు చేస్తుందని వ్యాఖ్య

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో విధించిన ఆంక్షలను ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్‌మాలిక్ సమర్థించుకున్నారు. ఈ ఆంక్షలు ప్రాణనష్టం నిరోధానికి దోహదపడ్డాయన్నారు. జమ్ముకశ్మీర్ ప్రజల సంస్కృతి, గుర్తింపునకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే మూడు నెలల్లో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించి త్వరలోనే కేంద్రం పెద్ద నిర్ణయం తీసుకోనుందన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ రాజకీయ నేతల నిర్బంధంపై వస్తున్న విమర్శలపై ఆయన స్పందించారు. నిర్బంధం.. వారి రాజకీయ భవిష్యత్‌కు దోహదపడుతుందన్నారు. 'నిర్బంధంలో ఉన్నవారికి బుర్ర ఉంటే.. రాజకీయ లబ్ధి పొందొచ్చు. జైలుకెళ్లిన వారే నేతలు అవుతారు. ఎంత ఎక్కువ కాలం జైల్లో ఉంటే.. ఎన్నికల్లో అంత ఎక్కువ లబ్ధి చేకూరుతుంది. నేనూ 30 సార్లు జైలుకెళ్లా. ఇంటికి దూరంగా నన్ను జైల్లో పెట్టారు. వీరిని ఎంచక్కా ఇంటిలోనే నిర్బంధించారు. వీరి రాజకీయ భవిష్యత్‌ను మీరు కోరుకుంటే.. నిర్బంధంపై ప్రశ్నించొద్దు' అని అన్నారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్టు కోబ్రా 208 బెటాలియన్ కమాండెంట్ అమిత్‌కుమార్ బుధవారం తెలిపారు. సుక్మా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆమాపెంట, సన్నెపెంట ప్రాంతాల్లో విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం డీఆర్జీ, ఎస్టీఎఫ్, కోబ్రా 208 బెటాలియన్ భద్రత బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఆమాపెంట ప్రాంతంలో కోమరామ్ ధర్మే అలియస్ ధర్మిని (కేఏఎంఎస్ అధ్యక్షుడు), సన్నెంపెంట ప్రాంతంలో కుంజా దేవాను (8వ ప్లాటూన్ సెక్షన్ సభ్యుడు) అదుపులోకి తసుకున్నట్టు అమిత్ కుమార్ వెల్లడించారు. వీరిలో కుంజ దేవాపై రూ.2 లక్షలు, ధర్మిపై రూ.లక్ష రివార్డులు ఉన్నాయని చెప్పారు.

'అధ్యక్ష' పాలనవైపు దేశం

- కశ్మీర్‌లో అసమ్మతిని బలప్రయోగంతో అణచివేస్తున్నారు
- పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ మండిపాటు

కోల్‌కతా: అధ్యక్ష తరహా పాలన వైపు దేశం అడుగులేస్తున్నదని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యానికి చోటు లేదన్నారు. బుధవారం తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి సంఘం 'తృణమూల్ చాత్ర పరిషత్' వ్యవస్థాపక దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. 'అక్కడ (కేంద్రంలో) ప్రభుత్వ వాణి మాత్రమే వినిపిస్తున్నది. ఒక నేత.. ఒక పార్టీ.. ఒక ఎమర్జెన్సీ. దేశం అధ్యక్ష తరహా ఎన్నికల దిశగా ప్రయాణిస్తున్నదని నేను అనుమానిస్తున్నాను. ఇందుకోసమేనా మన స్వాతంత్ర్య సమర యోధులు పోరాడింది? ఇతర పార్టీలన్నీ ముక్కలు చెక్కలయ్యాయి. కర్ణాటకలో ప్రభుత్వం పతనమైంది. ఏ ఒక్కరూ ఏమీ మాట్లాడలేకపోయారు. పశ్చిమబెంగాల్‌లోనూ అధికారంలోకి వస్తామని వారు చెబుతున్నారు. అదెలా జరుగుతుందో నేనూ చూస్తా' అని వ్యాఖ్యానించారు. కశ్మీర్‌లో అసమ్మతి వాణి వినిపిస్తున్న వారి గొంతులను బలప్రయోగంతో కేంద్రం నొక్కివేస్తున్నదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న తనను దమ్ముంటే అరెస్ట్ చేయాలని కేంద్రాన్ని సవాల్ చేశారు. బీజేపీ ముందు తాను తల వంచబోనని స్పష్టంచేశారు. జమ్ముకశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని తమ పార్టీ వ్యతిరేకించిందని, అందుకే పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందన్నారు. అఖిలపక్ష సమావేశంలో దీనిపై చర్చించి ఉంటే పార్టీ వైఖరి తెలిపే వారమని చెప్పారు. జమ్ముకశ్మీర్ మాజీ సీఎంలు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ పరిస్థితి ఎలా ఉందో ఎవరికీ తెలియదన్నారు. పదవీ విరమణ చేసి 'యస్ మ్యాన్' అని తలలూపే అధికారులను కేంద్రం ముఖ్యమైన సంస్థలకు అధిపతులుగా నియమిస్తున్నదని, అందువల్లే ఆర్బీఐ కేంద్రానికి రూ.1.76 లక్షల కోట్ల నిధులు అందజేసిందన్నారు.

పాక్‌కు అస్త్రంగా మారిన రాహుల్ వ్యాఖ్యలు

బీజేపీ విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 28: కశ్మీర్‌లో పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. రాహుల్ తన వ్యాఖ్యలతో ఐరాసలో భారత్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు పాకిస్థాన్‌కు అవకాశం కల్పించారని కేంద్ర మంత్రి, బీజేపీ నేత ప్రకాశ్ జవదేకర్ విమర్శించారు. కశ్మీర్‌లో హింస, మరణాలు చోటుచేసుకుంటున్నాయని అత్యంత బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసినందుకు జాతికి రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాగ్రహానికి తలవొంచి కశ్మీర్ అంశం భారత్ అంతర్భాగమని రాహుల్ మాట మార్చారని ఎద్దేవా చేశారు. కశ్మీర్‌లో హింస జరుగుతున్న ఆరోపణలు అవాస్తవం అని, ఓటుబ్యాంక్ రాజకీయాల వల్లే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనావిధానం ఎప్పటికప్పుడు మారుతున్నదని అన్నారు. ఈ క్రమంలో అమేథీని వదిలి వయనాడ్‌కు వెళ్లారని జవదేకర్ వ్యాఖ్యానించారు.

ఏచూరి కశ్మీర్ పర్యటనకు

సుప్రీం అనుమతి

- సీపీఎం మాజీ ఎమ్మెల్యే తరిగామిని కలుసుకునేందుకే పరిమితం కావాలని ఆదేశం
- తిరిగి వచ్చాక అఫిడవిట్ దాఖలు చేయాలన్న న్యాయస్థానం
- జామియా వర్సిటీ విద్యార్థి అభ్యర్థనకూ ధర్మాసనం ఓకే



న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌కు వెళ్లేందుకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సుప్రీం కోర్టు బుధవారం అనుమతినిచ్చింది. అయితే సీపీఎం మాజీ ఎమ్మెల్యే తరిగామిని కలుసుకునేందుకు మాత్రమే పరిమితం కావాలని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్‌లు ఎస్ఏ బాబ్డే, ఎస్ఏ నజీర్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. అలాగే జామియా మిలియా ఇస్లామియా కేంద్ర యూనివర్సిటీ విద్యార్థి మహ్మద్ అలీం సయ్యద్ కూడా కశ్మీర్‌కు వెళ్లేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతిని చ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న తమ పార్టీ సహచరుడు తరిగామిని మెరుగైన వైద్య సేవల కోసం ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఏచూరి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఇప్పుడిప్పుడే కశ్మీర్‌లో సాధారణ పరిస్థితి నెలకొంటున్నదని, ఏచూరిని అనుమతినిస్తే కశ్మీర్‌లో 'అపాయకర పరిస్థితులకు దారి తీయొచ్చని కేంద్రం తరపున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనను న్యాయస్థానం పక్కనబెట్టింది. మెహతా వ్యాఖ్యలపై చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ స్పందిస్తూ.. 'ఈ దేశంలోని ఒక పౌరుడు అక్కడికి వెళ్లాలని, అతడి స్నేహితుడు, పార్టీ సహచరుడ్ని కలువాలని కోరుకుంటే మీకెందుకు ఇబ్బంది?' అని ప్రశ్నించారు. ఏచూరి పర్యటన రాజకీయంగా కనిపిస్తున్నదని మెహతా పేర్కొన్నారు. తరిగామి ఆరోగ్య పరిస్థితిపై వైద్య రికార్డులను న్యాయస్థానానికి ముందు సమర్పిస్తామన్నారు. తరిగామికి జడ్ ప్లస్ క్యాటగిరీ భద్రత ఉన్నదని వాదించారు. దీంతో ఏచూరి తన పర్యటన తరిగామిని కలుసుకునేందుకే పరిమితం కావాలని, ఒకవేళ ఏ ఇతర కార్యక్రమాలకు పాల్పడినా ఈ కోర్టు ఉల్లంఘనే అవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఏచూరి తరపు న్యాయవాది రాజు రామచంద్రన్ స్పందిస్తూ.. తరిగామిని ఏచూరి కలుసుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని మాత్రమే తెలుసుకుంటారని చెప్పారు. తరిగామితో ఈ నెల 4న చివరిసారిగా మాట్లాడానని, ఆరోగ్యం సరిగ్గా లేదని చెప్పారని ఏచూరి తెలిపారు. కశ్మీర్‌కు వెళ్లి వచ్చిన తర్వాత అక్కడేం చేశారో అఫిడవిట్ సమర్పించాలని ఏచూరికి ధర్మాసనం ఆదేశించింది.

జామియా విద్యార్థికీ సుప్రీం అనుమతి

జామియా యూనివర్సిటీ విద్యార్థి మహమ్మద్ అలీం సయ్యద్‌కు కశ్మీర్ వెళ్లేందుకు సుప్రీం కోర్టు అనుమతినిచ్చింది. కశ్మీర్ లోయలో ఆంక్షలు విధించిన తర్వాత తన తల్లిదండ్రులను చూడలేదని సయ్యద్ తన పిటిషన్‌లో తెలిపారు. దీంతో అనంత్‌నాగ్‌కు వెళ్లేందుకు సయ్యద్‌కు తగిన భద్రత కల్పించాలని జమ్ముకశ్మీర్ యంత్రాంగాన్ని కోర్టు ఆదేశించింది.

నూతలపాటి ప్రణవ్

ప్రపంచ నైపుణ్య పోటీలో తెలుగు విద్యార్థి ప్రణవ్‌కు రజతం

భువనేశ్వర్, ఆగస్టు 28: ప్రపంచ నైపుణ్య పోటీలో భారత్ సత్తా చాటింది. ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలను సాధించింది. నీటి సాంకేతిక విభాగంలో ఒడిశాకు చెందిన అశ్వర్థ నారాయణ బంగారు పతకం సాధించారు. వెబ్ సాంకేతికతలో తెలుగు విద్యార్థి నూతలపాటి ప్రణవ్ (17) రజతం సొంత చేసుకున్నారు. ఆభరణాల సాంకేతికతలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సంజయ్ ప్రామాణిక్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీలో మహారాష్ట్రకు చెందిన శ్వేతా రత్నపుర కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మొత్తం 63 దేశాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. భారత్ నుంచి 48 మంది పాల్గొన్నారు.

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు సమీక్ష

మొదటిపేజీ తరువాయి...

మరో పిటిషన్‌ను దాఖలు చేసింది. పార్లమెంట్ ఆమోదించిన చట్టం, తదనంతరం జారీ అయిన రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని అందులో ఆరోపించింది. వీటిని చెల్లుబాటు కాకుండా చేయాలని కోర్టును అభ్యర్థించింది. ఎన్సీ ఎంపీలు మహమ్మద్ అక్బర్ లోన్, జమ్ముకశ్మీర్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మసూదీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆర్టికల్ 370 అనేది రాజ్యాంగంలో శాశ్వత నిబంధన అని 2015లో జస్టిస్ మసూదీ తీర్పునివ్వడం గమనార్హం. రక్షణశాఖ మాజీ అధికారులు, బ్యూరోక్రాట్లతో కూడిన బృందం కూడా మరో పిటిషన్‌ను దాఖలుచేసింది. ప్రొఫెసర్ రాధాకుమార్, మాజీ ఐఏఎస్ అధికారి హిందాల్ హైదర్ త్యాబ్జి, ఎయిర్ వైస్ మార్షల్ (రిటైర్డ్) కపిల్ కక్, మేజర్ జనరల్ (రిటైర్డ్) అశోక్ కుమార్ మెహతా, మాజీ ఐఏఎస్ అధికారులు అమితాబ్ పాండే, గోపాల్ పిళ్లెలు ఆ పిటిషన్ దాఖలు చేశారు. ఐఏఎస్‌కు స్వస్తిపలికి రాజకీయ పార్టీ నెలకొల్పిన షా ఫైజల్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ నేత షెహ్లా రషీద్‌లు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇవికాక మరికొన్ని పిటిషన్లు కూడా దాఖలయ్యాయి.

మీడియా మీద ఆంక్షలపై వివరణ ఇవ్వండి

ఆర్టికల్ 370 రద్దు అనంతరం మీడియాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని కేంద్రానికి, జమ్ముకశ్మీర్ పాలనా యంత్రాంగానికి సుప్రీంకోర్టు బుధవారం నోటీసులు జారీచేసింది. కశ్మీర్ టైమ్స్ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా భాసిన్, కాంగ్రెస్ కార్యకర్త తెహ్‌సీన్ పూనావాలా దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వారం పాటు వాయిదా వేసింది. రాష్ట్రంలో విధించిన ఆంక్షల వల్ల స

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9 రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE
కరీంనగర్, గురువారం 29 ఆగస్టు 2019

ఊళ్లోలేరని పట్టా మార్పు

కౌలుదారుకు భూమి బదలాయింపు

- ఆర్డీవో కోర్టులో కేసు గెలిచినా అందని పట్టాదారు పాస్‌పుస్తకం
- వరంగల్ రూరల్ జిల్లా నడికూడలో రెవెన్యూ అధికారుల లీలలు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు నల్లాని పుష్పలీల

పరకాల, నమస్తే తెలంగాణ: వరంగల్ రూరల్ జిల్లా నడికూడ మండల కేంద్రానికి చెందిన ఊర బుచ్చయ్యకు గ్రామంలోని సర్వే నంబర్లు 123ఏ/1, 123ఏ/3, 123/బీ/1, 123/బీ/3, 123/బీ4లలో 5.17 ఎకరాల భూమి ఉన్నది. ఆయనకు కుమారులు లేరు. కుమార్తెలు అంబడిపెల్లి అప్పమ్మ, నల్లాని పుష్పలీల ఉన్నారు. పుష్పలీల దంపతులు హైదరాబాద్‌లో ఉంటుండగా, బుచ్చయ్య గ్రామంలోనే ఉంటున్న అప్పమ్మ వద్ద ఉంటూ భూమిని కౌలుకు ఇచ్చేవారు. అప్పమ్మ 1998లో, ఆమె భర్త మల్లయ్య 2011లో మరణించారు. బుచ్చయ్య కూడా అనారోగ్యంతో మరణించారు. చిన్నకూతురు పుష్పలీల హైదరాబాద్‌లో ఉంటుండటంతో.. బుచ్చయ్య భూమిని కౌలుచేసుకొంటున్న వ్యక్తి చక్రం తిప్పారు. రెవెన్యూ అధికారులను మచ్చికచేసుకొని నకిలీ పత్రాలను సృష్టించి ఆర్వోఆర్ ద్వారా పాస్‌పుస్తకాలను సంపాదించారు. దీనిపై అసలైన వారసులు పుష్పలీల దంపతులు 2013లో ములుగు ఆర్డీవోకు అప్పీలు చేయగా.. నకిలీ ధ్రువపత్రాలతో ఆర్వోఆర్‌చేసినట్టు తేలింది. కౌలుదారులకు మంజూరైన పాస్‌పుస్తకాలను రద్దుచేసి, పుష్పలీలకు ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు కూడా. ఆర్డీవో ఆదేశాలతో అప్పటి తాసిల్దార్.. సర్వే నంబర్లు 123ఏ/1, 123ఏ/3, 123/బీ/1, 123/బీ/3, 123/బీ4లలో 5.17 ఎకరాల భూమిని నల్లాని పుష్పలీల పేరిట పట్టాచేస్తున్నామని, ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలుపాలని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించారు కూడా.. అభ్యంతరాలు రాకపోవడంతో 2017లో తన పేరిట పాస్‌పుస్తకాలు మంజూరుచేశారని, అప్పట్లో పహాణీ నకళ్లు, 1-బీ కాపీలు కూడా మీ సేవ నుంచి తీసుకొన్నామని బాధితురాలు పుష్పలీల వివరించారు. తర్వాత కొద్దిరోజులకే మీ సేవలో పహాణీలు రాకుండాచేశారని, నాటినుంచి ఆన్‌లైన్‌లో నమోదుచేయకుండా కార్యాలయాలచుట్టూ తిప్పుకొంటున్నారని, కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్డీవో కోర్టులో తాము కేసు గెలిచినా పాస్‌పుస్తకాలు ఇవ్వడంలో రెవెన్యూ సిబ్బంది జాప్యంచేస్తున్నారని, దీంతో తాము రైతుబంధు పెట్టుబడి సాయం కూడా పొందలేకపోతున్నామని వాపోయారు. తమకు సంబంధించిన ఇతర భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయని, ఎలాంటి అభ్యంతరాలులేని ఈ 5.17 ఎకరాలను తన పేరిట పట్టాచేసి, న్యాయంచేయాలని బాధితురాలు పుష్పలీల కోరుతున్నారు.

ఆ భూమి వివాదంలో ఉన్నది

నల్లాని పుష్పలీలకు చెందిన భూముల వ్యవహారం వివాదంలో ఉన్నది. మోఖాపై ఇతరులు ఉన్నారు. పుష్పలీల పేరిట రికార్డులో 5.17 ఎకరాల భూమి నమోదై ఉన్నది. కానీ వివాదం ఉండటం వల్ల ఆన్‌లైన్‌చేయలేదు. గ్రామంలో గ్రామసభలు నిర్వహించిన సందర్భంలో కూడా పిలిచాం. కానీ కొంతమంది రాలేదు. ఫ్యామిలీ డిస్ప్యూట్ ఉన్నందువల్లే సంతకం చేయడంలేదు. పుష్పలీల మోఖాపై ఉండి.. భూమిని దున్నుకొంటే సంతకంచేయడంతోపాటు పాస్‌పుస్తకాలు మంజూరుచేస్తాం.

- కోమి, నడికూడ తాసిల్దార్

న్యాయం కోసం మంచాల తాసిల్ కార్యాలయానికి తరలివచ్చిన వెంకటేశ్వరతండా రైతులు

అక్రమ పట్టాదారుపై చర్యలు తీసుకోవాలి

- రంగారెడ్డి జిల్లా వెంకటేశ్వరతండావాసుల వేడుకోలు
- ఫోర్జరీ సంతకాలతో 20 ఎకరాలు పట్టాచేసుకొన్నారని ఆరోపణ
- మోఖాపైకెళ్లి న్యాయంచేస్తామన్న మంచాల తాసిల్దార్ సుచరిత

మంచాల: సంతకాలను ఫోర్జరీ చేసి 20 ఎకరాల భూమిని దొంగతనంగా పట్టాచేసుకొన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా మంచాలంలోని వెంకటేశ్వరతండాకు చెందిన సుమారు వంద మంది రైతులు బుధవారం తాసిల్దార్ సుచరితను వేడుకొన్నారు. మండలంలోని బోడకొండ రెవెన్యూ వెంకటేశ్వరతండాకు చెందిన పదమూడు మంది కుటుంబాలకు సర్వే నంబర్లు 166, 167, 168, 171, 169లలో 149 ఎకరాల భూమి ఉన్నది. 2008లో కొంతమంది రైతులు తండాకే చెందిన చందునాయక్‌కు 40 ఎకరాలు విక్రయించారు. చందునాయక్ రైతులకు చెక్కులు ఇచ్చి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొన్నట్టు తెలిపారు. అప్పటి నుంచి డబ్బుల కోసం అతని చుట్టూ తిరిగినప్పటికీ రేపు, మాపు అంటూ దాటవేశాడని, ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయని వాపోయారు. వాస్తవంగా అమ్మిన 40 ఎకరాలే కాకుండా ఇదే సర్వే నంబర్‌లోని మరో 20 ఎకరాలకు పట్టాదారులు వీరే అంటూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు వ్యక్తుల అండతో ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ చేసుకొన్నాడని ఆరోపించారు. కాస్తులో తామే ఉన్నా అదనంగా 20 ఎకరాలు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకొన్న చందునాయక్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. చందునాయక్ ధనబలంతో తమపై దాడులకు పాల్పడుతున్నాడని తెలిపారు. గురువారం తాను మోఖా మీదకు వచ్చి విచారించిన తర్వాత న్యాయం చేస్తానని తాసిల్దార్ హామీ ఇచ్చారు.

బుధవారం బచ్చన్నపేటలో వీఆర్వోను నిలదీస్తున్న బాధిత రైతు శివరాత్రి బాలమల్లయ్య

పాస్‌బుక్ కోసం వీఆర్వోను నిలదీసిన రైతు

జనగామ జిల్లా బచ్చన్నపేట తాసిల్ కార్యాలయంలో ఘటన

బచ్చన్నపేట: పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం బండనాగారానికి చెందిన శివరాత్రి బాలమల్లయ్య అనే రైతు బుధవారం వీఆర్వో కనకరాజ్‌ను తాసిల్ కార్యాలయంలో నిలదీశారు. పాస్‌బుక్ ఇవ్వకపోతే ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. శివరాత్రి బాలమల్లయ్య తనకున్న 1.25 ఎకరాల్లో 15 గుంటలకు విక్రయించారు. మిగిలిన 1.10 ఎకరాల భూమికి పాస్‌పుస్తకం ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొన్నారు. నెలలు గడిచినా పాస్‌బుక్ అందలేదు. తన వద్ద 15 గుంటలు కొన్నవారికే మొత్తం భూమిని పట్టాచేశారని, అందుకే తనకు పాస్‌పుస్తకం ఇవ్వడంలేదని బాధితుడు వాపోతున్నారు. తాను భూమి విక్రయించిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకొన్న స్థానిక వీఆర్ఏ గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన వీఆర్వోకు తప్పుడు సమాచారం ఇచ్చి తనకు పాస్‌పుస్తకం రాకుండా చేశారని బాలమల్లయ్య ఆరోపించారు. ఇదే విషయమై తాసిల్దార్ వెంకటేశ్వర్లుకు రెండు నెలల కింద వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపిన పాస్‌పుస్తకం ఇవ్వాలని తాసిల్దార్ ఆదేశించినా వీఆర్వో ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా తనకు వెంటనే పాస్‌బుక్ ఇవ్వాలని బాధితుడు వీఆర్వో కనకరాజ్‌ను డిమాండ్‌చేశారు.

కొత్త చట్టం అవసరం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం కొత్తగా తీసుకురానున్న రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తున్నాం. కొత్త చట్టం అవసరం. రైతుల బాగోగులను దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ చేపడుతున్న కొత్త సంస్కరణలతో సత్వర న్యాయం జరుగనున్నది. 'నమస్తే తెలంగాణ' నిత్యం 'ధర్మగంట' పేరుతో రైతుల భూసమస్యలను ప్రచురిస్తూ త్వరగా పరిష్కారమయ్యేలా చేస్తున్నది. అవినీతిపరులైన కొంతమంది అధికారుల వల్ల ఇబ్బందిపడుతున్న రైతులకు 'ధర్మగంట' ఓ పరిష్కారం చూపింది.

- దేవి రవీందర్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు

కబ్జాదారులకు రెవెన్యూ అండ

- పట్టా భూమి పీర్ల ఇనామ్‌గా మార్పు
- న్యాయంచేయాలంటున్న నాగర్‌కర్నూల్ జిల్లా బాధితుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం అన్నారం పరిధిలోని సర్వే నంబర్ 176/1లో 6.04 ఎకరాల భూమిని నా తండ్రి రాంరెడ్డి 1983లో మా గ్రామానికి చెందిన ముస్లిం పెద్దల దగ్గర కొన్నారు. కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (డాక్యుమెంట్ నంబర్లు 1285/1983, 1057/1983, 1058/1983, 2043/1983) నాలుగు డాక్యుమెంట్ల ద్వారా రిజిస్టర్ చేసుకొన్నారు. ఆనాడు మా నాన్న కొన్న 6.04 ఎకరాలను ఆనాటి తాసిల్దార్ 1985-1986లో మ్యుటేషన్‌చేశారు. నేటివరకు నా తండ్రి పేరిటే పట్టా ఉన్నది. పాస్‌పుస్తకం కూడా ఉన్నది. ఈ భూమిని ఆయన స్వయంగా సాగుచేసుకొని జీవించారు. ఆయన తదనంతరం నాకు వారసత్వంగా సంక్రమించింది. ఈ మేరకు నాకు విరాసత్‌చేసి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఇచ్చారు. భూమి పట్టా అయింది. ఇంతవరకు బాగానే ఉన్నది. ఇటీవలికాలంలో భూమికి బాగా విలువ పెరుగడంతో నలభై ఏండ్ల కింద భూమిని అమ్మిన వారి వారసులకు దుర్బుద్ధి పుట్టింది. అంతే దీనికి లేనివి ఉన్నట్టు.. ఉన్నవి లేనట్టు సృష్టించారు.. స్థానిక రెవెన్యూ అధికారులను పట్టుకొన్నారు. పట్టా భూమిని కాస్త పీర్ల ఇనామ్ భూమి అంటూ కొత్త వివాదాన్ని అంటకట్టారు. స్థానిక వీఆర్వోను పట్టుకొని ఈ భూమిని వివాదంలోకి లాగారు.. 40 ఏండ్ల కింద నా తండ్రికి భూమిని అమ్మిన వారి వారసులే తిరిగి పీర్ల ఇనామ్ భూమంటూ.. తమకే చెందుతుందని మోఖాపైనుంచి వెళ్లగొడుతున్నారు. దాడికి దిగుతున్నారు. నాకు వయసు అయింది. ఈ భూమినే నమ్ముకొని బతుకుతున్నాను. నాకున్న ఈ భూమిలో నుంచే నా కూతురు వినోదకు మూడెకరాలు పసుపుకుంకుమల కింద ఇచ్చాను. నా కూతురు నేను ఈ భూమిని రిజిస్టర్‌చేసిన తరువాతే పట్టా చేయించాను.. నా పేరున, నా కూతురు వినోద పేరున ఉన్న భూమిని వాళ్లు దౌర్జన్యంగా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు నాభూమిని క్లియర్ చేయించి, పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇప్పించాలని కోరుతున్నా.

- మేరెడ్డి శేఖర్‌రెడ్డి, బాధిత రైతు, నాగర్‌కర్నూలు జిల్లా

పట్టాచేసే అధికారం మాకు లేదు

అన్నారంలో వారు కొన్న భూమి వక్ఫ్ బోర్డుకు సంబంధించింది. పీర్ల ఇనామ్ గెజిట్ నోటిఫికేషన్‌లో ఎంటర్ కావడంతో మాకు పట్టాచేసే అవకాశం లేకుండాపోయింది. దీనిపై సంబంధిత రైతులు వక్ఫ్‌బోర్డులో సంప్రదించాలి. లేదంటే కోర్టుకు వెళ్లాలి.

- నాగమణి, వంగూరు తాసిల్దార్



హైదరాబాద్‌కు నా వల్లే అమెజాన్

- మళ్లీ పేల్చిన ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచంలో ఎవరేం చేసినా అది తన ఘనతే అని చెప్పుకొనే ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు బుధవారం మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. గుంటూరు పార్టీ కార్యాలయంలో తనను కలిసిన ఖమ్మం జిల్లాకు చెందిన నాయకులతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో తానుచేసిన అభివృద్ధి కారణంగానే ప్రపంచంలోనే అతిపెద్దదైన అమెజాన్ కార్యాలయం అక్కడ ఏర్పాటుచేశారని చెప్పుకొచ్చారు. గచ్చిబౌలిలో పుల్లెల గోపీచంద్‌కు అకాడమీ ఏర్పాటుకు ఐదెకరాల స్థలం ఇవ్వకపోతే సింధూలాంటి వారు ఉండేవారా? అని ప్రశ్నించారు. సింధు ప్రపంచ చాంపియన్ అయిందంటే దానికి తాను అకాడమీ ఏర్పాటుకుచేసిన కృషి పరోక్షంగా కారణమైందని అన్నారు. మూడు నెలల్లో జగన్ ఏపీని సర్వనాశనం చేశారని మండిపడ్డారు.

ప్లాస్టిక్‌పై పరిమితులు విధించండి

- హైకోర్టులో పిల్ దాఖలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వినాయక చవితి, నవరాత్రుల సందర్భంగా ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగాన్ని నియంత్రించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వినాయకుడు అంటేనే ప్రకృతికి నిదర్శనమని, అలాంటి గణేశ్ విగ్రహాలను 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను చుట్టి విక్రయాలు సాగిస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో చుట్టుపక్కల జిల్లాలో వేల సంఖ్యలో విగ్రహాలను ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. 50 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ వినియోగం కొనసాగుతున్నదని, ప్రస్తుతం పండుగ నేపథ్యంలో భారీఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు వెలువడే ప్రమాదం ఉన్నందున వినియోగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై గురువారం విచారణ జరిపేందుకు హైకోర్టు అంగీకరించింది.

తెలంగాణతో కలిసి పనిచేస్తాం

- పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శితో స్పానిష్ సంస్థ ప్రతినిధులు భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థతో కలిసి పనిచేయడానికి స్పెయిన్‌కు చెందిన బహుళ జాతి సంస్థ ముందుకొచ్చింది. స్పెయిన్‌కు చెందిన లెబ్లాన్ పరిశ్రమ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవిందకుమార్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యర్థాల శుద్ధికేంద్రాలను ఏర్పాటుచేయడానికి సంస్థ సంసిద్ధత వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా లెబ్లాన్ సంస్థ డైరెక్టర్ ఎస్టేబాన్ ఆండ్రూ మాట్లాడుతూ.. పట్టణ ఘనవ్యర్థాలు, కంటెయినర్లు, ప్రమాదంకానీ పారిశ్రామిక వ్యర్థాలు, నిర్మాణల వ్యర్థాలు, వినియోగంలోలేని వాహనాలు, బయోగ్యాస్ శుభ్రపర్చడం, మురుగు శుద్ధిచేయడం వంటి పనులను మెరుగ్గా నిర్వహిస్తామని వివరించినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆధునిక పరిజ్ఞానాన్ని సమకూర్చి అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవిందకుమార్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాల నుంచి విద్యుత్ తయారుచేస్తున్న ప్లాంటును సందర్శించాలని కోరారు. ఇలాంటి ప్లాంట్లను వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లో చేపట్టేందుకు ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, అదనపు కమిషనర్ శృతిఓజా, గ్రేటర్ వరంగల్ కమిషనర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం సచివాలయంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవిందకుమార్‌తో భేటీ అయిన స్పెయిన్‌కు చెందిన లెబ్లాన్ సంస్థ డైరెక్టర్ ఎస్టేబాన్ ఆండ్రూ, ఇతర ప్రతినిధులు

25 మందితో టీటీడీ పాలకమండలి

- పూర్తిస్థాయి పాలకవర్గం ఏర్పాటుపై ఏపీ సీఎం జగన్ కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇరువై ఐదు మందితో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పూర్తిస్థాయి పాలకవర్గాన్ని ఏర్పాటుచేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఈ విషయంపై బుధవారం ఆయన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో చర్చించారు. చంద్రబాబు హయాంలో 19 మందితో టీటీడీ పాలకవర్గాన్ని ఏర్పాటుచేశారు. బోర్డు సభ్యులుగా నియమించేందుకు గాను ఇప్పటికే 35 మంది పేర్లు జగన్ పరిశీలనలో ఉన్నాయి. వీరిలో 25 మందిని ఎంపిక చేయనున్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు, ఎస్సీ కోటాలో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, ఇండియా సిమెంట్స్ అధినేత శ్రీనివాసన్‌లకు చోటుదక్కనున్నది. స్థానిక కోటాలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తెలంగాణ నుంచి మహా సిమెంట్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు, మహిళా కోటాలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డితోపాటు వైఎస్సార్సీపీ మహిళా ఎమ్మెల్యేలకు, సుబ్బారావు, కృష్ణమూర్తి తదితరులకు చోటుదక్కే అవకాశం ఉన్నట్టు సమాచారం.

మహిళా, శిశు సంక్షేమశాఖలో సమస్యల పరిష్కారానికి కృషి

- ఉద్యోగ సంఘ నేతలతో ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళా, శిశు సంక్షేమశాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తామని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్ హామీ ఇచ్చారు. సచివాలయంలో బుధవారం ఉద్యోగుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. గతంలో టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు ఇచ్చిన వినతి మేరకు సమావేశాన్ని ఏర్పాటుచేసి సమస్యలపై చర్చించారు. పెన్షన్, కొత్త పోస్టుల మంజూరు, భర్తీ, కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలు, ఇతర సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. పోస్టుల మంజూరుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పున్నా రెడ్డి, కార్యదర్శి రమణకుమార్, ఉద్యోగులు రమణారెడ్డి, రవికుమార్, రమణాచారి, వేణు, విజయ్‌కుమార్, పద్మ , సావిత్రి, రవి, గీత, నవీన, సోమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్నేషనల్ పర్షియన్ సమ్మర్ స్కూల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ సంస్థలో జర్మనీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ గాటింగన్ ఈ నెల 23 నుంచి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ పర్షియన్ సమ్మర్ స్కూల్ కార్యక్రమం బుధవారం ముగిసింది. హార్వర్డ్, కాలిఫోర్నియా, హంగేరీ వర్సిటీలు, పోలాండ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ వార్సా, వర్సిటీ ఆఫ్ నేపాల్, ఇటలీ, సింగపూర్ తదితర వర్సిటీల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇవాఅర్థమన్, ఇరానియన్ స్టడీస్, యూనివర్సిటీ ఆఫ్ గాటింగన్, పలు వర్సిటీల మధ్య అవగాహన ఒప్పందాలు జరిగాయని తెలంగాణ ఆర్కైవ్స్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ జరినాపర్వీన్ తెలిపారు.

రైల్వే జీఎం గజానన్ మాల్యాకు విన్నవిస్తున్న ఆలిండియా ఓబీసీ రైల్వే సమాఖ్య నాయకులు

బాబు హయాంలో వేలకోట్లు దుర్వినియోగం

- రాజధాని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం
- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్విస్, సింగపూర్ చాలెంజ్ పేరుతో రాజధాని నిర్మాణం పేరిట చంద్రబాబు ప్రభుత్వం వేల కోట్ల ప్రజాధానాన్ని దుర్వినియోగంచేసిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన నిధుల్లో కొద్దిగా ఖర్చుపెట్టి మిగతా మొత్తం జేబులో వేసుకుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై జీవీఎల్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, కేంద్ర ప్రభుత్వ సూచనలతో చేసేది కాదని స్పష్టంచేశారు. అమరావతి నిర్మాణానికి ఐదు వేల ఎకరాలు సరిపోతాయని, కానీ చంద్రబాబు ప్రభుత్వం అవసరానికి మించి భూమిని సేకరించిందని ఆరోపించారు. ప్రస్తుతం అమరావతి తరలిపోతుందని కొందరు లేనిపోని ప్రచారంచేస్తున్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరుగాలన్న కేవీఎల్.. ఇన్‌సైడ్ ట్రేడింగ్ కారణం చూపి రాజధానిని మార్చాల్సిన అవసరం లేదని చెప్పారు.

అమెరికాలో ఉన్నత విద్యపై వీఐటీ వర్సిటీలో సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వీఐటీ ఏపీ యూనివర్సిటీలో అమెరికా ఉన్నత విద్యావిధానంపై యూఎస్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (యూఎస్ఐఈఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. దీనికి యూఎస్ఐఈఎఫ్ సలహాదారు సోహాయిల్ ఇంతియాజ్ హాజరై అమెరికాలోని ఉన్నత విద్యావకాశాల గురించి వివరించారు. వీసీ శుభాకర్ మాట్లాడుతూ.. వీఐటీ ఏపీ అత్యుత్తమ అంతర్జాతీయస్థాయి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నదని, అమెరికాలోని ప్రతిష్ఠాత్మక వర్సిటీలతో ఇంటర్నేషనల్ ట్రాన్స్‌ఫర్ ప్రోగ్రాం, సెమిస్టర్ అబ్రాడ్ ప్రోగ్రాం వీఐటీ ఏపీ వర్సిటీ ఒప్పందాలు చేసుకున్నదని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ సీఎల్వీ శివకుమార్ పాల్గొన్నారు.

రైల్వే ముద్రణాలయాన్ని మూసేయొద్దు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్షిణ మధ్య రైల్వేలోని ముద్రణాలయాన్ని మూసివేయొద్దని ఆలిండియా ఓబీసీ రైల్వే సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ దీకొండ పద్మనాభం కోరారు. ఈ మేరకు ఓబీసీ రైల్వే సమాఖ్య నాయకులు బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యాను కలిసి విన్నవించారు. గజానన్ మాల్యాను సత్కరించారు. ఈ సందర్భంగా పద్మనాభం మాట్లాడుతూ.. ఈ ముద్రణాలయంలో ఏటా రైల్వే నిర్వహణ, రవాణా, రికార్డులకు సంబంధించిన 30 కోట్ల ఏ4 పేపర్లను ముద్రిస్తున్నారని పేర్కొన్నారు. 50 కోట్ల రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్ టికెట్లను ముద్రించి సరఫరా చేస్తున్నారని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వేలో డిజిటలైజేషన్ అయ్యేవరకు ఈ ముద్రణాలయాన్ని కొనసాగించాలని విజ్ఞప్తిచేశారు. అవసరమైతే కార్పొరేషన్ ఏర్పాటు చేసైనా ముద్రణాలయాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ రైల్వే సమాఖ్య నాయకులు భాస్కర్, రాజశేఖర్, శ్రీరాములు, వేణుమాధవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ముద్రణాలయాన్ని జీఎం గజానన్ మాల్యా తనిఖీ చేయగా, ఆయన వెంట రైల్వే అధికారులు వీఎన్ మిశ్రా, కన్నయ్య, కన్నన్, దయానంద్ ఉన్నారు.

వినాయక మండపాలకు కరెంటు బిల్లుల చెల్లింపు

- విద్యుత్‌శాఖకు అందజేసిన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల

కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటుచేసే వినాయక మండపాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం విద్యుత్‌శాఖ ఎస్ఈకి అడ్వాన్స్‌గా రూ.2.10 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో కరీంనగర్‌తోపాటు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు అయ్యే పూర్తి చార్జీలను తన జీతం నుంచి భరించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్, టీఆర్ఎస్ నగర నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ నియోజకవర్గంలోని వినాయక మండపాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను అడ్వాన్స్‌గా చెక్కు రూపంలో విద్యుత్ శాఖ ఎస్ఈకి చెల్లిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

యువకుడి ఆత్మహత్య

- పోలీసుల బెదిరింపులే కారణమని బంధువుల ఆందోళన

**అశ్వారావుపేట, నమస్తేతెలంగాణ

రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్ చాలెంజ్‌కు ఐటీ, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం, టీ-సాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి, ఇగ్నైటింగ్‌మైండ్స్ ప్రతినిధి రాఘవ, సీఎం పీఆర్వో సైదిరెడ్డి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు హరిత అతిథిగృహం, లక్ష్మీ బరాజ్ వద్ద బుధవారం మొక్కలు నాటారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి కొప్పుల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 35 ఏండ్లుగా విజయవాడ కనకదుర్గమ్మ ను దర్శించుకొంటున్నామని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. మంగళవారం రాత్రి విజయవాడ చేరకున్న మంత్రి కొప్పుల.. బుధవారం ఉదయం కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మకు బంగారు ముక్కుపుడక సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. తొలుత మంత్రికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నానని తెలిపారు. తెలంగాణ, ఏపీ ఆదర్శవంతమైన రాష్ట్రాలుగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్టు పేర్కొన్నారు.

మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

ఏడాదిలో లక్ష మందికి ఉపాధి

పరకాల మెగా జాబ్‌మేళాలో మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఏడాదికి లక్ష మందికి ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాలలోఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. యువతకు భారీస్థాయిలో ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించేందుకు డీఆర్‌డీఏ, ఈజీఎంఎం ఆధ్వర్యంలో జిల్లాల్లో మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మంత్రి, ఎమ్మెల్యే మొక్కను నాటారు.

పరకాల జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

'కాళేశ్వరం' స్ఫూర్తిదాయకం

ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్లు

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఈఎన్సీ వెంకటేశ్వర్లు

సీఎం కేసీఆర్ కల సాకారం: సోమేశ్‌కుమార్

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ : ఇంజినీరింగ్‌లో ప్రపంచ రికార్డులు నమోదు చేస్తూ, అతి తక్కువ కాలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు స్ఫూర్తిగా నిలుస్తుందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో సోమేష్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో కలిసి బుధవారం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించారు. మంగళవారమే వరంగల్‌కు చేరుకొన్న కలెక్టర్లు బుధవారం ఉదయం బస్సులో కాళేశ్వరం ప్రాజెక్టుకు బయల్దేరారు. మొదట జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌ను సందర్శించారు. కలెక్టర్ల బృందానికి సాగు నీటి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) నల్లా వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అక్కడి క్యాంపులోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈఎన్సీ వెంకటేశ్వర్లు ప్రాజెక్టు పనితీరు, బరాజ్‌లు, పంపుహౌజ్‌లు, గోదావరి నుంచి పంపుహౌజ్‌ల్లోకి నీరు చేరుకునే అప్రోచ్ కెనాల్స్, హెడ్ రెగ్యులేటర్స్, ఫోర్‌బేలు, గ్రావిటీ కెనాల్, డెలివరీ సిస్టర్న్, పైపులైన్, ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, ప్రత్యేకతలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ఇంజినీరింగ్ అద్భుతమని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సీఎం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో స్క్రీన్‌పై నిరంతరం చూస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేస్తున్నారన్నారు. కేవలం 29 నెలల అతితక్కువ కాల వ్యవధిలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడం గొప్ప విషయమన్నారు. తొలుత 37 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా ప్రాజెక్టు నిర్మాణానికి డిజైన్ జరుగగా, ఇప్పుడు అదనంగా మరో 8 లక్షల ఎకరాలు చేరడంతో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో మొత్తం 45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని చెప్పారు. లక్ష్మీ బరాజ్ నిర్మాణం కోసం పొరుగున ఉన్న మహారాష్ట్ర అధికారులతోనూ తెలంగాణ రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకొని భూ సేకరణ జరపడం అభినందనీయమని సోమేశ్‌కుమార్ అన్నారు. తర్వాత కలెక్టర్లతో కలిసి లక్ష్మీ బరాజ్‌పైకి చేరుకుని, బ్రిడ్జి మీదుగా మహారాష్ట్ర వైపు బరాజ్ చివరి వరకు వెళ్లి వచ్చారు. ఇక్కడ వ్యూ పాయింట్ వద్ద సాగునీటి శాఖ ఇంజినీర్లు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఛాయాచిత్రాలను తిలకించారు. అక్కడి నుంచి లక్ష్మి (కన్నెపల్లి) పంపుహౌస్‌ను సందర్శించారు. పంపుహౌస్‌లోనికి దిగి మోటర్లను చూశారు. ఈ పంపుహౌస్‌లోని మోటర్లు పని చేసే విధానం, ఒక్కో మోటర్ కెపాసిటీ, ఇక్కడ పని చేసే మోటర్లు, ఒక్కో మోటరు ప్రతి రోజు ఎత్తిపోసే నీటి వివరాలను కలెక్టర్లకు ఈఎన్సీ వెంకటేశ్వర్లు వివరించారు. సరస్వతి (అన్నారం) బరాజ్‌కు చేరుకునే లక్ష్మీ-సరస్వతి గ్రావిటీ కెనాల్‌ను కలెక్టర్లు సందర్శించారు. లక్ష్మీ పంపుహౌజ్ నుంచి ఎత్తిపోతతో ఈ గ్రావిటీ కెనాల్‌లోకి నీరు వచ్చే డెలివరీ సిస్టర్న్‌ను చూశారు. ఇందుకోసం కొద్దిసేపు కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్లు లక్ష్మీ పంపుహౌస్ లోని ఒకటో నంబర్ మోటర్‌ను ఆన్ చేశారు. డెలివరీ సిస్టర్న్ వద్ద గ్రావిటీ కెనాల్‌లో దుంకుతున్న గోదావరి జలాలను చూసి కలెక్టర్లు ఆనందం వెలిబుచ్చారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా లక్ష్మి పంపుహౌస్ వద్ద మోటర్లను తిలకిస్తున్న కలెక్టర్లు

ప్రాజెక్టు సందర్శనతో కలెక్టర్లు చైతన్యం పొందారు

లక్ష్మీ బరాజ్ వద్ద రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కలెక్టర్లందరూ ఈ పర్యటనలో కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తి, చైతన్యం పొందారని చెప్పారు. బరాజ్, పంపుహౌస్‌ను చూసిన తర్వాత ఇక్కడ చాలా నేర్చుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కాళేశ్వర విజయం సాధ్యమైందనీ, ముఖ్యమంత్రి కార్యదక్షతకు ప్రాజెక్టు నిదర్శనమన్నారు. కలెక్టర్లందరూ ప్రాజెక్టును చూసి ఇన్‌స్పైర్, మోటివేట్ అయ్యారన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంపుహౌస్‌లో ప్రాజెక్టు గురించి కలెక్టర్లకు వివరిస్తున్న ఈఎన్సీ వెంకటేశ్వర్లు

లక్ష్మీ బరాజ్ వద్ద కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సోమేశ్‌కుమార్

సూర్యాపేటలో నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

- విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: అభివృద్ధిపనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, మినీట్యాంక్ బండ్ పనులను మంత్రి పరిశీలించారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై మండిపడ్డారు. నిర్మాణపనులను ఇంకా ఎన్ని రోజులు సాగదీస్తారని ప్రశ్నించారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ వెంకటనారాయణ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సీతారాంపురానికి చెందిన మాజీ కౌన్సిలర్ సంగు సుశీలతోపాటు 160 మంది బీజేపీ కార్యకర్తలు మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

కరీంనగర్ జిల్లా కందుగులలో మొక్క నాటుతున్న మంత్రి ఈటల రాజేందర్

ఆకుపచ్చ తెలంగాణ అందరి బాధ్యత

- మంత్రి ఈటల రాజేందర్

హుజూరాబాద్, నమస్తే తెలంగాణ : రాష్ట్రాన్ని ఆకుపచ్చగా మార్చే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగులలో నిర్వహించిన హరితహారంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆకు పచ్చని తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజులుగా కొనసాగుతున్న సదరన్ వైద్య శిబిరాన్ని అయన సందర్శించారు. జమ్మికుంట మండల శాయంపేటలో ధనలక్ష్మి గ్రామ సమైక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జడ్పీటీసీలు పడిదం బక్కారెడ్డి, శ్రీరాం శ్యాం తదితరులు ఉన్నారు.

ముగ్గురు విద్యార్థులు దుర్మరణం

మృతదేహం వద్ద రోదిస్తున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రిషి, మణిచందన, దీక్షిత (ఫైల్)

మూడోపేజీ తరువాయి...

వేములవాడ రూరల్ మండలం వట్టెంల, దీక్షిత, రిషిలది రుద్రంగి మండలం మానాల పరిధిలోని బడితండా గ్రామంగా గుర్తించారు. వాహనానికి ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేకపోగా 17 మందిని మాత్రమే తరలించే సామర్థ్యం ఉండగా 27 మంది విద్యార్థులతో ఓవర్‌లోడ్‌తో వెళ్తుండడం కూడా ప్రమాదానికి కారణంగా అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వ్యాన్ డోర్ వేయకపోవడంతో విద్యార్థులు కిందపడి మృతి చెందినట్టుగా తెలుస్తున్నది. స్వల్పంగా గాయపడిన వారిని వేములవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యబృందం సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించి వైద్య సేవలు అందించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి ఈటల పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం తరుపున అందజేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అందజేశారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే, తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు.

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి : కేటీఆర్

వేములవాడ స్కూల్ బస్సు ప్రమాద ఘటనలో గాయపడిన వారికి వారికి మెరుగైన వైద్యం అందించాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అధికారులను ఆదేశించారు. బుధవారం బస్సు ప్రమాదంపై ఘటన స్థలానికి వెళ్లిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో ఫోన్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. వేములవాడ స్కూల్ బస్సు ప్రమాదంలో చనిపోయిన విద్యార్థులకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వరంగల్‌లో ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

వరంగల్ అర్బన్ (మట్టెవాడ): వరంగల్ నగరంలోని మట్టెవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు పోచాల శ్రీనివాస్‌పై పోక్సో చట్టం కింద కేసున మోదైంది. బుధవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడిపై దాడిచేసి మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ ఎల్ జీవన్‌రెడ్డి తెలిపారు.

ఇంటి పైకప్పు కూలి వృద్ధురాలి మృతి

మల్లాపూర్: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సిరిపూర్‌కు చెందిన భూక్య లలిత (65)అనే వృద్ధురాలు బుధవారం వేకువజామున ప్రమాదవశాత్తూ ఇంటిపై కప్పుకూలి మృతిచెందింది. ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. ఆమె నిద్రిస్తున్న సమయంలో ఇంటిపైకప్పుతోపాటు, దూలం విరిగిపడ్డాయి. దీంతో మట్టిదిబ్బ కింద కూరుకుపోయి ఊపిరాడక లలిత అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో పట్టా పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

అవినీతి అరికట్టేందుకే నేరుగా పాస్‌బుక్కులు

- మంత్రి నిరంజన్‌రెడ్డి

భూత్పూర్ : రెవెన్యూ శాఖలో అవినీతిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు నేరుగా పాస్ బుక్కులను పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూసంస్కరణలను తీసుకురావడానికి కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే పేదల సొంతింటి కల సాకారం

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

కలెక్టరేట్, నమస్తే తెలంగాణ : సీఎం కేసీఆర్‌తోనే పేదల సొంతింటి కల నిజమైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం ఇబ్రహీంపూర్‌లో రూ.1.25 కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇబ్రహీంపూర్ గ్రామం నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇప్పటికే గ్రామాన్ని 23 వేల మంది ప్రతినిధులు సందర్శించారని, ఇది ఒక ప్రయోగ కేంద్రంగా నిలిచిందన్నారు.

ఇబ్రహీంపూర్‌లో లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

బుధవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని మైండ్ స్పేస్‌వద్ద పరుగులు పెడుతున్న మెట్రోరైలు

నీటిసంప్‌లో పడి చిన్నారి మృతి

కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ: మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి పీఎస్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో బుధవారం నీటిసంప్‌లో పడి 18 నెలల బాలుడు మృతిచెందాడు. యెడ్డి దుర్గేశ్ తన కుటుంబంతో రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి కుమారుడు ధీరజ్(18నెలలు) ఆడుకుంటూ వెళ్లి పక్క ఇంట్లోని నీటిసంప్‌లో పడిపోయాడు. గమనించిన ఆఇంట్లోనివారు ధీరజ్‌ను బయటికి తీసి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. స్థానిక ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే చిన్నారి మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్-2లోని సెన్సేషనల్ డీ-కోట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భారీగా మంటలు చెలరేగగా, ఐదు ఫైరింజన్లతో పదిగంటలపాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ పరిశ్రమకు మూడేండ్లుగా లైసెన్స్ లేదని గుర్తించిన పరిశ్రమలశాఖ అధికారులు నోటీసులు జారీచేశారు. - చర్లపల్లి

కాళేశ్వరం వద్దన్న కాంగ్రెస్ ఇక్కడెందుకు?

కాంగ్రెస్ నేతలకు జెడ్పీచైర్మన్ పుట్ట మధూకర్ ప్రశ్న

మంథని, నమస్తే తెలంగాణ: ప్రపంచ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రశంసిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉన్నదని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును పదేపదే వద్దంటున్న కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారంలో బుధవారం ఆయన హరితహారంలో పాల్గొని మొక్కలను నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు చెప్తున్నట్టు తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడితే నీటి లభ్యత ఉంటుందా..? అని ప్రశ్నించారు. మంథని నియోజకవర్గానికి గోదావరి నీళ్లు రావడం ఇక్కడి ఓట్లతో గెలిచిన వారికి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు గొప్ప మేలు జరిగే కాళేశ్వరం ప్రాజెక్టుపై రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు.

లైంగిక వేధింపుల కేసు తెలంగాణకు బదిలీ

మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు

చెన్నై: తమిళనాడులో ఓ మహిళా పోలీసు అధికారిపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసు దర్యాప్తును మద్రాస్ హైకోర్టు బుధవారం తెలంగాణకు బదిలీచేసింది. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, యాంటీ కరప్షన్ విభాగంలో పనిచేస్తున్న మహిళా పోలీసుఅధికారి.. తనను ఉన్నతాధికారి లైంగికవేధింపులకు గురిచేసినట్టు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ, సీబీ సీఐడీతో విచారణ జరుపాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో సింగిల్‌జడ్జి జారీచేసిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ డీవీఏసీ జాయింట్‌డైరెక్టర్ డాక్టర్ ఎస్ మురుగన్ చేసిన అప్పీల్‌పై జస్టిస్ వినీత్ కోఠారి, జస్టిస్ సీవీ కార్తికేయన్‌తో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. నిష్పాక్షిక విచారణ కోసం కేసును తెలంగాణ రాష్ట్రానికి బదిలీచేయాలని ఆదేశించింది. ఈ మేరకు సీఎస్, డీజీపీకి ధర్మాసనం ఆదేశాలు జారీచేసిం ది. ఆరు నెలలలోపు విచారణ నివేదికను మద్రాస్‌హైకోర్టుకు సమర్పించాలని సూచించింది.

అనకాపల్లిలో ఉన్మాది ఘాతుకం

- డిగ్రీ విద్యార్థినిపై కత్తితో దాడి

విశాఖపట్నం: ఏపీలోని విశాఖ జిల్లా అనకాపల్లిలో ఓ ఉన్మాది దారుణానికి ఒడిగట్టాడు. ప్రేమను నిరాకరించిందనే కోపంతో యశోద భార్గవి అనే డిగ్రీ విద్యార్థిపై నాగసాయి అనే యువకుడు కత్తితో దాడిచేశాడు. విచక్షణారహితంగా పొడవటంతో అమ్మాయి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన దవాఖానకు తరలించడంతో ఆమె చికిత్స పొందుతున్నది. భార్గవి డీవీఎస్ కాలేజీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. కాలేజీ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై వచ్చిన భార్గవిపై రామచంద్ర థియేటర్ దగ్గర నాగసాయి దాడికి పాల్పడ్డాడు. స్థానికులు ఉన్మాదిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. భార్గవి, నాగసాయి ఇద్దరిదీ రామచంద్రాపురం కాలనీ. సాయి కొంతకాలంగా ప్రేమపేరుతో భార్గవి వెంట పడుతున్నాడు. ఇందుకు యువతి నిరాకరించడంతో ఆమెపై పగ పెంచుకున్నాడు.

ప్రైడ్ ఆఫ్ ఇండియా సింధు

మానసి అందరికీ స్ఫూర్తి.. బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్లను ప్రశంసించిన గవర్నర్.. రాజ్‌భవన్‌లో ఘన సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలతో మెరిసిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుతో పాటు పారా క్రీడాకారిణి మానసి జోషీకి తగిన గుర్తింపు దక్కింది. బుధవారం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సింధు, మానసిని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు ఘనంగా సన్మానించారు. సాయంత్రం తన కుటుంబసభ్యులతో కలిసి రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లోకి ప్రవేశించిన సింధుకు అపూర్వ స్వాగతం లభించింది. గవర్నర్ దంపతులతో పాటు అధికారులు, ప్రముఖులు గౌరవసూచకంగా లేచి నిలబడి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ స్వర్ణ పతకం సాధించిన సింధు దేశ ప్రతిష్ఠను, ఖ్యాతిని ఉన్నత శిఖరాలకు చేర్చిందన్నారు. ఆమె దేశానికే గర్వకారణమన్న గవర్నర్ 'ప్రైడ్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించారు. రాజ్‌భవన్‌లో మొదటి కార్యక్రమం సింధు సన్మానం కావడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచి రాజ్‌భవన్‌కు వచ్చిన సింధు ఇప్పుడు స్వర్ణంతో రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తాను ఉన్నా లేకున్నా రానున్న టోక్యో విశ్వక్రీడల్లో సింధు పసిడి పతకంతో తిరిగి వస్తుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సింధు మరెన్నో విజయాలు సాధించాలని, అప్పటి వరకు ఆమెకు విశ్రాంతి లేదన్నారు.

హైదరాబాద్‌లో బుధవారం ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పసిడి పతక విజేత పీవీ సింధును సన్మానిస్తున్న రాష్ట్ర గవర్నర్ నరసింహన్. చిత్రంలో భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్

మానసి అందరికీ స్ఫూర్తి:

పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకంతో మెరిసిన మానసి జోషి అందరికీ స్ఫూర్తిగా నిలిచారని గవర్నర్ అభినందించారు. ఆమె పట్టుదల, అంకితభావం ఎనలేనిదని ప్రశంసించారు. మానసి జోషి మానసికంగా చాలా బలమైన వ్యక్తిగా నిలిచారన్నారు. ఆమె ప్రతి ఒక్కరికీ రోల్‌మోడల్‌గా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోచ్ పుల్లెల గోపీచంద్‌ను గవర్నర్ అభినందించారు. మరోవైపు సింధు మాట్లాడుతూ గవర్నర్ లాంటి పెద్దల ఆశీర్వాదం ఉంటే తాను ఎంతటి అద్భుతాన్ని అయినా సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేసింది. ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తల్లిదండ్రులతో పాటు కోచ్‌లు కారణమంది. సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు గవర్నర్‌కు గోపీచంద్ కృతజ్ఞతలు తెలిపారు. మానసి జోషి మాట్లాడుతూ సింధు స్వర్ణం సాధించడం గర్వంగా ఉందని, తాము మరింత కష్టపడి దేశానికి, రాష్ట్రానికి మరింత కీర్తి, ప్రతిష్ఠలను తేవడానికి ప్రయత్నిస్తామని అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు పీవీ సింధు, మానసి జోషికి శాలువ కప్పి, జ్ఞాపిక ప్రదానం చేశారు. ఆ తర్వాత ఇద్దరితో కేక్ కట్ చేయించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు గవర్నర్ సలహాదారు ఏపీవీఎన్ శర్మ, ఏకే మహంతి, గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్, జాయింట్ సెక్రెటరీ విద్యాసాగర్ రావు, సీఎన్ రఘుప్రసాద్, ప్రెస్ సెక్రెటరీ మల్లాది కృష్ణానంద్ తదితరులు పాల్గొన్నారు.

మానసికి కేటీఆర్ అభినందనలు: పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన మానసి జోషికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యతులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వీడియో చూసే అలిసిపోయా!

సింధు సాధనపై ఆనంద్ మహీంద్ర ట్వీట్

న్యూఢిల్లీ : ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారత ప్లేయర్‌గా చరిత్ర సృష్టించిన తెలుగు బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుపై ప్రశంసల వర్షం కురుస్తున్నది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర.. సింధు కఠోర వ్యాయామం చేస్తున్న వీడియోను ట్విట్టర్‌లో బుధవారం పోస్ట్ చేశారు. సాధించిన విజయానికి ఆమె శ్రమే కారణమని ప్రశంసించారు. 'అసాధారణం. నేను ఈ వీడియో చూసినందుకే అలిసిపోయా. సింధు ప్రపంచ చాంపియన్ అవడం వెనుక ఎలాంటి రహస్యం లేదు. యువ ప్లేయర్లందరూ ఆమెను ఫాలో అవుతారు. ఆడుతున్న క్రీడలో టాప్‌లో నిలిచేందుకు ఎట్టి పరిస్థితుల్లో నిబద్ధతను వీడకూడదని తెలుసుకుంటారు' అని ఆనంద్ మహీంద్ర ట్వీట్ చేశారు.

ధోనీకి దక్కేనా..?

దక్షిణాఫ్రికాతో వచ్చే నెల 15 నుంచి టీ20 సిరీస్.. సెప్టెంబర్ 4న జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో వచ్చే ఏడాది అక్టోబర్‌లో టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి ఆడే ప్రతి మ్యాచ్ టీమ్‌ఇండియాకు అత్యంత కీలకం. ఆటగాళ్ల ఎంపిక, బెంచ్ బలాన్ని పెంచుకోవడం, బలహీనంగా ఉన్న విభాగాలను పటిష్ఠ పరుచుకోవడం, బ్యాటింగ్ ఆర్డర్‌ను గాడిలోకి తేవడం అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో మూడు టీ20లు(15, 18, 22), మూడు టెస్టులు ఆడేందుకు దక్షిణాఫ్రికా భారత్‌కు రానుంది. వచ్చే నెల 15 నుంచి టీ20 సిరీస్ ప్రారంభం కానుండగా... ఈ సిరీస్ కోసం జట్టును 4వతేదీన సెలెక్టర్లు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే, మొదటి వికెట్ కీపర్‌గా ఎవరిని తీసుకుంటారనే విషయం ఉత్కంఠగా మారింది. రిటైర్మెంట్‌పై మౌనం వహిస్తున్న ధోనీని తిరిగి జట్టులోకి తీసుకుంటారా.. పంత్‌కే ప్రాధాన్యమిస్తారా.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ లాంటి యువకులకు కూడా అవకాశాలిస్తారా అనే విషయం ఆసక్తికరంగా మారింది.

ధోనీ మనసులో ఏముందో..

సైనిక విధులను నిర్వర్తించేందుకు తాను అందుబాటులో ఉండలేనని చెప్పడంతో ధోనీని సెలెక్టర్లు వెస్టిండీస్ పర్యటనకు పరిగణలోకి తీసుకోని విషయం తెలిసిందే. అయితే దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ ఆడడంపై మహీ ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో గడువు దగ్గరపడుతుండడంతో జట్టు ఎంపికకు ముందే సెలెక్టర్లు అతడితో మాట్లాడే అవకాశం ఉంది. భవిష్యత్ ప్రణాళికపై స్పష్టత అడగొచ్చు. ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని యువ ఆటగాళ్లనే ఆడించాల్సి వస్తే పరిస్థితులను వివరించొచ్చు. అయితే, ధోనీ ఆడతానని చెబితే సెలెక్టర్లు ఏం చేస్తారన్న దానిపై ఆసక్తి నెలకొంది.

శాంసన్, ఇషాన్‌కు అవకాశం!

టీ20ల్లో బెంచ్ బలాన్ని పెంపొందించుకునేందుకు రెండో, మూడో వికెట్ కీపింగ్ ఆప్షన్లుగా యువ కీపర్లు సంజూ శాంసన్, ఇషాన్ కిషన్‌ను దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపిక చేసే అవకాశం ఉంది. ఐపీఎల్ సహా దేశవాళీ క్రికెట్‌లోనూ శాంసన్ మంచి ప్రదర్శనలు చేశాడు. పంత్ బిగ్ హిట్టర్ అయినప్పటికీ టెక్నిక్ పరంగా సంజూ కాస్త మెరుగని చెప్పొచ్చు. కాకపోతే కీపింగ్‌లో ఇంకా మెరుగవ్వాల్సి ఉంది. అలాగే తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా-ఏతో భారత్-ఏ ఐదు వన్డేల అనధికార సిరీస్ అడనున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌ల్లో ఇషాన్ కిషన్‌తో పాటు మరికొందరు ఆటగాళ్లను సెలెక్టర్లు నిశితంగా పరిశీలించే అవకాశముంది. అలాగే ముంబై ఇండియన్స్ తరపున కొన్ని మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడడం కిషన్‌కు కలిసొచ్చే అంశం.

పంత్‌కే ఛాన్స్

ధోనీ స్థానాన్ని సమర్థంగా భర్తీ చేసే ఆటగాడని రిషభ్ పంత్‌ను టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ సహా సెలెక్షన్ కమిటీ సైతం నమ్ముతున్నది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు మొదటి కీపర్‌గా పంత్‌కే అవకాశం దక్కుతుందని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. 'రిటైర్మెంట్ అనేది ధోనీ వ్యక్తిగతం. 2020 టీ20 ప్రపంచకప్ కోసం ప్రణాళిక ప్రకారం నిర్ణయాలు తీసుకునే పూర్తిహక్కు సెలెక్టర్లకు ఉంటుంది. అందుకే పంత్‌కే ఎక్కువ అవకాశాలు ఉంటాయి' అని ఆయన అన్నారు. ప్రపంచకప్ ఆడే ముందు భారత్ ఇంకా 22 టీ20లే ఆడనున్న నేపథ్యంలో కొత్త ఆటగాళ్లను ప్రయోగించే అవకాశం ఉందని చెప్పారు. విండీస్‌పై మూడో టీ20లో పంత్ అర్ధశతకంతో రాణించిన విషయం తెలిసిందే. అలాగే వెస్టిండీస్‌పై టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా 3-0తో గెలవడంతో స్వల్ప మార్పులు మినహా అదే జట్టు వైపే సెలెక్టర్లు మొగ్గు చూపే అవకాశముంది.

పట్టుదలకు ప్రతిరూపం

ప్రపంచ విజేతగా నిలిచిన పారా షట్లర్ మానసి జోషి

హైదరాబాద్‌లో బుధవారం పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ విజేత మానసి జోషిని సన్మానిస్తున్న గవర్నర్ నరసింహన్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ఆరేండ్ల వయసులోనే షటిల్ రాకెట్ పట్టింది. బ్యాడ్మింటన్ ప్రపంచాన్ని శాసించాలని స్వప్నిస్తూ నిరంతరం శ్రమించింది. పాఠశాల, జిల్లా స్థాయిల్లోనూ సత్తా చాటింది. అంతా సవ్యంగా సాగుతుందనుకుంటున్న సమయంలో 2011లో ఓ రోడ్డు ప్రమాదం ఆమె జీవితాన్ని మార్చేంది. ప్రమాదంలో ఎడమ కాలును కోల్పోయేలా చేసింది. అయితే, లక్ష్యం, పట్టుదల ముందు కష్టాలన్నీ చిన్నవేనని నిరూపిస్తూ అకుంఠిత దీక్ష, అపార పట్టుదలతో ముందుకు సాగుతూ పారా బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయ వేదికల్లో ఆమె ఎన్నో పతకాలు సాధించింది. కోచ్ పుల్లెల గోపీచంద్ శిక్షణలో మరింత మెరుగైంది. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో జరిగిన పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించి ముప్పైన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. స్వప్నాన్ని సాకారం చేసుకుంది. అమే భారత పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి మానసి జోషి.

తండ్రి ప్రోత్సాహంతో..

1989లో పుట్టిన మానసి జోషి సొంతూరు గుజరాత్‌లోని రాజ్‌కోట్. ఆమె తండ్రి గిరీశ్ జోషీ ముంబయిలోని బాబా అణు పరిశోధన కేంద్రం(బార్క్)లో శాస్త్రవేత్తగా పని చేసి రిటైరయ్యారు. ఆయన కూడా గతంలో టెన్నిస్ ప్లేయరే. చిన్నప్పుడు ఆయనతోనే మానసి బ్యాడ్మింటన్ ఆడడం ప్రారంభించింది. ఆ తర్వాత పాఠశాల, జిల్లాస్థాయిలో రాణించింది. ముంబైలోని ఓ కళాశాలలో 2010లో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది.

50 రోజులు దవాఖానలోనే..

2011లో స్కూటర్‌పై మానసి వెళుతుండగా ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఆ ప్రమాదం కారణంగా ఆమె ఎడమ కాలును కోల్పోయింది. దాదాపు 50 రోజుల పాటు దవాఖానకే పరిమితమైంది. కోలుకున్న తర్వాత తన లక్ష్యాన్ని మరువకుండా ధైర్యంతో ముందుకు సాగింది. కృత్రిమ కాలు సాయంతో బ్యాడ్మింటన్ శిక్షణ ప్రారంభించింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని కోచ్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో చేరి ఆటను మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగింది. 2015 నుంచి అంతర్జాతీయ వేదికలపై పతకాలను సాధిస్తూనే ఉంది. ఈనెల 25న పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్లో మన దేశానికే చెందిన పరుల్ పార్మర్‌పై విజయం సాధించి, తొలిసారి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

మానసి సాధించిన పతకాలు

2015	పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రజతం.
2016	పారా బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్, మహిళల డబుల్స్‌లో కాంస్య పతకాలు
2017	పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో కాంస్యం
2018	థాయ్‌లాండ్ పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్‌లో కాంస్యం
2018	ఆసియా పారా గేమ్స్‌లో కాంస్యం
2019	పారాలింపిక్స్ మహిళల సింగిల్స్‌లో స్వర్ణ పతకం
2019	పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం

ప్రధాని మోదీ అభినందన..

పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 12 పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రధాని మోదీ అభినందిస్తూ ట్వీట్ చేశారు. 'మీ ప్రదర్శన పట్ల 130 కోట్ల మంది భారతీయులు గర్వపడుతున్నారు. జట్టులోని అందరికీ అభినందనలు. మీ విజయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.

విస్మయకు స్వర్ణం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అథ్లెటిక్ మీట్‌లో భారత యువ స్ప్రింటర్ వీకే విస్మయ స్వర్ణ పతకంతో మెరిసింది. బుధవారం బ్రానో(చెక్ రిపబ్లిక్) వేదికగా జరిగిన జోసెఫ్ సెకర్ స్మారక టోర్నీలో మహిళల 400మీటర్ల రేసులో బరిలోకి దిగిన విస్మయ 52.12 సెకన్లతో పసిడి పతకాన్ని ఖాతాలో వేసుకుంది. భారత్‌కే చెందిన పూవమ్మ(53.47సె), సుభా వెంకటేశన్(53.67సె) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. పసిడి పతక ప్రదర్శనతో పాటు విస్మయ తన వ్యక్తిగత టైమింగ్‌ను మెరుగుపర్చుకుంది.

ఐఎస్ఎల్‌లో హైదరాబాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: హైదరాబాద్ ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో హైదరాబాద్ భాగం కాబోతున్నది. అక్టోబర్ 20 తేది నుంచి మొదలుకాబోతున్న ఐఎస్ఎల్ ఆరో సీజన్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు కొత్తగా బరిలోకి దిగబోతున్నది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైదొలిగిన ఎఫ్‌సీ పుణె సిటీ స్థానంలో ఐఎస్ఎల్ నిర్వాహకులు హైదరాబాద్‌కు అవకాశం కల్పించారు. స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు తమ కార్యకలపాలను నడిపించనుంది. విజయ్ మద్దూరి, వరుణ్ త్రిపురనేని హైదరాబాద్ జట్టుకు యజమానులుగా వ్యవహరించనున్నారు.

60 ఏండ్ల కెరీర్..7వేల వికెట్లు

లండన్: క్రికెట్‌లో సాధారణంగా 30 నుంచి 40 ఏండ్ల వయస్సులో ఆటకు వీడ్కోలు పలుకుతారు. అంతకుమించి ఆడిన దాఖలాలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. కానీ వెస్టిండీస్‌కు చెందిన సెసిల్ రైట్ మాత్రం ఎవరికీ సాధ్యం కాని రీతిలో ఏకంగా 60 ఏండ్ల పాటు క్రికెట్ కెరీర్ కొనసాగించాడు. వీవ్ రిచర్డ్స్, జోయల్ గార్నర్ లాంటి దిగ్గజాలతో కలిసి ఆడిన రైట్ తన 60 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఏకంగా 7 వేల వికెట్లు పడగొట్టాడు రైట్. ఐదు సీజన్లలో దాదాపు ప్రతి 27 బంతులకు ఒక వికెట్ చొప్పున 538 వికెట్లు తీశాడు.

హర్యానా, ఢిల్లీ హ్యాట్రిక్

న్యూఢిల్లీ : ప్రొకబడ్డీ ఏడో సీజన్‌లో హర్యానా స్టీలర్స్, ఢిల్లీ దబంగ్స్ జట్లు దూ సుకెళుతున్నాయి. బుధవారమిక్కడ జరిగిన మ్యాచ్‌ల్లో హర్యానా 41-25తో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై గెలిచి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరితే, అతిథ్య ఢిల్లీ 40-24 తేడాతో యూ ముంబాను చిత్తుచేసి టాప్‌ప్లేస్‌ను ఆక్రమించింది. హర్యానా జట్టులో వికాస్ కండోలా(8పాయింట్లు), ప్రశాంత్ కుమార్ రాయ్(8పాయింట్లు) రైడింగ్‌లో రెచ్చిపోగా.. రవికుమార్(6 ట్యా కిల్ పాయింట్లు) పట్టు తోడవడంతో గుజరాత్ భారీ ఓటమిని చవిచూసింది. మ్యాచ్ ప్రారంభంలో 4-0తో ఫార్చున్‌జెయింట్స్ నిలిచినా.. ఆ తర్వాత ఒక్కసారీ ఆధిక్యంలోకి రాలేకపోయారు. మరోమ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ జట్టులో నవీన్ కుమార్(11పాయింట్లు) రైడింగ్‌లో రెచ్చిపోతే ట్యాక్లింగ్‌లో రవీందర్ పహాల్(8 పాయింట్లు) అదరగొట్టాడు. దీంతో యూ ముంబాకు ఘోరపరాభవం తప్పలేదు.

కమ్మిన్స్ స్థానంలో కీమో పాల్

సెయింట్‌జాన్స్(అంటిగ్వా): భారత్‌తో ఈనెల 30 నుంచి మొదలయ్యే రెండో టెస్ట్ కోసం వెస్టిండీస్ క్రికెట్ బోర్డు(డబ్ల్యూఐసీబీ) బుధవారం 13మందితో జట్టును ప్రకటించింది. ఫాస్ట్‌బౌలర్ మిగ్యుల్ కమ్మిన్స్ స్థానంలో ఆల్‌రౌండర్ కీమో పాల్‌కు విండీస్ మేనేజ్‌మెంట్ అవకాశం కల్పించింది. చీలమండ గాయంతో తొలి టెస్ట్‌కు దూరమైన కీమో పాల్ పూర్తి ఫిట్‌నెస్‌తో రెండో టెస్ట్‌కు సిద్ధమయ్యాడని డబ్ల్యూఐసీబీ ఒక ప్రకటనలో పేర్కొంది. రిజర్వ్ వికెట్‌కీపర్‌గా జాహ్‌మార్ హామిల్టన్‌ను ఎంపిక చేయగా, గాయం నుంచి కోలుకుంటున్న షేన్ డౌరిచ్‌కు సెలెక్టర్లు అవకాశం ఇవ్వలేదు.

కీమో పాల్

త్వరలో ఎల్‌వోసీకి అఫ్రిదీ

న్యూఢిల్లీ : కశ్మీరీలకు సంఘీభావంగా ప్రతి శుక్రవారం అర గంటపాటు కార్యక్రమాలను నిర్వహిస్తామని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాను ఈ కార్యక్రమాల్లో భాగస్వామిని అవుతానని, కరాచీలోని పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా సమాధిని శుక్రవారం సందర్శిస్తానని పాక్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిదీ బుధవారం ట్వీట్ చేశాడు. త్వరలో వాస్తవాధీన రేఖ(ఎల్‌వోసీ)ను సందర్శిస్తానని ప్రకటించాడు. 'శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు మజర్ ఈ ఖైద్(జిన్నా సమాధి)ని సందర్శిస్తా. కశ్మీరీలకు సంఘీభావం తెలిపేందుకు నాతో కలిసిరండి. సెప్టెంబర్ 6న ఓ అమర జవాన్ ఇంటికి వెళతా. త్వరలో ఎల్‌వోసీకి వెళతా' అని అఫ్రిదీ పేర్కొన్నాడు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను తొలిగించి.. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా భారత ప్రభుత్వం ఈనెల మొదట్లో విభజించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి భారత్‌పై పాక్ అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది.

టాప్-10లో నలుగురు ఔట్

నాదల్ ముందడుగు
మూడో రౌండ్‌లో ప్లిస్కోవా

న్యూయార్క్ : యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో రెండో సీడ్ రఫెల్ నాదల్(స్పెయిన్) విజయం సాధించగా, టాప్-10లోని డోమినిక్ థీమ్, స్పెఫనోస్ సిట్సిపాస్, కరెన్ కచనోవ్, రాబర్టో బటిస్టా అగట్ పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. మూడు సార్లు యూఎస్ ఓపెన్ విజేత నాదల్ 6-3, 6-2, 6-2 తేడాతో జాన్ మిల్‌మ్యాన్(ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. 2గంటల 8 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు సంధించిన స్పెయిన్ బుల్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. నాదల్ జోరుముందు మిల్‌మ్యాన్ ఏదశలోనూ పోటీనివ్వలేకపోయాడు. మరోమ్యాచ్‌లో నాలుగో సీడ్ డొమినిక్ థీమ్(ఆస్ట్రియా) 4-6, 6-3, 3-6, 2-6తో అన్ సీడెడ్ ఆటగాడు థామస్ ఫాబియానో(ఇటలీ) చేతిలో తొలి రౌండ్‌లోనే ఖంగుతిన్నాడు. 2గంటల 23 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో 48తప్పిదాలు చేసిన థీమ్ తగిన మూల్యం చెల్లించుకున్నాడు. ఇక ఎనిమిదో సీడ్ సిట్సిపాసి(గ్రీస్) 4-6, 7-6(7/5), 6-7(7/9), 5-7తో ఆంద్రీ రుబ్లేవ్(రష్యా) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఈ మ్యాచ్ ఏకంగా మూడు గంటల 54 నిమిషాల పాటు జరగగా సిట్సిపాసి 20 ఏస్‌లు సంధించినా 81 అన్‌ఫోర్స్‌డ్ తప్పిదాలు చేసి ఓడిపోయాడు. తొమ్మిదో సీడ్ కచనోవ్(రష్యా) 6-4, 5-7, 5-7, 6-4, 3-6 తేడాతో సుదీర్ఘంగా జరిగిన పోరులో వసెక్ పాస్పిసిల్(కెనడా) చేతిలో ఓడి తొలి రౌండ్‌లోనే ఇంటి బాట పట్టాడు. మరో మ్యాచ్‌లో పదో సీడ్ బటిస్టా అగట్ 6-3, 1-6, 4-6, 6-3, 3-6తో ఐదు సెట్ల పాటు 47వ ర్యాంకు కుకుష్కిన్(కజకిస్థాన్)పై పోరాడి ఓడాడు. వర్షం కారణంగా కొన్ని మ్యాచ్‌లు ఆలస్యంగా జరిగాయి.



నాదల్

మూడో రౌండ్‌కు ప్లిస్కోవా

మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మూడో సీడ్ కరోలినా ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్) 6-1, 6-4 తేడాతో బోల్కోవడ్జే(జార్జియా)పై సునాయాస విజయం సాధించి, ముందడుగేసింది. గంటా 5 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ప్లిస్కోవా తొమ్మిది ఏస్‌లు సహా నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. తొలి రౌండ్‌లో తొమ్మిదో సీడ్ సబలెంక(బెలారస్)3-6, 6-3, 6-4 తేడాతో తన దేశానికి చెందిన విక్టోరియా అజెరంకాపై గెలిచి, రెండో రౌండ్‌లో ప్రవేశించింది.

ఎఫ్‌డీఐల్లో సంస్కరణల జోష్

- నాలుగు రంగాల్లో నిబంధనలు సరళతరం
- బొగ్గు గనులు, కాంట్రాక్టు తయారీలో 100 శాతం
- విదేశీ పెట్టుబడులకు అనుమతి.. కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న మందగమనాన్ని తొలగించేందుకు ఇటీవలే పన్ను ప్రోత్సాహకాలను ప్రకటించిన కేంద్రం.. ఇప్పుడు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను సరళతరం చేసింది. ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి దిగజారిన జీడీపీని పరుగులు పెట్టించేందుకు ఎఫ్‌డీఐల్లో సంస్కరణలకు తెరతీసింది. బొగ్గు గనులు, కాంట్రాక్టు తయారీలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం ఇక్కడ సమావేశమైన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. అలాగే దేశీయ సింగిల్ బ్రాండ్ రిటైల్‌లోకి వచ్చే ఎఫ్‌డీఐల నిబంధనలనూ సడలించిన క్యాబినెట్.. డిజిటల్ మీడియాలో 26 శాతం విదేశీ పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. గత వారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సంపన్నులపై సర్చార్జీని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాలుగు రంగాల్లో ఎఫ్‌డీఐ నిబంధనలను మోదీ సర్కారు తాజాగా సులభతరం చేసేసింది. ఈ మేరకు క్యాబినెట్ సమావేశం అనంతరం వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ విలేఖరులకు తెలిపారు. 'ఎఫ్‌డీఐ విధానంలో మార్పులు.. దేశంలో తయారీ రంగానికి ఊతమివ్వగలవు. భారత్‌ను విదేశీ పెట్టుబడులకు మరింత ఆకర్షణీయంగా మార్చగలవు. పెట్టుబడులు ఎక్కువై ఉద్యోగాలు పెరిగి వృద్ధిరేటు పుంజుకోగలదు' అని గోయల్ అన్నారు. బొగ్గు గనుల రంగంలో ఆటోమెటిక్ మార్గం కింద 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించామని, బొగ్గు అమ్మకాలూ మౌలిక రంగ అనుబంధ కార్యకలాపాల్లోకే వస్తాయని ఈ సందర్భంగా చెప్పారు. ఈ నిర్ణయం వల్ల బొగ్గు మార్కెట్‌లోకి అంతర్జాతీయ వ్యాపార సంస్థల రాకకు వీలుంటుందని, పోటీయుత, పారదర్శక విపణికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. అలాగే దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చేలా కాంట్రాక్టు తయారీలోకి కూడా ఆటోమెటిక్ మార్గం ద్వారా 100 శాతం ఎఫ్‌డీఐకి వీలు కల్పించామన్నారు. ఇక సింగిల్ బ్రాండ్ రిటైల్ వాణిజ్యంలో 30 శాతం స్థానిక వనరు నిబంధన నిర్వచనాన్ని విస్తరించామని, ఇందుకు సంబంధించి ఉన్న నిబంధనను ఎత్తివేశామని పేర్కొన్న గోయల్.. రిటైల్ ఔట్‌లెట్లు తెరువకుండానే ఆన్‌లైన్ అమ్మకాలకూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చామన్నారు. 'ఆన్‌లైన్ అమ్మకాలు.. లాజిస్టిక్స్, డిజిటల్ పేమెంట్స్, కస్టమర్ కేర్, శిక్షణ, ఉత్పత్తి నైపుణ్యాల్లో ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తాయి' అని ఈ సందర్భంగా గోయల్ అభిప్రాయపడ్డారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 వరకు దేశంలోకి 286 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది. అంతకుముందు నాలుగేండ్లలో 186 బిలియన్ డాలర్లే రాగా, తాజా నిర్ణయాలతో ఈ ఆర్థిక సంవత్సరం నుంచి భారత్‌లోకి ఎఫ్‌డీఐ వరద పారగలదన్న విశ్వాసాన్ని గోయల్ వ్యక్తం చేశారు. నిజానికి 2018-19లో అత్యధికంగా 64.37 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చిందని గుర్తుచేశారు.

చక్కెర పరిశ్రమకు తీపి కబురు



చెరకు రైతుల బకాయిలను తీర్చేందుకు చక్కెర మిల్లుల కోసం రూ.6,268 కోట్ల రాయితీని కేంద్రం ప్రకటించింది. ఆరు మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతి కోసం ఈ సబ్సిడీని క్యాబినెట్ అనుమతించింది. దీంతో అక్టోబర్‌తో మొదలయ్యే మార్కెటింగ్ సంవత్సరం (2019-20)కిగాను చక్కెర మిల్లుల్లో మిగిలిపోయిన చక్కెర నిల్వలను ఎగుమతి చేసేందుకు అవకాశం లభించినట్లైంది. చెరకు రైతులకు చక్కెర కర్మాగారాలు దాదాపు రూ.15,000 కోట్లు బకాయిపడ్డాయి. దీంతో ఈ రాయితీ ప్రతిపాదనను ఆహార మంత్రిత్వ శాఖ తీసుకురాగా, ప్రధాని మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదముద్ర వేసింది. టన్నుకు రూ.10,448 చొప్పున రాయితీని ఇవ్వనున్నట్లు క్యాబినెట్ సమావేశం అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ సమాచార, ప్రసారాల శాఖ మంత్రి ప్రకాశ్ జవడేకర్ చెప్పారు. చెరకు రైతుల ప్రయోజనార్థం ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మా ఈ నిర్ణయం వల్ల ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక తదితర చెరకు సాగు రాష్ట్రాల రైతులకు లాభమన్నారు.

రూ.40 వేలకు చేరువలో బంగారం

రూ.300 పెరిగి రూ.39,970కి చేరిన తులం ధర.. ఏకంగా రూ.2,110 పెరిగిన కిలో వెండి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: బంగారం భగభగ మండుతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న అతి విలువైన లోహాలు బుధవారం మరో శిఖరానికి చేరువయ్యాయి. ప్రాంతీయ ఆభరణాల వర్తకుల నుంచి వచ్చిన కొనుగోళ్ల డిమాండ్, మరోవైపు అంతర్జాతీయ దేశాల ఆర్థిక మందగమన పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన పసిడివైపు మళ్లించడంతో దేశవ్యాప్తంగా పుత్తడి రూ.40 వేలకు చేరువైంది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర మరో రూ.300 అందుకొని రూ.39,970కి చేరుకున్నది. బంగారంతోపాటు వెండి భారీగా పుంజుకున్నది. ఆభరణాల వర్తకులు, నాణేల తయారీదారుల నుంచి వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో కిలో వెండి ధర ఏకంగా రూ.2,110 ఎగబాకి రూ.48,850కి చేరుకున్నది. అమెరికా మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఔన్స్ గోల్డ్ ధర 1,543 డాలర్లకు చేరుకోగా, వెండి 18.38 డాలర్లకు చేరింది. దేశవ్యాప్తంగా పండుగ సీజన్ కావడంతో ప్రాంతీయ ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడం, పెట్టుబడిదారుల తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో నూతన శిఖరాలకు చేరుకున్నాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ హరీష్ వీ తెలిపారు. గ్లోబల్ మార్కెట్లో బంగారం ధర ఆరేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకోవడం కూడా దేశీయంగా ధరలు పెరుగడానికి ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు.

ఆఫ్ఘనిస్థాన్ ఇస్లామిక్ బ్యాంక్ సీఈవోగా హైదరాబాదీ

హఫీజ్ సయ్యద్

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : హైదరాబాద్ పాతబస్తీకి చెందిన హఫీజ్ సయ్యద్ ముసా కలీమ్ ఫలాహీ ఆఫ్ఘనిస్థాన్ ఇస్లామిక్ బ్యాంక్ సీఈవోగా, అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ప్రపంచంలోనే ఏకైక ఇస్లామిక్ బ్యాంక్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించనున్న ఆయన నాలుగేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాల అనుభవమే ఆయనను ఇస్లామిక్ బ్యాంక్ సీఈవోగా అవకాశం లభించింది. గతంలో ఆయన.... ఖతార్ ఇస్లామిక్ బ్యాంక్, దుబాయి ఇస్లామిక్ బ్యాంక్, నూర్ ఇస్లామిక్ బ్యాంక్‌లలో 11 ఏండ్ల పాటు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. గతంలో ఖతార్ ఇస్లామిక్ బ్యాంక్‌గా పిలబడిన ఆఫ్ఘనిస్థాన్ ఇస్లామిక్ బ్యాంక్.. 2018 నుంచి సెంట్రల్ బ్యాంక్ ఆమోదంతో పూర్తిస్థాయి ఇస్లామిక్ బ్యాంక్‌గా మారిపోయింది. ఆఫ్ఘనిస్థాన్‌లో 58 శాఖలతో బ్యాంక్ లావాదేవీలు జరుపుతున్నది. వడ్డీల భారి నుంచి తమనుతాము కాపాడుకునేందుకు ఆ దేశ ప్రజలు బ్యాంక్‌లకు దూరంగా ఉంటున్నారని, ఇలాంటి వారి సౌలభ్యం కోసం ఇస్లామిక్ బ్యాంక్ సేవలందిస్తున్నందని మూసా కలీమ్ ఈ సందర్భంగా తెలిపారు. హలాల్ వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు, వడ్డీరహిత రుణాలను అందించి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తుందన్నారు. మూసా కలీమ్ జమాతే ఇస్లామి హింద్ పూర్వ సెక్రటరీ మౌలానా సయ్యద్ యూసుఫ్ పెద్ద కుమారుడు కావడం విశేషం.

ట్యాక్స్ పేయర్స్‌కు ఊరట!

- రూ.5-10 లక్షల లోపు ఆదాయంపై పన్ను 10 శాతానికి తగ్గించాలి
- రూ.20 లక్షల లోపు ఆదాయంపై 20 శాతానికి కుదించాలి
- కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిఫారసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన వారిపై పది శాతం ఆదాయం పన్ను..రూ.20 లక్షల లోపు ఆదాయం కలిగిన వారిపై విధించే పన్ను 20 శాతానికి దిగిరావాలంటే టాస్క్‌ఫోర్స్ సూచనలు కేంద్ర ప్రభుత్వం అమలు చేయాల్సి ఉంటుంది. 58 ఏండ్ల క్రితం రూపొందించిన ఆదాయం పన్ను చట్టాలను పూర్తిగా మార్చివేయడానికి కేంద్రం గతంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ పలు కీలక సిఫారసులు చేసింది. వీటిలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన వారిపై విధిస్తున్న 20 శాతం ఆదాయం పన్నును 10 శాతానికి, రూ.20 లక్షల లోపు ఆదాయం కలిగిన వారిపై విధిస్తున్న పన్నును 30 శాతానికి బదులుగా 20 శాతం వసూలు చేయాలని ఈ కమిటీ సిఫారస్ చేసింది. ప్రస్తుతం ఉన్న 5 శాతం, 20 శాతం, 30 శాతం పన్నులకు బదులుగా..5 శాతం, 10 శాతం, 20 శాతం, 30 శాతం, 35 శాతం చొప్పున ఐదు స్లాబ్‌లు విధించాలని ఈ ప్రత్యేక ప్యానెల్ సూచించినట్లు ప్రముఖ మీడియా సంస్థ సీఎన్‌బీసీ-టీవీ 18 వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రూ.5 లక్షల లోపు ఆదాయం కలిగిన వారు ఎలాంటి పన్ను చెల్లించకుండా రిబేట్ పొందే అవకాశాన్ని కల్పించింది కేంద్రం. అలాగే జూలై నెలలో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో రూ.2 కోట్ల ఆదాయం ఆర్జించిన వారిపై పన్నును 35 శాతానికి పెంచిన కేంద్రం..తక్కువస్థాయి ఆదాయ వర్గాలకు ఊరట కల్పించడానికి పలు చర్యలు తీసుకుంటున్నది. కాగా, ఆదాయం పన్నులో పూర్తిగా మార్పులు చేర్పులు చేసే ఉద్దేశంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం..సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ సభ్యుడు అఖిలేష్ రంజన్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక ప్యానెల్ ఈ నెల 19న తన నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందచేశారు.

తొలగని భయాలు

దేశ జీడీపీపై తగ్గుతున్న అంచనాలు.. వరుసగా కోత పెడుతున్న రేటింగ్ ఏజెన్సీలు

ఈసారి వృద్ధి 6.7 శాతమేనన్న ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 28:

కేంద్ర ప్రభుత్వం ఉద్దీపనలను ప్రకటిస్తున్నది.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మునుపెన్నడూ లేనివిధంగా రూ.1.76 లక్షల కోట్ల నిధులను ఖజానాకు తరలిస్తున్నది.. అయినా దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై అపనమ్మకం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను జీడీపీ అంచనాలను రేటింగ్ ఏజెన్సీలు వరుసగా కోత పెడుతున్నాయి. తాజాగా ఫిచ్ గ్రూప్‌నకు చెందిన ఇండియా రేటింగ్స్ ఆ జాబితాలో చేరింది. ఈసారి 6.7 శాతమే (ఆరేండ్ల కనిష్ఠం)నన్నది. ఇంతకుముందు అంచనా 7.3 శాతంగా ఉండటం గమనార్హం. వృద్ధిరేటు అంచనాలు ఇలా నీరుగారడం వరుసగా ఇది మూడో ఏడాది అని ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త సునీల్ కుమార్ సిన్హా అన్నారు. దెబ్బతిన్న వినిమయ సామర్థ్యం, పారిశ్రామిక వృద్ధిలో క్షీణత వంటివి ఆర్థిక మందగమనానికి దారి తీసిన విషయం తెలిసిందే. అయితే పరిస్థితులను చక్కదిద్దేందుకు మోదీ సర్కారు నడుం బిగించినా.. ఆ చర్యల ఫలాలు ఇప్పట్లో రావన్న అభిప్రాయాలు రేటింగ్ ఏజెన్సీల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోనూ జీడీపీ 5.7 శాతానికే పరిమితం కాగల దన్న అంచనాలను వ్యక్తం చేస్తున్నాయి. ఇది ఐదేండ్లలో అత్యంత కనిష్ఠం కావడం గమనార్హం. దీంతో వృద్ధిరేటు గమనం ఇలాగే ఉంటే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఆశయ సాధన కష్టతరమేనన్న ఆందోళనలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఈ స్థాయి ఆర్థిక వ్యవస్థకు కనీసం 12 శాతం వృద్ధిరేటు అవసరమని గుర్తుచేస్తున్నాయి. కాగా, సకాలంలో దివాలా కేసుల పరిష్కారం కావడం లేదని, పడిపోతున్న ఎగుమతులు కూడా జీడీపీ గణాంకాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన అన్నారు.

మరింతగా పతనం

ఆర్థిక పరిస్థితులు మరింతగా దిగజారవచ్చన్న అభిప్రాయాల్ని డన్‌అండ్‌బ్రాడ్‌స్ట్రీట్ ఎకానమీ వ్యక్తం చేసింది. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న నిర్మాణాత్మక లోపాలకు తక్షణ పరిష్కారం లేదన్నది. పలు వైపుల నుంచి బహుళ సవాళ్లు ఎదురవుతుండటంతో జీడీపీ కోలుకోవడానికి సమయం పడుతుందని చెప్పింది. మరోవైపు దేశ ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపన చర్యలు దన్నుగా నిలుస్తున్నా.. ప్రతికూలతలు మాత్రం తప్పవని మూడీస్ హెచ్చరిస్తున్నది.

మార్చికల్లా స్వల్ప వృద్ధి

వచ్చే ఏడాది మార్చి నాటికి భారతీయ ఆర్థిక వ్యవస్థ స్వల్పంగా కోలుకోవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. కొనుగోళ్లు పెరిగి, దేశ ఆర్థిక పరిస్థితులు కొంత మెరుగవ్వగలవని చెప్పింది. '2020 మార్చికల్లా భారత్ జీడీపీ వృద్ధికి 0.3 శాతం బలం చేకూరవచ్చు. కేంద్ర ప్రభుత్వ ఉద్దీపనలు, ఆర్బీఐ మిగులు నగదు నిల్వలు ఇందుకు దోహదపడన్నాయి' అని గోల్డ్‌మన్స్ సాచ్స్ చెప్పింది.

హోమియోకేర్ ఇంటర్నేషనల్ వితరణ

ఉత్తర కర్నాటకలోని వరద బాధితుల కోసం హోమియోకేర్ ఇంటర్నేషనల్ బుధవారం వరద సహాయక కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులను పంపిణీ చేసింది. త్వరలోనే ముంపు ప్రాంతాల్లో అనుభవజ్ఞులైన వైద్యుల బృందం పర్యటించి ఉచితంగా మందులనూ ఇవ్వనుందని సంస్థ ప్రకటించింది.

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం

ప్రకటన

కొత్త ఢిల్లి, 25 జూన్, 2019

S.O. 2076(E)-నేషనల్ హైవేస్ యాక్ట్, 1956 (48 ఆఫ్ 1956) (ఇకపై సదరు చట్టంగా రిఫర్ చేయబడును)లోని సెక్షన్ 3Aలో సబ్-సెక్షన్(1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ, తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లానందు కి.మీ. 42.00 నుండి కి.మీ. 50.00 (రెవెన్యూ డివిజినల్ అధికారి, కల్వకుర్తి డివిజన్, నాగర్ కర్నూల్ జిల్లా) వరకు భూమి విస్తరణలో జాతీయ రహదారి నెం. 167 యొక్క నిర్మాణం (వెడల్పు చేయుట/పేవ్డ్ షోల్డర్‌తో టూ లేన్/ఫోర్ లేనింగ్ మొ॥వి), మెయిన్‌టెనెన్స్, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు దిగువ షెడ్యూలులో సంక్షిప్తంగా వివరించిన భూమి ప్రజోపయోగార్థం అవసరమైనదని సంతృప్తి చెందిన మీదట కేంద్ర ప్రభుత్వం సదరు భూమిని సేకరించాలనే దాని ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఎవరైనా వ్యక్తి అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరవై-ఒక్క రోజులలోగా, సదరు చట్టంలోని సెక్షన్ 3Cలో సబ్-సెక్షన్(1) క్రింద పై ఉద్దేశ్యం కొరకు సదరు భూమి వినియోగానికి అభ్యంతరం తెలుపవచ్చు. అటువంటి ప్రతి అభ్యంతరాన్ని సమర్థ ప్రాధికారి అనగా రెవెన్యూ డివిజినల్ అధికారి, కల్వకుర్తి వారికి వ్రాతపూర్వకంగా, వాటి కారణాలను తెలుపుతూ తెలియజేయాలి. అభ్యంతరం తెలిపే వ్యక్తికి స్వయంగా కాని లేదా లీగల్ ప్రాక్టిషనర్ ద్వారా కాని తెలియజేసే అవకాశాన్ని సమర్థ ప్రాధికారి ఇస్తారు. అటువంటి అన్ని అభ్యంతరాలను విచారించిన తరువాత మరియు ఏదేని తదుపరి విచారణ చేసిన తర్వాత, సమర్థ ప్రాధికారి అవసరమని భావించిన విధంగా, ఉత్తర్వు ద్వారా అభ్యంతరాలను అనుమతించవచ్చు లేదా అనుమతించకపోవచ్చు.

సదరు చట్టంలోని సెక్షన్ 3Cలో సబ్-సెక్షన్(2) క్రింద సమర్థ ప్రాధికారి చేసిన ఏదేని ఉత్తర్వు తుదిగా ఉంటుంది.

వారి ప్రకటన క్రింద సేకరించవలసిన భూమి ప్లాన్స్ మరియు భూమి ఇతర వివరాలు పైన తెలిపిన సమర్థ ప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి మరియు వాటిని ఆసక్తిగల వ్యక్తి తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లా నందు జాతీయ రహదారి-167 (రెవెన్యూ డివిజినల్ ఆఫీస్, కల్వకుర్తి డివిజన్) యొక్క **జడ్చర్ల-కల్వకుర్తి సెక్షన్ (గతంలో SH-18) యొక్క కి.మీ. 42 నుండి కి.మీ. 50 వరకు** భూమి విస్తరణలోకి వచ్చే కట్టడములు లేదా కట్టడములు లేకుండా సేకరించనున్న భూమి సంక్షిప్త వివరణ.

రాష్ట్రం: తెలంగాణ **జిల్లా: నాగర్ కర్నూల్**

క్ర. సం.	సర్వే/ప్లాట్ నెంబర్	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం (లోకల్ యూనిట్‌లలో) (చ.మీటర్లలో)	విస్తీర్ణం (హెక్టార్లలో)
1	2	3	4	5	6
తాలూకా: ఉర్కొండ					
గ్రామం: ఉర్కొండ					
1.	239	ప్రైవేట్	(మెట్ట)	1,011.7140000	0.1011714
2.	241	ప్రైవేట్	(మెట్ట)	404.7000000	0.0404700
3.	251	ప్రైవేట్	(మెట్ట)	303.5120000	0.2225940
			మొత్తం	1,719.9260	0.1720

[F.No.RW/NH-12011/9/2017/TS/P-7/3A3
రాజేష్ గుప్త, డిప్యూటీ సెక్రటరీ

తెలంగాణ ప్రభుత్వం

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం : వనపర్తి

ఫారం-సి నోటిఫికేషన్

(భూసేకరణ వనరుపరాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టము 2016 (చట్టం నెం. 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) మరియు 10A మినహాయింపు అనుసరించి (రూల్ 6/12 చూడుము)

ఫైల్ నెం. ఆ/259/2019 తేది : 16.03.2019

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా మహాత్మా గాంధి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద కెనాల్ సిఎం & సిడి వర్క్స్ ఆఫ్ బాద్దూరం బ్రాంచ్ మెన్ కెనాల్ కి.మీ. 11.925 నుండి కి.మీ. 11.000 వరకు కాలువ రూపొందించుట కొరకు వనపర్తి జిల్లా ఘణపూర్ మండలం యొక్క పాలిపూర్ గ్రామం యొక్క మొత్తం ఎ. 84.27 గంటలు భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ వనపర్తి వారు భావించుచున్నారు.

అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు వనపర్తి జిల్లా ఘణపూర్ మండలం యొక్క పాలిపూర్ గ్రామంలో ఎ. 84.27 గంటలు విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

గ్రామము : పాలిపూర్ మండలం : ఘణపూర్

క్రమ సంఖ్య	సర్వే నెం.	పట్టా వర్గీకరణం	భూ వర్గీకరణం	భూసేకరణ క్రింద తనుపోబడిన విస్తీర్ణం	పట్టాదారు పేరు / అనుభవదారు పేరు	సరిహద్దులు: తూర్పు	దక్షిణం	పడమర	ఉత్తర
1	2	3	4	5	6	7	8	9	10
1	69	పట్టా	మెట్ట	0.38	లంబాడి కేతవత్ ధోరియా తండ్రి మూల్యా	72	77	77	70
				0.18	సళ్ళ తండ్రి కన్నా				
2	72	పట్టా	మెట్ట	2.15	యం.కురుమయ్య తండ్రి పెద్ద ముసలయ్య	70	77	77	71
3	73	పట్టా	మెట్ట	0.15	హనుమంతు తండ్రి గోజ్య	వివి	77	77	77
				0.15	చందు తండ్రి గోజ్య				
				0.15	గోప్య తండ్రి గోజ్య				
				0.15	రాములు తండ్రి గోజ్య				
				0.15	జర్నియ తండ్రి గోజ్య				
				0.18	సలమ్మ భర్త నామూల్య				
				0.15	నామూల్య తండ్రి గోజ్య				
4	74	పట్టా	మెట్ట	0.35	సాయమ్మ భర్త కొండయ్య	77	77	77	77
5	77	ప్రభుత్వ	మెట్ట	0.09	ఎల్.హనుమలాల తండ్రి గోజ్య	74	వివి	78	69
				0.09	చంద్రు తండ్రి గోజ్య				
				0.08	గోప్య తండ్రి గోజ్య				
				0.09	రాముడు తండ్రి గోజ్య				
				0.08	గోర్యియ తండ్రి గోజ్య				
				0.08	నాను లాలా తండ్రి గోజ్య				
				0.05	పెద్ద వెంకతయ్య తండ్రి నారాయణ				
				0.04	చిన్న వెంకతయ్య తండ్రి నారాయణ				
				0.10	కొత్త వెంకటయ్య తండ్రి బాలయ్య				
				1.00	గాయిరను				
				0.18	మణ్యం తండ్రి పెద్ద నాగన్న				
				0.28	యెల్లయ్య తండ్రి బాలయ్య				
				0.15	చిన్న వెంకతయ్య తండ్రి మసన్న				
				0.30	రాములు తండ్రి పోసయ్య				
				1.24	శివన్న తండ్రి ఐక్కయ్య				
				1.01	నాగన్న తండ్రి బాలయ్య				
				1.01	వెంకటయ్య తండ్రి బొల్లన్న				
				0.15	కర్రన్న తండ్రి బాలయ్య				
				0.14	రవి తండ్రి మణ్యం				
				0.15	తిరుపతి తండ్రి మణ్యం				
				0.15	ఆంజనేయులు తండ్రి మణ్యం				
				1.24	మణ్యం తండ్రి జనయ్య				
				1.25	నాగన్న తండ్రి నాగయ్య				
				1.20	వెంకటమ్మ భర్త కర్రన్న				
				1.30	చంద్రయ్య తండ్రి కురుమయ్య				
				1.00	లక్ష్మి భర్త పెద్ద కురుమన్న				
				1.00	చిన్న కురుమన్న తండ్రి తిరుమలయ్య				
				1.00	రాములు తండ్రి అమ్మ				
				0.22	గొల్ల జనయ్య తండ్రి సాయిలు				
				0.22	చిన్న కూర్మన్న తండ్రి సాయిలు				
				0.22	గొల్ల పెంటయ్య తండ్రి పెద్దకురుమయ్య				
				0.18	శాంతయ్య తండ్రి సాయిలు				
				0.21	రోడ్				
				0.24	బి.టి.రోడ్				
				5.35	గాయిరన్				
				5.29	ప్రభుత్వం భూమి				
6	78	పట్టా	మెట్ట	0.15	రవీంధర రెడ్డి తండ్రి రామి రెడ్డి	77	77	77	77
				0.22	హనుమంతు తండ్రి పాపన్న				
				0.29	పెద్ద వెంకటయ్య తండ్రి నారాయణ				
				0.29	చిన్న వెంకటయ్య తండ్రి నారాయణ				
				0.25	మసయ్య తండ్రి నాగయ్య				
7	79	పట్టా	మెట్ట	3.00	రవీంధర రెడ్డి తండ్రి రామి రెడ్డి	78	80	77	77
				0.22	హనుమంతు తండ్రి పాపన్న				
8	80	పట్టా	మెట్ట	0.12	సంకేవ రెడ్డి తండ్రి రామి రెడ్డి	79	81	77	77
9	81	పట్టా	మెట్ట	0.17	బందలయ్య తండ్రి బుచ్చన్న	92	85	89	82
				0.24	ఉశన్న తండ్రి చంద్రయ్య				
				0.16	శేసయ్య తండ్రి ఆసన్న				
				0.17	తిరుపయ్య తండ్రి ఆశన్న				
				0.22	మానెమ్మ భర్త వెంకటయ్య				
				1.00	రాణి భర్త శ్రీనివాసులు రెడ్డి				
				0.16	రాములమ్మ భర్త కురుమయ్య				
				0.10	శ్రీశైలం తండ్రి మసలయ్య				
				0.10	వెంకటయ్య తండ్రి మసయ్య				
10	85	పట్టా	మెట్ట	0.15	వెంకటయ్య తండ్రి మచనయ్య	వివి	86	83


KARAN CONCEPTS / 9966 767 899
బంగారు తెలంగాణ కోసం నిరంతరం శ్రమిస్తూ
కోటి ఎకరాల మాగాణికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తూ
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను
పరిశీలించేందుకు వస్తున్న ఆధునిక భగీరథుడు
మాన్య శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు
రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి
స్వాగత సుమాంజలి
మర్రి జనార్దన్ రెడ్డి ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 29 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

కమాండర్ శాలిజా!

చరిత్ర సృష్టించడం కొంచెం ఆలస్యం అవొచ్చేమో గానీ మహిళలు మాత్రం కచ్చితంగా ఆ పని చేయగలుగుతున్నారు. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ రంగాల్లో మహిళలు రికార్డులు నెలకొల్పుతున్నారు. ఇటీవల ఎయిర్ ఫోర్స్‌లో తొలి మహిళా ఫైట్ కమాండర్‌గా 'శాలిజా ధామి' రికార్డు సృష్టించారు.

ధైర్యంతో కూడిన నిర్ణయం. భయమే తెలియని బాధ్యతలు, పట్టు విడవకుండా విధులు. అంతిమంగా అనుభవం ఆ పై విజయం. కమాండర్ శాలిజా.. ఎయిర్‌ఫోర్స్‌లో చేరిన నాటి నుంచి ఆ ప్రయాణం ఇలాగే సాగింది. తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే ఆమె పైలెట్ కావాలని కలలు కన్నది. ఉన్నత విద్యలు అభ్యసించి ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించింది. 15 ఏండ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించింది. వేర్వేరు విభాగాల్లో పని చేసిన అనుభవాన్ని సాధించింది. పెద్ద పెద్ద చాపర్లు నడిపి ప్రతిభ కనబర్చింది. తోటి పైలెట్లకు శిక్షకురాలిగా బాధ్యతలు నిర్వహించింది. అప్పుడే మొదటిసారి వుమెన్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా రికార్డు సృష్టించింది. ఇప్పుడు తాజాగా ఫ్లయింగ్ యూనిట్‌కు ఫైట్‌కమాండర్‌గా బాధ్యతలు చేపట్టింది. యూపీలోని ఘూజియాబాద్ ఎయిర్ బేస్‌కు చెందిన చేతక్ హెలికాప్టర్ యూనిట్‌కు కమాండర్‌గా వ్యవహరించనున్నది. సింగిల్ ఇంజిన్ టర్బో షాఫ్ట్ కలిగిన ఈ చేతక్ గంటకు 220కిలోమీటర్లు ప్రయాణించగలదు. దీన్ని సెర్చ్, రెస్క్యూ, అత్యవసర వైద్యసేవలు, మెటీరియల్ ట్రాన్స్‌ఫర్ తో పాటు ప్రత్యేక ఆపరేషన్ల సమయంలో వాడతారు. ఇలాంటి యూనిట్‌కు కమాండర్‌గా శాలిజా బాధ్యతలు నిర్వహిస్తున్నది.

సూపర్ మీల్!

రోజూ అన్నం, పప్పు, ఏదో ఒక కాయగూర.. రొటీన్‌కి భిన్నంగా ఉండాలంటే.. కాస్త టేస్టీ రైస్‌తో పాటు అందులో డీప్ ఫ్రై.. షోర్వాలతో పాటు మధ్యమధ్యలో నంజుకోవడానికి గారెల వంటివి ఉంటే.. అబ్బో.. ఆ మీల్ అదుర్స్ అంటారేమో కదా! చివరగా ఒక స్వీట్‌తో ముగించేస్తే.. ఆ ఆత్మరాముడు చల్లబడడం ఖాయం.. అందుకే ఆ స్పెషల్ వంటకాలు మీకోసం..

కాళ్ల కూర షోర్వా

కావాల్సినవి :

మేక కాళ్లు : 250 గ్రా.
ఉల్లిపాయ ముక్కలు : 250 గ్రా.
పచ్చిమిర్చి : 4
కరివేపాకు : 4 రెమ్మలు
అల్లం, వెల్లుల్లి పేస్ట్ : 2 టీస్పూన్స్
కారం : 2 టేబుల్‌స్పూన్స్
ధనియాల పొడి : 1 1/2 టీస్పూన్స్
గరం మసాలా : అర టీస్పూన్
కొత్తిమీర : చిన్న కట్ట
ఉప్పు, కారం : తగినంత

తయారీ :

పెద్ద కుక్కర్ తీసుకొని అందులో శుభ్రం చేసుకున్న మేక కాళ్ల మాంసాన్ని వేయాలి. దీంట్లో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం, ధనియాల పొడి, గరం మసాలా, నూనె అన్నీ వేసి కలిపి అందులో ఉంచాలి. పది నిమిషాల తర్వాత నాలుగు లీటర్ల నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టేయాలి. పది విజిల్స్ వచ్చేవరకు స్టౌ మీద ఉంచాలి. ఆ తర్వాత దించేయాలి. కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. దీన్ని వేడిగా లాగిస్తేనే బాగుంటుంది.

మొక్కజొన్న గారెలు

కావాల్సినవి :

మొక్కజొన్న గింజలు : 300 గ్రా. (పచ్చివి)
మొక్కజొన్న పిండి : 200 గ్రా.
మైదా పిండి : 50 గ్రా.
అల్లం, వెల్లుల్లి ముక్కలు : ఒక టేబుల్‌స్పూన్
పచ్చిమిర్చి : 4
ఉల్లిపాయ ముక్కలు : 2 టేబుల్‌స్పూన్స్
కొత్తిమీర : ఒక కట్ట
ఉప్పు, నూనె : తగినంత

తయారీ :

మొక్కజొన్న గింజలను మరీ మెత్తగా కాకుండా మిక్సీ పట్టుకోవాలి. దీన్ని ఒక గిన్నెలో వేసుకొని, దీంట్లో మొక్కజొన్న పిండి, మైదాపిండి, అల్లం, వెల్లుల్లి ముక్కలు, తరిగిన పచ్చి మిర్చి, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, ఉప్పు వేసి కలిపి పెట్టుకోవాలి. పది నిమిషాలు పిండిని అలాగే ఉంచాలి. ఈ లోపు కడాయిలో నూనె పోసి వేడి చేయాలి. నూనె కాగుతున్నప్పుడు మొక్కజొన్న మిశ్రమాన్ని చిన్న చిన్న గారెల్లా ఒత్తుకొని నూనెలో గోల్డెన్ కలర్ వచ్చే వరకు వేయించాలి. వేడి వేడి టేస్టీ వడలు మీ ముందుంటాయి.

భగారన్నం

కావాల్సినవి :

బాస్మతి బియ్యం : 300 గ్రా.
గరం మసాలా : 2 టేబుల్‌స్పూన్స్,
ఉల్లిగడ్డలు : 2, **పచ్చిమిర్చి :** 5,
అల్లం, వెల్లుల్లి పేస్ట్ : 2 టేబుల్‌స్పూన్స్, **ధనియాల పొడి :** 2 టేబుల్‌స్పూన్స్, **నూనె :** 4 టేబుల్‌స్పూన్స్, **నెయ్యి :** 2 టేబుల్‌స్పూన్స్,
కరివేపాకు : 2 రెమ్మలు, **పుదీనా :** 4 రెమ్మలు, **ఉప్పు :** తగినంత

తయారీ : బాస్మతీ బియ్యాన్ని కడిగి నానబెట్టాలి. ఒక గిన్నె తీసుకొని అందులో నూనె పోసి వేడి చేయాలి. అందులో గరం మసాలా వేసి వేయించాలి. దీంట్లో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి వేసి కలుపాలి. అల్లం పేస్ట్ పచ్చి వాసన పోయే వరకు కలుపాలి. ఇందులో కొత్తిమీర, కరివేపాకు, పుదీనా వేసి కలుపుకోవాలి. ఇవన్నీ వేగిన తర్వాత.. బియ్యానికి సరిపడా నీళ్లు పోసి, ఉప్పు వేసి మరిగించాలి. నీళ్లు మరుగుతున్నప్పుడు బియ్యంలో నీళ్లు ఒంపేసి బియ్యాన్ని అందులో వేయాలి. ఐదు నిమిషాల తర్వాత సన్నని మంట మీద ఉంచి నీరు మొత్తం ఇంకిపోయేవరకు ఉంచి దించేయాలి. పై నుంచి కొత్తిమీరతో గార్నిష్ చేస్తే భగారన్నం రెడీ! దీన్ని నాన్‌వెజ్ కూరలతో తింటే యమ టేస్టీగా ఉంటుంది.

భట్టి మాంసం మటన్

కావాల్సినవి :

మటన్ : 250 గ్రా.
కారం పొడి : 3 టేబుల్‌స్పూన్స్
ధనియాల పొడి : 2 టేబుల్‌స్పూన్స్, **జీలకర్ర పొడి :** ఒక టేబుల్‌స్పూన్, **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** ఒక టేబుల్‌స్పూన్, **గట్టి పెరుగు :** 5 టేబుల్‌స్పూన్స్, **నిమ్మరసం :** 2 టేబుల్‌స్పూన్స్, **కొత్తిమీర :** ఒక కట్ట, **ఉప్పు, నూనె :** తగినంత

తయారీ :

మటన్‌ని చిన్న ముక్కలుగా కట్ చేసుకొని ఒక గిన్నెలోకి వేసుకోవాలి. ఇందులో కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, అల్లం, వెల్లుల్లి పేస్ట్, నూనె, పెరుగు, ఉప్పు, నిమ్మరసం, కొత్తిమీర వేసి బాగా కలుపాలి. దీన్ని ఒక పావుగంట పాటు మూత పెట్టేసి పక్కన పెట్టేయాలి. ఇప్పుడు సింగిడి పొయ్యి తీసుకొని దాంట్లో బొగ్గులు వేసి అంటించుకోవాలి. బొగ్గులు వేడయ్యే లోపు.. రెండు సీకులను తీసుకొని మటన్ ముక్కలను సీకులకు గుచ్చాలి. బొగ్గుల మీద ఈ సీకులను ఉంచి ముక్కలను బాగా కాల్చుకోవాలి. ఈ ముక్కలను పుదీనా చట్నీతో తింటే మరింత టేస్టీగా ఉంటాయి.

పూతరేకులు

కావాల్సినవి :

బియ్యం : 250 గ్రా., **చక్కెర :** 250 గ్రా., **నెయ్యి :** 100 గ్రా.

తయారీ : చక్కెరను మిక్సీ పట్టి పొడిలా చేసుకోవాలి. బియ్యం కడిగి ఐదు గంటల ముందుగా నానబెట్టాలి. ఆ తర్వాత కూడా రెండు మూడు సార్లు కడిగి రుబ్బుకోవాలి. పాలలా చిక్కగా అయ్యేలా ఈ పిండి ఉండాలి. దీంట్లో కాస్త చక్కెర పిండిని కలిపి ఉంచుకోవాలి. ఇప్పుడు కట్టెల పొయ్యి మీద కుండ బోర్లించాలి. ఒక మెత్తటి కాటన్ బట్టను తీసుకోవాలి. కుండకు కాస్త నెయ్యి రాయాలి. ఆ తర్వాత బట్టను బియ్యం పిండి మిశ్రమంలో ముంచి కుండ మీద వేయాలి. ఈ పొరలా వచ్చిన దాన్ని కాలిన తర్వాత మనకు నచ్చిన రీతిలో మడుచుకోవాలి. పూత రేకుల పై మనకు నచ్చిన ఐస్ క్రీమ్ పెట్టి సర్వ్ చేస్తే రుచి అదిరిపోతుంది.

సతీష్
ఎగ్జిక్యూటివ్ చెఫ్
కృష్ణపట్నం
జూబ్లీహిల్స్, రోడ్‌నం. 36
హైదరాబాద్

దివ్యాంగుల ఆశాజ్యోతి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు వీల్‌చైర్లపై వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త విధానంలో స్మింజు అనే ఈ దివ్యాంగురాలి పోరాటం ఉన్నది.

స్మింజు జిందాల్.. దివ్యాంగులపాలిట ఆశాజ్యోతి. స్వతంత్ర్య భారతంలో ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా దివ్యాంగులకు కూడా స్వేచ్ఛగా సంచరించే హక్కు ఉన్నదని చెబుతున్నది. ఆ దిశగా దివ్యాంగులకు కూడా ప్రభుత్వాలు మౌలిక సదుపాయలు, రవాణ వ్యవస్థను కల్పించాలని పోరాటం చేస్తున్నది స్మింజు. తన పోరాటాల ఫలితంగా ఎన్నో మరుపురాని విజయాలను సొంతం చేసుకున్నది. తన 11వ యేట జైపూర్ నుంచి ఢిల్లీకి వస్తున్న క్రమంలో కారు ప్రమాదం జరగింది. ఈ ప్రమాదంతో వెన్నెముకకు తీవ్రగాయాలు కావడంతో వీల్‌చైర్‌కే పరిమితమైంది. తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహించి బాగా చదువుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇలా పదేండ్ల పాటు ఇంటికే పరిమితమైంది స్మింజు. ఆ తర్వాత 'స్వయం' అనే ఎన్జీఓను ఏర్పాటు చేసి దివ్యాంగులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పోరాటాలు చేస్తున్నది. వాటి ఫలితంగా దేశంలోని రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, హోటల్స్, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్‌లో చాలా సంస్కరణలు జరిగాయి. ప్రస్తుతం స్వయం సంస్థ 'ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్జ్ బోర్డ్ (టీఆర్‌బీ)'లో సభ్యుడిగా కొనసాగుతున్నది. దేశంలో పేరొందిన చారిత్రక కట్టడాలను దివ్యాంగులు సందర్శించేందుకు వీలుగా.. కేంద్ర పర్యాటక శాఖ ద్వారా ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టింది స్మింజు. ఆమె కృషికి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి, ఇతర సంస్థల నుంచి అవార్డులు, సత్కారాలు అందుకున్నది.

ఆరోగ్యానికి అనాస!

ఏ కాలంలో అయినా దొరికే పండు అనాసపండు. ఇది ఆరోగ్యానికి ముఖ్యంగా మూత్ర సంబంధిత ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంలో కీలకంగా పనిచేస్తుంది. అనాసలో ఉండే పోషకాలు ఏ విధంగా మేలుచేస్తాయో తెలుసుకోండి.

- ఈ ఫలంలో విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది. దానివల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో నీరు చేరిన వారు అనాస తింటే మంచిది.
- అనాసలో పీచు పదార్థం ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను శుభ్రం చేసి దాని పనితీరును మెరుగు పరుస్తుంది. మలబద్ధకం ఉన్నవారు ప్రతిరోజూ రాత్రిపూట నాలుగు అనాస ముక్కలు తింటే ఆ సమస్య దూరమవుతుంది.
- రక్తలేమి ఉన్నవారికి అనాస మంచి ఆహారం. దీనిలోని పోషకాలు ఎర్ర రక్తకణాల వృద్ధికి తోడ్పడుతాయి. రక్తప్రసరణ సక్రమంగా ఉంటుంది. అన్ని అవయవాలకు ప్రాణవాయువు సరిగ్గా సరఫరా అవుతుంది.
- జీవనశైలిలో మార్పులూ, ఆహారపు అలవాట్ల వల్ల కొందరికి జీవక్రియ రేటులో అసమానతలు ఏర్పడుతాయి. అలాంటి సమస్యకు అనాసతో చెక్ పెట్టొచ్చు. ఇందులోని మాంగనీస్, విటమిన్ -సీ, థియామిన్ (బి1) శరీరంలోని ఆరోగ్య కణాల పనితీరులో, ఆరోగ్యకరమైన జీవక్రియలో కీలకంగా పనిచేస్తాయి.
- మంట, నొప్పులను తగ్గించే గుణాలు ఈ పండులో ఉన్నాయి. మోకాళ్లు, కండరాల సమస్యలున్నవారు ఇవి తినడం చాలా మంచిది. బరువు తగ్గాలనుకునే వారు అనాసపండు తీసుకుంటే మంచిది. కొన్ని ముక్కలు తిన్నా పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనిలోని పోషకాలు శరీరంలోని హాని చేసే కొవ్వుతో పోరాడుతాయి.

వంటింటి చిట్కాలు

- కట్‌చేసిన ఆపిల్ ముక్కలపై నిమ్మరసం చల్లితే రంగు మారకుండా ఉంటాయి.
- పుట్టగొడుగుల్ని వండేముందు పొడి వస్త్రంతో తుడిచి ఆ తర్వాత నీటితో కడిగి మరలా బట్టతో తుడువాలి. ఇలా చేస్తే పుట్టగొడుగుల్లో దుమ్ము నశిస్తుంది.
- ఆకుకూరల్ని కోయడానికి ముందు పెద్ద గిన్నెలో సగానికి నీరు పోసి అందులో ఉంచాలి. ఆ నీటిలో కొంచెం సోడా కలుపాలి. ఆ తర్వాత ఆకుకూరల్ని బయటకు తీసి మంచినీటితో కడిగి వండుకోవాలి.
- ఉప్పు కలిపిన నీటిలో కోసిన పండ్లు వేయాలి. 2 నిమిషాలపాటు అలానే ఉంచి తీసేయాలి. దీనివల్ల పండ్లు బ్రౌన్ రంగులోకి మారకుండా తాజాగా కనిపిస్తాయి.
- వంటింటి గట్టుపై నూనె పదార్థాలు తాలూకు మరకలు పడితే వెనిగర్‌లో కోడిగుడ్డు పెంకుల పొడి కలిపి ఆ ప్రదేశంలో రాయాలి. కాసేపటి తర్వాత పీచుతో రుద్దితే మరకలు వదిలిపోతాయి.

పండే కాదు.. తొక్క కూడా ఉపయోగమే

రోజుకో పండు తింటే శరీరానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పండ్లు మాత్రమే కాదు వాటి తొక్కలు కూడా చర్మానికి మేలు చేస్తాయి. అయితే ఈ తొక్కలు చర్మానికి ఎలా ఉపయోగపడుతాయో చూద్దాం.

నారింజపండు : వీటిని తిని తొక్కలను పడేస్తారు. పిల్లలయితే తొక్కలను కంట్లో నలుపుకొని సరదాగా ఆడుకుంటారు. వీటితో అందం కూడా రెట్టింపు చేసుకోవచ్చు. నారింజ తొక్కలను ఎండబెట్టి పొడి చేయాలి. ఈ పొడికి కొంచెం పసుపు, రోజ్ వాటర్ వేసి కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. 15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడుగాలి.

పాప్పడి : బాగా పండిన పొప్పడి గుజ్జును తీసుకోవాలి. దానికి తేనె, పాలు వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకోవాలి. 20 నిమిషాల తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. మొటిమలు ఉంటే ఈ మిశ్రమంలో పాలకు బదులుగా నిమ్మరసాన్ని కలిపి ముఖానికి రాసుకోవాలి.

అరటిపండు : ఈ పండుని తిని తొక్కలను తీసిపెట్టుకోవాలి. రాత్రి పడుకునే ముందు తొక్క లోపలి భాగంతో ముఖంపై రుద్దాలి. దీన్ని 15 నిమిషాల పాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత చల్లని నీటితో కడుగాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే ముఖం అందంగా మారడం గమనించవచ్చు.

మామిడిపండు : వీటి తొక్కలను బాగా ఎండబెట్టి పౌడర్ చేయాలి. అందులో కొంచెం గోధుమపిండి, నీటిని వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి 10 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చర్మంపై ట్యాన్ తొలుగుతుంది.

పుచ్చకాయ : ఎరుపు రంగులో ఉండే పుచ్చకాయ గుజ్జును తిన్న తర్వాత కాయను కొంచెంసేపు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఆ తర్వాత లావుగా ఉండే ముఖానికి 5 నిమిషాల పాటు మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి తేమ అందడంతో పాటు కాంతివంతంగా తయారవుతుంది.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 29 ఆగస్టు 2019
raithubadi@ntnews.com

కాకరలో విత్తనోత్పత్తి

పుష్కలమైన ఔషధ గుణాలతో కూడి, షుగర్ రోగుల పాలిట వరమైన పంట కాకర. రాష్ట్రంలో ఈ పంట సాగుకు అత్యంత అనుకూల వాతావరణం ఉన్నది. ఏడాది అంతా సాగుచేసే పంట ఇది. అయితే నాణ్యమైన విత్తన కొరత మాత్రం ఇంకా ఎదురవుతున్నది. రైతులు తమ స్థాయిలో కాకరలో విత్తనోత్పత్తి చేపట్టి నాణ్యమైన విత్తనాలను తామే ఉత్పత్తి చేసుకుని వాడుకోవచ్చు.

రాష్ట్రంలో ఏడాదంతా ఈ పంటలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే గాలిలో తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో యాసంగి లేదా ఎండాకాలంలో విత్తనోత్పత్తి చేపట్టాలి. ఎత్తైన గిరిజన ప్రాంతాలలో అయితే కచ్చితంగా ఎండాకాలంలోనే విత్తనం ఉత్పత్తి చేయాలి. సెప్టెంబర్ చివరి వారం లేదా అక్టోబర్ మొదటివారంలో విత్తుకోవచ్చు.

నేలలు: విత్తనోత్పత్తికి ఎంచుకునే నేలలో అంతకు ముందటి పంట నుంచి సొంతంగా విత్తుకున్న మొక్కలు ఉండరాదు. మురుగునీళ్లు పోయే సౌలతి నేలలు, సారవంతమైన నేలలు అనుకూలం.

విత్తన ఎంపిక: కచ్చితంగా నమ్మకమైన సంస్థ లేదా నాణ్యమైన వనరుల నుంచి మాత్రమే విత్తనం సేకరించాలి. నాణ్యంగా, ఆరోగ్యంగా ఉండి చీడపీడలు లేని విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. పగిలిన, రంగు కోల్పోయిన విత్తనాలు వాడరాదు.

విత్తన మోతాదు: ఎకరాకు రెండు కిలోల చొప్పున వాడాలి. నాటడానికి ముందు విత్తనాలను ముప్పై నిమిషాల పాటు వెచ్చని నీటిలో ఉంచాలి. దీంతో విత్తన చివరి గట్టి పొర మెత్తబడుతుంది. తడి ఉన్న గోనె సంచి లేదా తేమతో కూడిన గుడ్డ సంచులలో 3-4 రోజులు పెడితే కూడా గింజలు మెత్తబడి, మొలకలు త్వరగా వస్తాయి. కిలో విత్తనానికి 4 గ్రాముల చొప్పున ట్రైకోడెర్మా విరిడి జీవ శిలీంద్ర నాశనితో విత్తనశుద్ధి చేస్తే శిలీంద్రాల తాకిడి తగ్గుతుంది.

ప్రధాన పొలంలో నాటడం: ప్రధాన పొలాన్ని 3-4సార్లు మెత్తగా

దున్నాలి. రెండు మీటర్ల మధ్య దూరంతో 60 సెం.మీ. వ్యాసార్థంతో కాలువలు చేయాలి. కాలువల సాలులో ఒక మీటరు లోతులో 30 సెం.మీ. వ్యాసార్థంతో గుంతలు తయారుచేయాలి. గుంతలలో రెండు నుంచి మూడు సెం.మీ. లోతులో నిలువుగా విత్తనాలు విత్తుకోవాలి. మొదట ఒక గుంతకు రెండు విత్తనాలు నాటి, మొలకొచ్చిన తర్వాత పలుచన చేయాలి. విత్తే ముందు గుంతలను తడుపాలి.

పోషక యాజమాన్యం: ఎకరానికి 10 టన్నులు బాగా చిలికిన పశువుల ఎరువు చివరి దుక్కిలో వేయాలి. ఒక కిలో పశువుల ఎరువును 100 గ్రాముల వేప చెక్కతో కలిపి ప్రతి గుంతలో ప్రాథమికంగా వేయాలి. ఒక నెల తర్వాత గుంతకు 500 గ్రాముల చొప్పున వానపాముల ఎరువు పైపాటుగా మొక్క మొదలులో వేయాలి. సకాలంలో కలుపును తీసివేయాలి. నాటిన తర్వాత వారం వ్యవధులలో నీటి తడులివ్వాలి. పూత సమయం, కాయలు ఏర్పడే దశలలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

కల్తీల ఏరివేత: కాకర స్వతహాగా స్వపరాగం చెందే మొక్క. అయితే కొంతమేరకు పరపరాగ సంపర్కం కూడా జరుగుతుంది. శాఖీయ దశ, పూత దశ, కాయలు ఏర్పడే దశలో లక్షణాల ఆధారంగా కల్తీలు గుర్తించి ఏరివేయాలి. 0.2 శాతం కంటే కల్తీలు మించకుండా చూడాలి. మూడు దఫాలుగా క్షేత్ర తనిఖీలు చేపట్టాలి.

వేర్పాటు దూరం: ఫౌండేషన్ విత్తనానికైతే 1000 మీటర్లు, ధృవీకరణ విత్తనానికైతే 500 మీటర్లు వేర్పాటు దూరం ఉండేలా చూడాలి.

కాయల కోత: కాయలు ఆకుపచ్చ రంగు నుంచి పసుపు పచ్చ లేదా నారింజ రంగులోకి మారిన దశలో మొక్క నుంచి సేకరించాలి. చేతులతో మొక్కల నుంచి పండ్లను ఏరి, పగిలేదాకా నీడలో ఆరబెట్టాలి. అవి పగిలిన తర్వాత ప్రకాశవంతమైన విత్తనాలు కన్పిస్తాయి. లేదా తోడుకలు తీసిన తర్వాత రక్తపు రంగుతో కూడిన గింజలను ఒకరోజు పాటు నీళ్లలో మురగబెట్టాలి. ఆ తర్వాత బాగా కడిగి, ఎండబెట్టి నిల్వ చేయాలి. విత్తన తేమ ఏడు శాతం మించకుండా ఉండాలి. చల్లని, పొడి పరిస్థితులలో నిల్వ చేస్తే ఐదేండ్ల వరకు మొలక శాతం తగ్గకుండా కాకర గింజలు నాణ్యంగా ఉంటాయి.

నాణ్యతా ప్రమాణాలు

కనీస మొలక శాతం: 60
జన్యు స్వచ్ఛత కనిష్ఠంగా : 98%
విత్తన తేమ శాతం గరిష్ఠంగా : 7%
జడపదార్థం గరిష్ఠంగా: 2 శాతం

ఒకసారి ఉత్పత్తి చేసిన విత్తనాన్ని రైతులు పైన చెప్పిన నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉంటే నాలుగు, ఐదేండ్ల వరకు సాగుకు వాడుకోవచ్చు. మేలైన దిగుబడులు పొందవచ్చు. అయితే సూటిరకాలలో మాత్రమే విత్తనోత్పత్తి చేసుకోవాలి. హైబ్రీడ్ల విత్తనోత్పత్తి రైతు స్థాయిలో చేపట్టరాదు.

డాక్టర్ పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322

మాఘీ జొన్నకు ఇదే అదును

రాష్ట్రంలో మాఘీ జొన్న ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలో కొద్దిపాటి విస్తీర్ణంలో సాగు చేస్తారు. మాఘీలో కిన్నెర (ఎం.జె-276) రకం లేదా నిపుణులను సూచించిన ఇతర రకాలను ఎంచుకోవాలి. సెప్టెంబర్ 2వ పక్షంలోపు విత్తనం నాటడం పూర్తిచేయాలి. ఆలస్యంగా విత్తితే మొవ్వ ఈగ ఉధృతి ఎక్కువ అవుతుంది. దీనివల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. సాధ్యమైనంత వరకు ఈ మొవ్వ ఈగ ఉధృతిని తట్టుకునే రకాలనే ఎంపిక చేసుకోవడం మేలు.

విత్తన మోతాదు: ఎకరానికి 3-4 కిలోలు అవసరం.

విత్తనశుద్ధి: మాఘీ జొన్నలో మొవ్వ ఈగ ప్రధానంగా నష్టపరుస్తుంది. దీని బారి నుంచి పంటను రక్షించుకోవడానికి ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ 70 శాతం డబ్ల్యుఎస్ లేదా 12 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 48 ఎఫ్ఎస్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే దూరం: ఎద్దుల సహాయంతో నడిచే గొర్రుతో వరుసల మధ్య 45 సెం.మీ, వరుసల్లో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: ముందుగా ఎకరానికి 3-4 టన్నులు పశువుల ఎరువు వేసి ఆఖరిదుక్కిలో కలియదున్నాలి. వానకాలంలో వర్షాధారంగా సాగుచేసినప్పుడు ఎకరానికి 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులు వేసుకోవాలి.

నీటి యాజమాన్యం: సుమారు 450-600 మి.మీ. నీరు అవసరం ఉంటుంది. సాధారణంగా జొన్నను వర్షాధారంగా సాగు చేస్తారు. అయితే వర్షాభావ పరిస్థితులు ఉంటే పూత దశలో లేదా గింజ కట్టే దశలో ఒక తడి ఇస్తే మంచి దిగుబడులు తీసుకోవచ్చు.

ఆముదంలో అంతర కృషి

రాష్ట్రంలో వర్షాధారంగా సాగుచేసే నూనెగింజల పంటల్లో ఆముదం ముఖ్యమైనది. ప్రస్తుతం ఈ పంటలో చేపట్టాల్సిన పనులు, సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయ నిపుణులు అందించిన వివరాలు.

కలుపు నివారణ, అంతరకృషి: పంట విత్తిన తర్వాత 40-60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తిన 15-20 రోజులకు క్విజలోఫాప్-పి-ఇథైల్ కలుపు మందును ఎకరాకు 400 మి.లీ. చొప్పున పిచికారీ చేసి గడ్డిజాతి కలుపును నివారించవచ్చు. తర్వాత దశల్లో వచ్చే కలుపును గుంటకతో వరుసల మధ్య అంతర కృషి చేసి నివారించవచ్చు.

నీటియాజమాన్యం: సాధారణంగా ఆముదాన్ని వర్షాధారంగా పండిస్తారు. అయితే బెట్ట పరిస్థితుల్లో నీటి వసతి ఉంటే 1-2 తడులు ఇస్తే 15-20 శాతం దిగుబడి పెరుగుతుంది.

సస్యరక్షణ

దాసరి పురుగు: ఈ పురుగు ఆగస్టు నుంచి అక్టోబర్ మాసం వరకు పంటను ఆశించి నష్టాన్ని కలిగిస్తుంది. ఈ పురుగు మొదట ఆకులపై ఆశించి రంధ్రాలు చేసి తింటాయి. పురుగు ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులను అంతా తిని కాడలను మాత్రమే మిగులుస్తుంది.

నివారణ: తొలిదశలో పరాన్నజీవులకు హానిచేయని వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పొలంలో ఎకరానికి 8-10 పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతిని బట్టి ఎసిఫేట్ 75 ఎస్పి 1.5 గ్రా. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. మరియు డైక్లోరోవాస్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పాగాకు లద్దె పురుగు: ఈ పురుగు సెప్టెంబర్ నెలలో ఆశించడం మొదలై అక్టోబర్ నెలలో తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. ఈ పురుగు తొలిదశలో గుంపులుగా ఆకుల కింది భాగంలో చేరి పత్రహరితాన్ని గీకి తింటాయి. తర్వాత దశలో ఆకులపై రంధ్రాలు చేసి జల్లెడాకులుగా మారుస్తాయి.

నివారణ: ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి.
పురుగు తొలిదశలో క్లోరోపైరిఫాస్ 2 మి.లీ. ఉధృతి ఎక్కువైనప్పుడు నొవల్యూరాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
బాగా ఎదిగిన లద్దె పురుగుల నివారణకు విషపు ఎరను (5 కిలోల వరి తవుడు+500 గ్రా. బెల్లం+500 మి.లీ. క్లోరోపైరిఫాస్) వినియోగించాలి.

ఇంటి చెత్తనుంచి పంటల సంపద

మనం ఒక పదార్థాన్ని నాశనం చేయలేం.
సృష్టించడం అంతకన్నా చేయలేం.
శక్తి ఒక రూపంలోంచి
మరొక రూపంలోకి మారుతుందంతే.
సాంబశివుడు సరిగ్గా అక్కడే ఆగాడు.
ఇంటిలో చెత్తను బయటపడేయకుండా
మనకు ఉపయోగపడే సంపదలా
మార్చగలిగితే అని ఆలోచించారు.
ఇంటినుంచి ఒక గ్రాము చెత్త కూడా బయటకు వెళ్లకుండా
వాటిని ఎరువుగా మార్చి ఇంటిపై
ఆకుపచ్చ బంగారాన్ని పండిస్తున్నారు
చెత్త నుంచి పంటల సంపదను సృష్టించి
ఆహారానికి, ఆరోగ్యానికి, ఆనందానికి
కొత్త నిర్వచనంలా నిలబడుతున్నారు.

ఇంటి పంట

వేములవాడకు చెందిన ఉపాధ్యాయుల సాంబశివుడు, హైదరాబాద్ రేల్ టెల్ కార్పొరేషన్ సంస్థలో హెచ్ఆర్ సీనియర్ మేనేజర్‌గా రిటైర్డయి, ప్రస్తుతం అదే శాఖలో తిరిగి కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. గత నలభై ఏండ్లుగా హైదరాబాద్‌లోనే నివసిస్తూ, సోషల్ ఫారెస్ట్రీ ఉద్యమం, సమాంతరంగా తన ఇంటిలో మిద్దె తోటను పెంచు తూ, నగరంలో పర్యావరణ ఆరోగ్యానికి ఊపిరి లూదుతున్నారు. పదేండ్ల కిందట హైదరాబాద్‌లోని కాప్రా మండలం యల్లారెడ్డిగూడలోని హైటెక్‌నగర్ కాలనీలో సొంత ఇల్లు కట్టుకుని సుమారు పదహారు వందల యాభై చదరపు అడుగుల మిద్దె స్థలంలో టమాటా, వంకాయ, మిరప, కీర, సొర, బీర, చిక్కుడు, క్యాబేజీ, బెండ, ముల్లంగి వంటి సుమారు 30 రకాల కూరగాయల్ని పండిస్తున్నారు. కూరగాయలు, పూలతో మొదలైన ప్రయాణం గత రెండేండ్ల నుంచి ఔషధ మొక్కలపై మళ్లింది. మిద్దె తోటలో ఇపుడు పునర్నవ, నాగదాళి, తిప్పతీగ, అతిబల, కలబంద, చెన్నంగి వంటి ఔషధ మొక్కలు కొలువుదీరాయి. వీటిలో కొన్నింటిని కాఫీ, టీకి బదులు కషాయాల తయారీ కోసం కూడా వినియోగిస్తున్నారు.

మరోవైపు వంటింటి నుంచి వచ్చే వ్యర్థాలు, రాలిన ఆకులతో తయారుచేసుకున్న వర్మీ కంపోస్టును, ద్రవరూప ఎరువు వర్మీవాష్‌ను వాడుతూ పోషకాల లోపం, చీడ పీడల బెడద లేకుండా ఇంటి పంటలను సాగు చేస్తున్నారు. ప్రతి మూడు నెలలకు ఓసారి పంటను మార్చుతూ, కాలాలకు అనుగుణమైన కూరగాయల మొక్కలు పెంచుతున్నారు. పర్యావరణ స్పృహతో కిచెన్ వేస్టును ఎలా సద్వినియోగం చేసి కంపోస్ట్ ఎరువుగా మార్చుకోవాలో, ఇంటి పంటలు ఎలా పడించుకోవాలో సోషల్ మీడియాలో, టీవీ ఛానళ్లలో పంచుకుంటుంటారు.

విత్తన సంరక్షణ

మొదటి కాసిన కాయ చెట్టు మీద ఎండిన తరువాత తీసి, విత్తనం సేకరించాలి. ఈ విత్తనంలో ఎండోఫైట్స్, విగర్ ఎక్కువగా ఉంటుంది. దీనిని పిడకలో గాని, బూడిద పోసిన కుండలో నిలువచేయాలి. బూడిద వల్ల విత్తనాన్ని ఫంగస్, వైరస్ తెగుళ్లు ఆశించవు. దీనిమీద నిలువచేసిన రోజు తేదీ వేయాలి. దీనిని ఆరునెలల నుంచి సంవత్సరం వరకు ఉంచవచ్చు. ఆవు పిడకలలో వుంచిన విత్తనమైతే దాదాపు రెండేళ్ల వరకు ఉంటుంది. ఆ తరువాత విత్తనంలో మొలకెత్తే శక్తి తగ్గుతుంది.

నారుపోసే దశ

సాంబశివుడు నారు పోసేదశలో అనుసరిస్తున్న పద్ధతులు సమయాభావం, స్థలాభావం ఉన్న నగరవాసులకు చాలా ఉపయోగకరమైనవి. ఈ పద్ధతిలో తొంభై శాతానికి పైగా మొలకవచ్చే అవకాశం వున్నది. సాంబశివుడు తన మిద్దెతోటల్లో హైబ్రిడ్, దేశీ విత్తనాలను వాడుతుంటారు. ఐతే దేశీ విత్తనం వాడటం వల్ల వాటిలో రోగ నిరోధకశక్తిని అధికంగా కలిగివుండటం, పోషకవిలువలతో పాటు విత్తనాన్ని తిరిగి ఉపయోగించుకోవడం వీలవుతుందంటారు. బెండ, బీర, టమాటా, వంగ, సొర, బీర, కాకర, పొట్ల విత్తనాలను ప్లగ్‌ట్రేస్‌లలో నారు పోయాలి. ట్రేస్‌లో వేడినీటిలో ఉంచి తీసిన స్టెరైల్ కోకోపిట్‌ను వాడితే మంచిది. దీనివల్ల మొలక దశలో విత్తనాన్ని ఎలాంటి తెగుళ్లు ఆశించవు. పెద్ద విత్తనాలను నాటేముందు ఆవుమూత్రాన్ని డైల్యూట్ చేసి అందులో అరగంట నానబెట్టి, తరువాత ఇరువై నాలుగు గంటలపాటు నీటిలో నాన బెట్టి ట్రేలలో నాటుపెట్టాలి. ట్రేలలో విత్తనం నాటేటపుడు అర ఇంచు కంటే లోతుకు నాటకూడదు. రోజ్‌క్యాన్‌తో నీరు చిలకరించి,పైన ప్లాస్టిక్ కవర్ కప్పి సెమి షేడ్‌లో ఉంచాలి. అసలు ఒక విత్తనం మొలకెత్తడానికి నీరు, గాలి, ఉష్ణోగ్రత సరైన మోతాదులో అందాలి. ఇలా ట్రేపై ప్లాస్టిక్ కవర్ పరచడం వల్ల విత్తనానికి సరైన ఉష్ణోగ్రత అందుతుంది.

మొలక వచ్చిన తరువాత కవర్ తీసివేసి మొలకలపై కొద్దిగా నీళ్లు చిలకరించి,5-6 అంగుళాలు వచ్చేవరకు (విత్తన లక్షణాన్ని బట్టి 8-15 రోజులు) సెమి షేడ్‌లో ఉంచాలి. విత్తనం మొలకెత్తే దశలో రెండు మూడు రోజుల వరకు మనం ఎలాంటి పోషకాలు ఇవ్వన వసరం లేదు. విత్తనంలో ఉన్న పోషకాలను మొలక వాడుకుంటుంది. మొలక వచ్చిన పది రోజుల తరువాత జీవామృతం, వేస్ట్ డీకంపోజర్ వంటి ద్రవ ఎరువులను మొక్కకు అందిస్తే మొక్క చాలా ఆరోగ్యంగా ఎదుగుతుంది. తరువాత నర్సరీ బ్యాగులో కర్రతో చేసిన రంధ్రంలో ట్రేలోని మొక్కను కుదురుగా కూర్చోబెట్టాలి. దీనివల్ల మొక్క వేరు ఏమాత్రం దెబ్బతినకుండా ఉంటుంది. ఈ నర్సరీ బ్యాగుల్లో 30శాతం కోకోపిట్, 30శాతం వర్మికంపోస్ట్, 30 శాతం ఎర్రమట్టి, 10శాతం వేపపిండిని పాటింగ్‌మిక్స్‌లో వాడుతున్నారు. పూత దశలో (ప్రౌఢ దశ) మొక్కకు అనువైన కుండీలోకి మార్చుకోవాలి. మొదట కుండీల్లో కూడా మొక్కకు సరిపోయే రంధ్రం చేయాలి. తరువాత నర్సరీ బ్యాగును వెలికిలా తిప్పి కదిలించి వేర్లు దెబ్బతినకుండా తీసి కుండీలో పెట్టాలి.

పోషణ

ప్రతి 10-15 రోజులకు ఒకసారి ద్రవరూప ఎరువులను అందిస్తున్నారు. ఇందులో ప్రధానమైనవి జీవామృతం, వర్మివాష్, చోహాన్క్యో పద్ధతిలో తయారుచేసిన బలవర్ధకాలు. వీటిని మార్చి మార్చి వాడుతుంటారు. జీవామృతం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెందుతాయి. మట్టిలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములను చైతన్యవంతం చేయడం ద్వారా జీవామృతం భూసారం పెరగడానికి దోహదపడుతుంది. భూమిలోని పోషకాలను మొక్కలు నేరుగా వినియోగించుకునే రూపంలోకి మార్చి అందించడంలో వానపాములు, సూక్ష్మజీవుల పాత్ర అసాధారణమైనది. మేలు చేసే కోటాను కోట్ల సూక్ష్మజీవులకు నిలయం పశువుల పేడ, మూత్రం. పేడ, మూత్రంతోపాటు బెల్లం, పప్పుల పిండి, నీటిని కలిపినప్పుడు పేడలోని సూక్ష్మజీవ రాశి ప్రతి 20 నిమిషాలకు రెట్టింపవుతుంది. జీవామృతానికి అదనంగా పులియబెట్టిన పండ్ల రసాలు (ఫ్రూట్ ఫర్మెంటెడ్ జ్యూస్) మిద్దెతోట నిర్వహకులకు ఒక వరం లాంటి దంటారు సాంబశివుడు. దక్షిణకొరియా శాస్త్రవేత్త చోహాన్‌క్యు తయారుచేసిన ఈ ఎఫ్ఎఫ్‌జె మొక్కలకు, తోటలకు సేంద్రీయ ఎరువుగా పనిచేస్తుంది. ఈ ద్రవం నేలలోని ప్లాంట్ గ్రోత్ ప్రమోటింగ్ బ్యాక్టిరియాను పాటింగ్ మిశ్రమములో పెంచి పోషకాలను (స్థూల, సూక్ష్మ మరియు ఎంజైమ్స్) పెరుగుతున్న మొక్కలకు అందిస్తాయి. పులియబెట్టిన పండ్ల రసాన్ని తయారు చేసుకోవడానికి తీయగా ఉండే అరటిపండ్లు, పైనాపిల్స్ లేదా బొప్పాయి, మామిడి, అరటి వంటి పండ్లు ఉపయోగపడతాయి. వీటిని చిన్నభాగాలుగా కత్తిరించిన పండ్లను ఒక గాజు పాత్రలో లేదా జాడీలో వేసి, దానికి సమానమైన మొలాసిస్ లేదా బ్రౌన్ షుగర్ లేదా బెల్లం జోడించి ఈ మిశ్రమాన్ని రోజు ఉదయం, సాయంత్రం ఒక చెంచాతో బాగా కలపి దీనిపై ఒక సన్నని గుడ్డ కట్టి రబ్బరు బ్యాండ్‌తో దాన్ని భద్రపరచాలి. మిశ్రమం కలిగిన పాత్రను చల్లని, చీకటి ప్రదేశంలో ఉంచవలెను. పాత్ర దిగువన గోధుమ రంగు ద్రవం వచ్చే వరకు పులియబెట్టాలి. ఈ కిణ్వ ప్రక్రియ(పులియబెట్టుట)15 నుంచి 25 రోజుల వరకు కొనసాగుతుంది. తయారైన ద్రావణాన్ని మరో పాత్రలో స్టోర్ చేసుకుని, చిన్న మొక్కలకు 1ఎం.ఎల్,పెద్ద మొక్కలకు 5 ఎం.ఎల్ కు 15 రోజుల కొకసారి మొక్కల మొదట్లో, మొక్కలపై స్ప్రే చేసుకుంటే మొక్కలు ఆశించిన ఫలితాలు సమృద్ధిగా లభిస్తాయి. ఈ ప్రక్రియలో ఎట్టి పరిస్థితుల్లో సిట్రస్ ఫ్రూట్స్ వాడరాదు. ఈ ఎఫ్ఎఫ్‌జె లాగే మునగ ఆకుతో, అరటి బోదెతో ద్రావణాలను చేసుకొని మొక్కలకు వాడటం ద్వారా మంచి ఫలితాలను పొందవచ్చు. మొక్కలలో పూత ఎక్కువగా నిలవడానికి అరటిపండు తొక్కలను నీళ్లలో నానబెట్టి, ఆ ద్రావణాన్ని కూడా మొక్కలకు అందిస్తుంటారు. అరటిలో పొటాషియం ఎక్కువగా ఉండటం ఇందుకు కారణం.

సస్యరక్షణ

▪ మడులలో గాని, కుండీలలో గాని మొక్కలకు చీడపీడలు ఆశించినట్లైతే వాటిని కత్తిరించి నాశనం చేయాలి. ▪ పెద్ద పరిమాణంలో ఉండే శనగపచ్చ పురుగు మొదలగువాటి లార్వా దశలను చేతితో ఏరివేసి నాశనం చేయాలి. ▪ వేపగింజల నుంచి తీసిన నూనె, ఆకులు, బెరడు, పొగాకు ఆకుల నుంచి తీసిన మిశ్రమం కూడా సహజమైన పురుగు మందుగా ఉపయోగించవచ్చు. దీనికోసం తొమ్మిది వందల గ్రాముల మంచి నీటిలో వంద గ్రాముల కుంకుడుకాయల రసం తీసుకుని మూడు మి.లీల నూనెను బాగా కలిపి,ఈ మిశ్రమాన్ని ఆకుల అడుగున, పైన తడిసే విధంగా జల్లుకోవాలి. ▪ నారు మడిలో శిలీంద్రాలు ఆశించకుండా వేపపిండిని చల్లి, నారుకుళ్ళును అరికట్టవచ్చు, వైరస్ సోకిన మొక్కలను పెరికివేయాలి. ▪ కుండీలో ఎప్పుడు ఒకే రకం మొక్కలు కాకుండా రకరకాల మొక్కలు వేస్తే చీడపీడల బెడదను కొంతవరకు నివారించవచ్చు. ▪ కూరగాయలలో బూడిద, బూజు తెగులు కనిపిస్తే. వీటి నివారణకు ఒక లీటరు నీటిలో 60 మిల్లి లీటర్ పుల్లటి మజ్జిగ, ఇంగువ 1 గ్రాము జోడించి పూర్తిగా కరిగే వరకు కలియబెట్టి తెగులు లక్షణాలు కనిపించినప్పుడు పది రోజులకొకసారి రెండు సార్లు పిచికారీ చేయాలి. ▪ తెగుళ్ళు మాత్రమే కాకుండా, కూరగాయలలో పూత, పిందె రాలుటను గమనించినట్లయితే, పంచగవ్వను లీటరు నీటికి 3 మి.లీ నుంచి 5 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. ▪ రసం పీల్చే పురుగులు మొక్కలను నిర్జీవం చేయడమేగాక, వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేస్తాయి. వీటి నివారణకు పొగాకు కాషాయం, వేపగింజల కాషాయం 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ▪ నల్లుల సమస్యకు పసుపు, బూడిద కలిపి చల్లాలి. బూడిదను ఉదయం పూట ఆకులకు అంటుకునే విధంగా పల్చని గుడ్డలో కట్టుకుని జల్లుకోవాలి. అంతేకాకుండా కీటకాలు దాడి చేయకుండా ముందు జాగ్రత్తగా దశపర్ణి కషాయాన్ని ఉపయోగించాలి. ఈ కషాయాన్ని ఇంగువ, పసుపు, అల్లం, వెల్లుల్లి, మిర్చిలతో పాటుగా పదికిపైగా రకాల ఆకులు (మందార, వేప, ఆముదం, బొప్పాయి, నల్లవాయి, జిల్లెడు, నల్ల ఉమెత్త, మారెడు, సీతాఫలం, లక్ష్మణ ఫలం ఆకులు) వేసి తయారుచేస్తాం. నలభై రోజులు నానబెట్టి వడకట్టిన తరువాత చెట్లకు చల్లుకోవాలి. దీనితో కీటకాలను అరికట్టగలుగుతాం.

నీటి యాజమాన్య పద్ధతులు

▪ కుండీలో నీరు ఎక్కువైనా, తక్కువైనా ప్రమాదమే. నీరు ఎక్కువైతే వేరు కుళ్ళు ఆశించే అవకాశమున్నది. ▪ కుండీలలో/కంటైనర్లలో పెంచుకునే మొక్కలకు కనీసం 6 గంటలు సూర్యరశ్మి అవసరం. ▪ వేసవిలో రోజుకు రెండు పూటలా నీరివ్వాలి. ▪ నారుమడిలో విత్తనం మొలకెత్తువరకు రోజు నీరు చల్లాలి .నారుమడిని గడ్డి లేదా ఎండిన ఆకులతో కప్పుటం వల్ల చలికాలం, వేసవిలో త్వరగా మొలకెత్తుతాయి. ▪ విత్తనాలు మొలకెత్తిన వెంటనే గడ్డి లేదా ఎండిన ఆకులను తీసివేయాలి. ▪ చల్లగా ఉండే సమయంలో నీరు అందించాలి. మధ్యాహ్నం సమయంలో నీరివ్వకూడదు ▪ మల్చింగ్ లేదా నేలను తవ్వడం ద్వారా భూమిలో నీటిని నిల్వ ఉంచుకొనే శక్తి పెరుగుతుంది. ▪ మొక్క చుట్టు పాలిథిన్ షీట్లతో గాని, వరిగడ్డి లేదా ఎండు ఆకులతో గాని కప్పి ఉంచడం వల్ల నీరు ఆవిరైపోకుండా ఉంటుంది. ▪ ఎరువులను వేసిన వెంటనే మొక్కలకు ఎక్కువగా నీరు అందించాలి. ▪ ఇంటిలో పెరిగే మొక్కలకు గాని, బయట పెరిగే మొక్కలకు గాని, నారుమడిలో పెంచే మొక్కలను రోజ్ క్యాన్‌లో గాని, షవర్ బిగించిన పైపుతో గాని, నీరందించవచ్చు. ▪ కాక్టస్ వంటి మొక్కలకు రోజూ నీరు ఎక్కువగా ఇవ్వకూడదు. ఇటువంటి మొక్కలకు 6 లేదా 8 రోజులకు ఒక్కసారి నీరివ్వాలి. ▪ మొక్కల మొదళ్లలో కంపోస్ట్, వర్మీకంపోస్టు వంటి ఎరువులు వేస్తే నీటినిల్వ ఉంచుకునే శక్తి పెరుగుతుంది. ▪ మిద్దెతోటల్లో డ్రిప్ పద్ధతిలో నీటి వాడకాన్ని 30శాతం వరకు తగ్గించవచ్చు. ద్రవరూప ఎరువులను క్రమపద్ధతిలో అందించవచ్చు.

వంటింటి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు

ఎరువుల కోసం మనం ఎక్కడిదాకో వెళ్లక్కరలేదు. జేబులోంచి రూపాయి కూడా ఖర్చుపెట్టనక్కరలేదు. వంటింట్లో చెత్త బుట్టలో చేరుతున్న వ్యర్థ పదార్థాలతోనే మనం సులభంగా ఎరువును తయారుచేసుకోవచ్చు. కూరగాయ తొక్కలు, ఆకుకూరల వ్యర్థాలు, పళ్ళ తొక్కలు, కుళ్లే స్వభావం ఉన్న ఏదైనా సరే ఎరువు తయారీకి ఉపయోగించవచ్చు. రోజూ వంటింటి వ్యర్థాలను కంపోస్టర్‌లో వేస్తే 90 రోజులలో చక్కటి ఎరోబిక్ కంపోస్ట్ తయారవుతుంది. దానికితోడు ఈ కంపోస్టింగ్ ద్వారా వెలువడిన ద్రావణం 20శాతానికి 80శాత నీరు కలపాలి. మన ఇంటి తోటలోని మొక్కలకు వాడుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. దీనివలన మన ఇంటపంటకు ఇంటిపట్టునే చక్కటి సేంద్రియ ఎరువు తయారవ్వడమే కాదు, మున్సిపాలికి పెద్ద భారంగా మారిన చెత్త సమస్యకు మీ అంతట మీరే చక్కటి పరిష్కారం చూపుతున్నారన్నమాట. అందరూ వంటింటి వ్యర్థాలను చెత్తబుట్టలో పడెయ్యకపోతే,పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది.

చెత్తను ఎరువుగా మార్చే కంపోస్ట్ బిన్

మల్చింగ్

మొక్కల చుట్టూ ఉండే వేర్లను ఏవేని పదార్థాలతో కప్పి ఉంచడమే మల్చింగ్. ఈ పద్ధతికి ఎండిన ఆకులు, రంపపు పొట్టు, చెరకు పిప్పి, చిన్న చిన్న గులక రాళ్ల వంటి వాటిని వాడవచ్చు.
1. మల్చింగ్ వల్ల నీటి ఆదాతో పాటు కుండీలో ఉన్న తేమను ఆవిరికాకుండా నివారిస్తుంది. 2.సూర్యరశ్మిని కలుపు మొక్కలకు లభించకుండా చేయడం వలన కలుపురాదు. 3. మొక్క చుట్టూ ఉండే నేల ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. 4. మట్టిలోని తెగుళ్ళు మరియు క్రిమికీటకాల నివారణ జరుగుతుంది.

పర్యావరణం కోసం తనవంతుగా చేస్తున్న ఈ ప్రయత్నం, ప్రయాణం తన కుటుంబసభ్యుల తోడ్పాటు వల్లే సాధ్యమైందని సాంబశివుడు ఆనందంతో,ఆత్మవిశ్వాసంతో చెప్పుకొచ్చారు.ఇతర వివరాలకు సాంబశివుడిని సంప్రదించవలసిన నెంబర్.. 9701346949.

కె.క్రాంతికుమార్‌రెడ్డి, 9603214455
నేచర్స్‌వాయిస్

epaper.ntnews.com

జాబిల్లికి మరింత చేరువగా చంద్రయాన్-2

- విజయవంతంగా మూడోసారి కక్ష్య కుదింపు

బెంగళూరు, ఆగస్టు 28: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-2 వ్యోమనౌక జాబిల్లికి మరింత చేరువైంది. మరో 10 రోజుల్లో చంద్రుడి చెంతకు చేరనున్నది. బుధవారం ఉదయం 09.04 గంటలకు మూడోసారి కక్ష్య కుదింపు ప్రక్రియను విజయవంతంగా చేపట్టినట్లు ఇస్రో వెల్లడించింది. 1190 సెకన్లపాటు ప్రొపల్షన్ సిస్టమ్‌ను మండించి 179 కి.మీ.x 1412 కి.మీ. కక్ష్యలోకి చంద్రయాన్-2ను విజయవంతంగా చేర్చినట్లు పేర్కొంది. తదుపరి కక్ష్య కుదింపు ప్రక్రియను ఈ నెల 30న సాయంత్రం 6-7 గంటల మధ్య చేపట్టనున్నట్లు తెలిపింది. అనంతరం సెప్టెంబర్ 1న మరోసారి కక్ష్యను కుదిస్తారు. సెప్టెంబర్ 2న ఆర్బిటార్ నుంచి ల్యాండర్ విడిపోయే ప్రక్రియను చేపడుతారు. సెప్టెంబర్ 7న వేకువజామున 1.55 గంటలకు ల్యాండర్ విక్రమ్.. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో కాలుమోపనున్నది.

'ఐక్యతా మూర్తి'కి టైమ్స్ గుర్తింపుపై మోదీ హర్షం

- తొలిసారి సర్దార్ సరోవర్ డ్యామ్‌లో 134 మీటర్ల ఎత్తుకు చేరిన నీరు
- అందరూ సందర్శించాలని కోరిన ప్రధాని

ఢిల్లీ: టైమ్స్ మ్యాగజైన్ ప్రచురించిన రెండో వార్షిక జాబితాలో ప్రపంచంలోని వంద గొప్ప ప్రదేశాల్లో గుజరాత్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 'ఐక్యతా మూర్తి' (స్టాచ్యూ ఆఫ్ యునిటీ)కి చోటు దక్కడంపై ప్రధాని నరేంద్రమోదీ సంతోషం వ్యక్తంచేశారు. 'అద్భుతమైన వార్త.. టైమ్స్ మ్యాగజైన్ వెలువరించిన ప్రపంచంలోని 100 ప్రముఖ ప్రదేశాలు-2019 జాబితాలో స్టాచ్యూ ఆఫ్ యునిటీకి చోటు దక్కిం ది. అంతేకాదు, ఇటీవల 34 వేలమంది ఒక్కరోజులోనే ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రముఖ్య పర్యాటక ప్రదేశంగా మారుతున్నందుకు సంతోషంగా ఉన్నది' అని మోదీ ట్వీట్ చేశారు. 182 మీటర్ల ఎత్తున్న ఈ విగ్రహం ప్రపంచంలోనే ఎత్తైనది కాగా, అమెరికాలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీకన్నా రెట్టింపు ఎత్తు ఉన్నది. సర్దార్ సరోవర్ డ్యామ్‌లో 134 మీటర్ల ఎత్తు వరకు నీరు చేరినందుకు తనకెంతో సంతోషంగా ఉన్నదని మోదీ పేర్కొన్నారు. అద్భుతమైన సర్దార్ సరోవర్ డ్యామ్ చిత్రాలను జతచేస్తూ.. డ్యామ్‌ను అందరూ సందర్శించాలని, ఐక్యతా మూర్తిని తిలకించాలని కోరారు. 2017లో ఈ డ్యామ్ ఎత్తును 138 మీటర్లకు పెంచిన తర్వాత తొలిసారిగా బుధవారం 134 మీటర్ల వరకు నీరు చేరిందని అధికారులు తెలిపారు. సర్దార్ సరోవర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 138 మీటర్లకు చేరుతుందని గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపాని గతవారమే చెప్పడం విశేషం.

సిద్ధమైన ఖైరతాబాద్ గణేశుడు

దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపుపొందిన ఖైరతాబాద్ గణేశుడు పూజలందుకోవడానికి సిద్ధమవుతున్నాడు. 61 ఫీట్ల ఎత్తులో ద్వాదశ ఆదిత్య మహాగణపతిగా రూపుదిద్దుకున్న వినాయకుడికి బుధవారం దిష్టితీశారు. ప్రధాన శిల్పి రాజేంద్రన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం వినాయకచవితి పర్వదినం నేపథ్యంలో విగ్రహానికి తుదిమెరుగులుదిద్దారు.

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఉద్యమంలా హరితహారం

- భూపాలపల్లి-చెల్పూర్ హైవేపై రెండువేల మొక్కలు
- కలెక్టర్ చొరవతో లక్ష్యందిశగా ఐదోవిడుత కార్యక్రమం
- గ్రామాల్లో ఉధృతంగా కొనసాగుతున్న హరితహారం
- సమృద్ధివర్షాలతో ఏపుగా పెరుగుతున్న మొక్కలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి-చెల్పూర్ నేషనల్ హైవేపై డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలు

భూపాలపల్లి, నమస్తే తెలంగాణ (జయశంకర్ భూపాలపల్లి): పర్యావరణాన్ని పరిరక్షించి తద్వారా భావితరాల భవిష్యత్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న హరితహార కార్యక్రమం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉద్యమంలా కొనసాగుతున్నది. ఈ ఏడాది జిల్లాలో సమృద్ధిగా వర్షాలు పడటంతో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు హరితహారం కార్యక్రమంపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. పట్టణాలు, పల్లెలు ఏకమై ఈ మహత్తర హరిత ఉద్యమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాయి. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు ఉత్సాహంగా హరితహారం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్నారు. కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేసి హరితహారం లక్ష్యాన్ని చేరుకొనేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఐదోవిడుత హరితహారంలో కోటి 5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రభుత్వ అధికారులను మొక్కలు నాటడంతోపాటు ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించే విధంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తగు చర్యలు తీసుకున్నారు.

సమన్వయంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వశాఖలు

హరితహారంలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రభుత్వశాఖలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ఈ నెల 26 వరకు జిల్లాలో 48,11,078 మొక్కలను ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో నాటడంతోపాటు ప్రజలకు పంపిణీ చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 4,69,647 మొక్కలు, డీఆర్‌డీఏ 38,80,520, సింగరేణి లక్షా 96వేలు, పోలీసుశాఖ లక్షా 20 వేలు, ఎక్సైజ్‌శాఖ 74,741, విద్యాశాఖ 40 వేలు, వ్యవసాయశాఖ 16 వేలు, మున్సిపల్‌శాక 14,170 మొక్కలను నాటడంతో పాటు ప్రజలకు పంపిణీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ ఇప్పటివరకు ప్రగతినివేదికను ఇవ్వలేదు. జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవచూపి భూపాలపల్లి నుంచి చెల్పూర్ వరకు సుమారు పది కిలోమీటర్ల దూరం వరకు జాతీయ రహదారిలోని డివైడర్లలో 2 వేల మొక్కలను నాటించి సంరక్షణ బాధ్యతలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చూసే విధంగా చర్యలు చేపట్టారు. గ్రామాల్లోనూ హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించేలా సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలను సైతం నిర్వహించి హరితహారం కొనసాగింపును ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఐదో విడత హరితహార లక్ష్యాన్ని త్వరలోనే అధిగమించడానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాలు, రైతులు, ప్రజలు, మహిళలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేస్తున్నారు. ప్రధానంగా పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నారు. రైతులకు శ్రీగంధం, టేకు మొక్కలను పంపిణీ చేశారు. పొలంగట్లపై రైతులు ఈ మొక్కలను నాటుతున్నారు. శ్రీగంధం, టేకు మొక్కలు రైతులకు లాభసాటిగా ఉండి ఆర్థికప్రయోజనం చేకూర్చనున్నాయి. ఇలా పర్యావరణ పరిరక్షణకై ఐదోవిడత హరితహార కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అల్లనేరెడు, జామ, నిమ్మ, దానిమ్మ, మామిడి, ఖర్జూర తదితర పండ్ల మొక్కలతో పాటు వేప, ఉసిరి, కానుగ, రావి, టేకు, శ్రీ గంధం తదితర మొక్కలను విరివిగా నాటడంతో పాటు ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ప్రధానంగా రహదారులు, గ్రామాల్లో నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేసి సంరక్షణ బాధ్యతలను పకడ్బందీగా చేపట్టారు.

అటవీ, పర్యావరణంపై నేడు ఢిల్లీలో జాతీయ సమావేశం

- హాజరుకానున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని పర్యావరణ్ భవన్‌లో ప్రత్యేక సమావేశం జరుగనున్నది. కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి అటవీ, దేవాదాయశాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారి, తెలంగాణ పీసీసీఎఫ్ ఆర్ శోభ పాల్గొననున్నారు. అడవుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ భూముల్లో చెట్ల పెంపకం, ఆగ్రోఫారెస్ట్రీ, వెదురు పెంపకం, కంపా నిధుల వినియోగం.. తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ సందర్భంగా కంపెన్సెటరీ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కంపా) నిధుల విడుదలకు సంబంధించి కేంద్రానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివేదిక అందజేయనున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ ఏడాది రూ.500 కోట్ల కంపా నిధులు విడుదల చేయడానికి కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ సమ్మతించింది. వాస్తవానికి దేశంలో ఎక్కడా లేని విధంగా కంపా నిధులను సక్రమంగా సకాలంలో వినియోగిస్తున్న దృష్ట్యా అదనపు నిధులు ఇవ్వాలని తన నివేదికలో కోరనున్నారు. నిధుల విడుదల ప్రొసీడింగ్స్ విడుదల కావాల్సి ఉన్నది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రత్యామ్నాయ అడవుల సృష్టికి తమ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తున్నదని, ఫలితాలు వంద శాతంగా ఉన్నాయన్న వివరాలతో నివేదికను రూపొందించారు.

చిదంబరంపై ఆధారాలున్నాయి

- ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఈడీ వాదనలు
- నేటివరకు కేంద్ర మాజీ మంత్రిని అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో మనీల్యాండరింగ్ ఎలా జరిగిందో నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ కేసుపై బుధవారం జస్టిస్ భానుమతి, జస్టిస్ బోపన్నతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ కేంద్ర మాజీ మంత్రి చిదంబరం 'బాధితుడిని' అనే కార్డును ప్రయోగిస్తున్నారని, మనీల్యాండరింగ్ కేసుకు సంబంధించి ఈడీ అరెస్టు నుంచి తప్పించుకోవడానికి ఇలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. 'చిదంబరం చెబుతున్నట్లుగా ఇది ఆయనను వెంటాడి వేధించడం కాదు. మనీల్యాండరింగ్‌కు సంబంధించి ఇది చాలా తీవ్రమైన కేసు అని చెప్పడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయి. మనీల్యాండరింగ్ ఎలా జరిగిందన్న విషయాన్ని నిరూపించగలం. ఇప్పటికీ కొనసాగుతున్న మనీల్యాండరింగ్ నిరూపణ కోసం ఆధారాలు సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాం' అని తుషార్ మెహతా తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోవద్దని సుప్రీంకోర్టును కోరారు. 'మనీల్యాండరింగ్ కేసులో చిదంబరాన్ని ఈడీ అరెస్టు చేయకుండా అడ్డుకోలేము. ఆయనను అరెస్టు చేయడమంటే అవమానించడం కాదు' అని పేర్కొన్నారు. చిదంబరానికి ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు. వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. ఈ కేసులో చిదంబరంను గురువారం వరకు ఈడీ అరెస్టు చేయకుండా ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో గురువారం కూడా వాదనలు జరుగనున్నాయి.

చిదంబరానికి బెయిల్ నిరాకరించిన.. జడ్జికి ఉన్నత పదవి!

- పీఎంఎల్‌ఏ ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ సునీల్‌గౌర్ నియామకం

ఢిల్లీ: బెయిల్ నిరాకరించి మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం అరెస్టుకు మార్గం సుగమం చేసిన ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సునీల్‌గౌర్ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) అపిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బుధవారం నియమితులయ్యారు. గౌర్ కొత్త పదవీబాధ్యతలను సెప్టెంబర్ 23న చేపట్టబోతున్నారు. చిదంబరానికి బెయిల్ నిరాకరించిన రెండురోజుల అనంతరం ఈ నెల 23న గౌర్ హైకోర్టు జడ్జిగా రిటైర్ అయ్యారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో చిదంబరం ప్రధాన నిందితుడని, ఆయనకు బెయిల్ ఇస్తే సమాజానికి తప్పుడు సంకేతం వెళ్తుందని గౌర్ వ్యాఖ్యానించారు. గతంలోనూ ఆయన కాంగ్రెస్ ముఖ్య నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను నేషనల్ హెరాల్డ్ కేసులో విచారించేందుకు అనుమతిస్తూ అప్పటివరకు ఉన్న అడ్డంకులను తొలగించారు. గౌర్ తన పదవీకాలంలో పలువురు ప్రముఖుల కేసులను సైతం విచారించారు. అగస్టావెస్ట్‌లాండ్ చాపర్ స్కామ్‌లో మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్‌పురికి ముందస్తు బెయిల్ నిరాకరించారు. గత ఏడాది కాంగ్రెస్ మీడియా అయిన నేషనల్ హెరాల్డ్ పబ్లిషర్స్ అసోసియేటెట్ జర్నల్స్ లిమిటెడ్‌ను ఢిల్లీలోని ఐటీవో కార్యాలయం ఖాళీచేయాలని తీర్పు ఇచ్చింది కూడా సునీల్ గౌరే. అయితే ఈ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించినా, అనంతరం సుప్రీంకోర్టు గత ఏప్రిల్‌లో అమలును నిలుపుదల చేసింది. ఇది సుప్రీంకోర్టులో పెండింగ్‌లోనే ఉన్నది. వివాదాస్పద మాంసం ఎగుమతి దారు మొయిన్ ఖురేషీకి వ్యతిరేకంగా మనీల్యాండరింగ్ తదితర అవినీతి వ్యతిరేక కేసులను సునీల్‌గౌర్ విచారించారు. ఈయన 1984లో పంజాబ్ హర్యానా హైకోర్టులో కెరీర్‌ను ప్రారంభించారు. 1995లో ఢిల్లీ ఉన్నత న్యాయ సేవలో చేరారు. ఏప్రిల్ 2008లో హైకోర్టు జడ్జిగా అనంతరం ఏప్రిల్ 2011లో పూర్తిస్థాయి జడ్జిగా నియమితులయ్యారు.

మెరుగైన బోధనపై దృష్టి

- కొనసాగుతున్న హాజరు మాసోత్సవం
- సెప్టెంబర్‌లో నాణ్యతపై కార్యక్రమాలు
- పదోతరగతి విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు
- అధికారులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాల విద్యాశాఖలో నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో చేపట్టిన హాజరు మాసోత్సవంతో మంచి ఫలితం కనిపిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, ప్రాధాన్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు కూడా ముందుకువస్తున్నారని, ఇది శుభపరిణామంగా భావిస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ప్రతిరోజూ తరగతులకు వస్తే సహజంగానే విద్యాభ్యాసం బాగుంటుందని, ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో హాజరు పెరిగిందని అన్నారు.

సమగ్ర ప్రణాళికతో నాణ్యత మాసోత్సవాలు

పాఠశాల విద్యలో నాణ్యతకు విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆదేశాలతో ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సెప్టెంబర్‌లో 'నాణ్యత మాసోత్సవం' నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ కార్యదర్శి తెలిపారు. అధికారులకు వ్యక్తిత్వ వికాస తరగతులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ఏయే కార్యక్రమాలు నిర్వహించాలనే అంశాలతో సమగ్ర ప్రణాళికలను, మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులే స్వయంగా ఎంతవరకు నేర్చుకున్నామో తెలుసుకోవడానికి స్వీయ పరీక్ష నిర్వహించుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోనున్నారు.

పదో తరగతి విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు

అన్ని రకాల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు వారి భవిష్యత్తు ఏమిటి? అని తెలుసుకునేందుకు ఓ ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ సంస్థతో కలిసి సైకోమెట్రిక్ పరీక్షలను నిర్వహించబోతున్నారు. తొలుత రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలోని పదో తరగతి విద్యార్థులకు సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. విజయవంతమైతే రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే ఆలోచన చేస్తున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి, నాణ్యమైన విద్య కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు.

రాహుల్‌కు ముద్దుపెట్టిన అభిమాని

- కేరళలోని వయనాడ్‌లో ఘటన

తిరువనంతపురం, ఆగస్టు 28: తన సొంత నియోజకవర్గంలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి వింత అనుభవం ఎదురైంది. బుధవారం ఓ అభిమాని రాహుల్ బుగ్గపై ముద్దుపెట్టాడు. కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి రాహుల్ లోక్‌సభకు ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇటీవలి భారీ వర్షాల కారణంగా కేరళలోని అనేక ప్రాంతాల్లో ముంపునకు గురయ్యాయి. వరద నష్టాన్ని అంచనావేసేందుకు రాహుల్ బుధవారం వయనాడ్‌లో పర్యటించారు. ఓ అభిమాని వాహనం దగ్గరకు వచ్చి తొలుత రాహుల్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. అనంతరం ఆయన చేయిపట్టుకొని లాగి బుగ్గపై ముద్దుపెట్టి వేగంగా వెళ్లిపోయాడు. ఈ అనూహ్య ఘటనతో రాహుల్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత తేరుకున్న ఆయన వరద బాధితులను పలుకరించారు. అయితే, రాహుల్‌కు అభిమానులు ముద్దుపెట్టడం ఇదే తొలిసారి కాదు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు గత ఫిబ్రవరిలో గుజరాత్‌లో ర్యాలీలో పాల్గొన్న రాహుల్‌కు ఓ మహిళా అభిమాని ముద్దుపెట్టారు. స్టేజీపైకి చేరిన ఓ మహిళా అభిమాని రాహుల్‌కు పూలమాల వేసే క్రమంలో ఆయన బుగ్గకు ముద్దుపెట్టిన సంగతి తెలిసిందే.

లైంగిక వేధింపులపై మమత ఉక్కుపాదం!

- నిందితులకు జీవిత ఖైదు.. రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు జరిమానా
- పశ్చిమబెంగాల్‌లో కొత్తబిల్లును తీసుకొచ్చేందుకు ప్రభుత్వ చర్యలు

కోల్‌కతా, ఆగస్టు 28: లైంగిక వేధింపుల నివారణకు పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. నిందితులకు జీవితఖైదుతోపాటు రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.5 లక్షల జరిమానా విధించేందుకు అనువుగా కొత్తబిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు కసరత్తుచేస్తున్నది. ఈ నెల 30న అసెంబ్లీలో పశ్చిమబెంగాల్ (లైంగికవేధింపుల నిరోధక) బిల్లు 2019ను ప్రవేశపెట్టాలని చూస్తున్నట్టు అధికారులు తెలిపారు. మతం, జాతి, కులం, లింగం, పుట్టిన ప్రదేశం, భాషా, ఆహార పద్ధతుల ఆధారంగా ఒక గుంపు ద్వారా (ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది సమూహం) లైంగిక వేధింపులు లేదా ఏదైనా చర్యలు, లేదా హింసలకు పాల్పడటం లేదా సహాయపడటం, ప్రయత్నించడం ఆకస్మిక లేదా ప్రణాళికబద్ధంగా చేసే చర్యలకు శిక్షార్హులుగా నిర్వచించినట్టు టీఎంసీ నాయకుడు ఒకరు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో భాగంగా కఠిన చర్యలకు పూనుకున్నట్టు పేర్కొన్నారు.

అగ్రికల్చర్ డిప్లామాకు తుదివిడుత కౌన్సెలింగ్ రేపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్లామా కోర్సులకు తుదివిడత కౌన్సెలింగ్ శుక్రవారం (ఈ నెల 30న) నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు. 10 జీపీఏ నుంచి 7 జీపీఏ వరకు గ్రేడ్‌పాయింట్లు సాధించి, వర్సిటీ డిప్లామా కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్నవారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావడానికి అర్హులని చెప్పారు. డిప్లామా కోర్సులకు మొదటి మూడు కౌన్సెలింగ్‌లు నిర్వహించిన తర్వాత కూడా మిగిలిన ఖాళీలను భర్తీ చేయడానికి తుది కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. సీటు పొందిన వెంటనే ఫీజు రూ.16,600 చెల్లించాలని లేదంటే సీటు రద్దు చేస్తారని చెప్పారు. కౌన్సెలింగ్ నిర్వహించే స్థలం, సీట్ల వివరాలకు www.pjtsau.edu.in వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన సూచించారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు హతం

- ఒక జవాను మృతి.. ఒడిశాలో ఘటన

కొత్తగూడెం క్రైం: ఒడిశా దండకారణ్యంలో బుధవారం మావోయిస్టులు, జవాన్లకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఒక మావోయిస్టు కమాండర్ హతమయ్యాడు. అలాగే ఒక జవాను కూడా ప్రాణాలు కోల్పోయాడు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ రిషికేశ్ ధ్యాన్‌దేవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో జిల్లా వలంటీర్ ఫోర్స్ (డీవీఎఫ్), స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఓజీ) భద్రతా బలగాల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో ఖైర్‌పుట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోందా పర్వతాల సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులకు దిగారు. దీంతో అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు గంటన్నర పాటు భీకరపోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు దట్టమైన అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. ఈ కాల్పుల్లో డీవీఎఫ్‌కు చెందిన జైరాం కవాసి అనే జవాన్ ప్రాణాలు కోల్పోయారు. మరో జవాన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయనను విశాఖ జిల్లా దవాఖానకు తరలించారు. ఘటన స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న జవాన్లు ఆ ప్రాంతాన్ని సీజ్ చేసి గాలింపు చేపట్టారు. ఒక మావోయిస్టు మృతదేహంతో పాటు తుపాకులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందిన మావోయిస్టు దళ కమాండర్‌ను రాకేశ్ సోదిగా గుర్తించారు. అతడిపై రూ.8 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. రాకేశ్.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గట్టపాడ నివాసిగా పోలీసులు భావిస్తున్నారు.

మావోయిస్టు మృతదేహాన్ని జెట్టిలో తరలిస్తున్న భద్రతా బలగాలు. (ఇన్‌సెట్) మావోయిస్టు మృతదేహం

అమెరికాలో సిక్కు వ్యక్తి దారుణ హత్య

వాషింగ్టన్, ఆగస్టు 28: భారత్‌కు చెందిన ఓ సిక్కు వ్యక్తి అమెరికాలోని కాలిఫోర్నియాలో దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో గ్రెచెన్ ట్రాలీ పార్క్‌లో వాకింగ్ చేస్తున్న పరంజిత్ సింగ్‌పై గుర్తు తెలియని దుండగుడు కత్తితో దాడికి తెగబడ్డాడు. తీవ్రగాయాలపాలై నేలపై రక్తమోడుతున్న పరంజిత్‌ను స్థానికులు గుర్తించి వెంటనే 911కు సమాచార మందించారు. చికిత్స పొందుతూ పరంజిత్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా అనుమానితులెవరినీ గుర్తించలేదని పోలీసులు తెలిపారు. సిక్కు అయినందువల్లే అతడిని హత్య చేసి ఉంటారని పలువురు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతానికి దీన్ని విద్వేష హత్యగా చెప్పలేమని పోలీసులు పేర్కొన్నారు.

మెక్సికోలో బార్‌లో ఘర్షణ

- పెట్రో బాంబులు విసురుకున్న డ్రగ్ మాఫియా
- 25 మంది దుర్మరణం.. 13 మందికి తీవ్ర గాయాలు

మెక్సికో సిటీ, ఆగస్టు 28: మెక్సికోలోని గల్ఫ్ తీర నగరమైన కోట్జాకోల్కాస్‌లోని ఓ బార్‌లో మంగళవారం రాత్రి జరిగిన దాడిలో 25 మంది దుర్మరణం చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు

విజయ్ దేవరకొండ

విజయ్ నిర్మాణంలో 'మీకు మాత్రమే చెప్తా'

తరుణ్‌భాస్కర్

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ నిర్మాతగా మారి కింగ్ ఆఫ్ ది హిల్ పతాకంపై ఓ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. దర్శకుడు తరుణ్‌భాస్కర్ ఈ సినిమాలో హీరోగా నటించనున్నారు. ఈ చిత్రానికి 'మీకు మాత్రమే చెప్తా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ టైటిల్‌ను వినూత్నంగా వీడియో ద్వారా ప్రకటించారు విజయ్ దేవరకొండ. క్రికెట్ అడుతున్న తరుణ్‌భాస్కర్‌కు విజయ్ దేవరకొండ ఫోన్ చేసి 'నేను ఇప్పుడే ఓ స్క్రిప్ట్ విన్నా. బాగా నచ్చింది. నవ్వుకున్నా. ఆ దర్శకుడు, వారి టీమ్ చూస్తే 'పెళ్లిచూపులు' సమయంలో మనమే గుర్తుకొచ్చాం. అందులో హీరో నువ్వే. నా సేవింగ్స్ అన్ని ఈ సినిమాలో పెడుతున్నా' అని చెప్పడం ఆసక్తిని పంచింది. ఈ సినిమా టైటిల్ ఏంటి అని తరుణ్..విజయ్‌ని అడగ్గా 'మీకు మాత్రమే చెప్తా' అంటూ పేరును వినూత్నంగా వెల్లడించారు. 'సినిమాను నిర్మించడం ఎంత కష్టమో, రిస్క్‌తో కూడుకున్నదో తెలుసు. ఛాలెంజ్ లేకపోతే జీవితానికి అర్థం లేదు' అంటూ వీడియోతో పాటు వ్యాఖ్యను జోడించారు విజయ్ దేవరకొండ.

శర్వానంద్, రీతూవర్మ

శర్వానంద్ కొత్త చిత్రం షురూ

సినిమాల దూకుడును పెంచుతున్నారు శర్వానంద్. ఇటీవలే 'రణరంగం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారాయన. తాజాగా కొత్త సినిమాను ప్రారంభించారు శర్వానంద్. డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రం బుధవారం చెన్నైలో లాంఛనంగా ప్రారంభమైంది. ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. శ్రీకార్తిక్ దర్శకత్వం వహిస్తున్నారు. రీతూవర్మ కథానాయిక. దర్శకుడు తరుణ్‌భాస్కర్ ఈ చిత్రానికి సంభాషణలను సమకూర్చుతున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'స్నేహం, ప్రేమ అంశాల సమ్మిళితంగా రూపొందుతున్న చిత్రమిది. శర్వానంద్ పాత్ర నవ్యపంథాలో సాగుతుంది. బుధవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం. వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. నాజర్, వెన్నెల కిషోర్, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సుజిత్‌సారంగ్, సంగీతం: జాక్స్ బిజోయ్, డైలాగ్స్: తరుణ్‌భాస్కర్, ఎడిటర్: శ్రీజిత్ సారంగ్.

కాజల్ అగర్వాల్

బాలీవుడ్‌లో పునరాగమనం

దక్షిణాదిన అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపును సొంతం చేసుకున్న కాజల్ అగర్వాల్ బాలీవుడ్‌లో రాణించలేకపోయింది. హిందీలో ఆమె నటించిన సింగం, స్పెషల్ చబ్బీస్ చిత్రాలు విజయాల్ని సాధించినా ఆశించిన స్థాయిలో కాజల్‌కు అవకాశాలు దక్కలేదు. . 2016లో వచ్చిన 'దో లఫ్జోంకీ కహానీ' తర్వాత నాలుగేళ్ల విరామం అనంతరం బాలీవుడ్‌లో పునరాగమనం చేయబోతున్నది ఈ సొగసరి. జాన్ అబ్రహం, ఇమ్రాన్ హష్మీ హీరోలుగా 'ముంబాయిసాగా' అనే చిత్రం మంగళవారం ప్రారంభమైంది. 1980-90ల మధ్యకాలంలో ముంబాయి మాఫియా నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంజయ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్ అబ్రహం సరసన కాజల్ అగర్వాల్ నటించనున్నది. 17 ఏళ్ల విద్యార్థినిగా, వివాహితగా, 30 ఏళ్లపైబడిన శక్తివంతమైన మహిళగా భిన్న పార్శ్వాల్లో కాజల్ పాత్ర సాగుతుందని దర్శకుడు తెలిపారు. బుధవారం నుంచి కాజల్ ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొన్నట్లు సమాచారం. జాన్ అబ్రహంకు జోడీగా కాజల్ నటిస్తున్న తొలిచిత్రమిదే కావడం గమనార్హం. జాకీ ష్రాఫ్, సునీల్‌శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం జూన్ 2020లో ప్రేక్షకుల ముందుకురానున్నది.

'నానీస్ గ్యాంగ్‌లీడర్' చిత్రంలో నాని

యుద్ధానికి సిద్ధం!

నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'నానీస్ గ్యాంగ్‌లీడర్'. విక్రమ్.కె.కుమార్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్(సీవీఎం) నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను బుధవారం ట్విట్టర్ ద్వారా నాని విడుదలచేశారు. మొదటిసారి పెన్సిల్ రాసిన ఒక ఒరిజినల్ కథ అనే వ్యాఖ్యను జోడించారు. ఈ ట్రైలర్‌లో నానితో పాటు ప్రధాన పాత్రధారులు చెప్పిన ప్రాసలతో కూడిన సంభాషణలు నవ్విస్తూనే ఆసక్తిని పంచుతున్నాయి. ఇరవైఎనిమిది రివేంజ్ కథలు రాశాడంటే అతడి ఆలోచనల్లో ఎంత పగ ఉంటుందోనంటూ నాని పాత్రను గురించి లక్ష్మి చెప్పే సంభాషణలతో సరదాగా టీజర్ ప్రారంభమైంది. ప్రపంచంలో ఎంతటి మగన్నైనా మాయచేయగలిగే ఒకే ఒక పవర్‌ఫుల్ వెపన్ అమ్మాయి...యుద్ధానికి సిద్ధం కండి సమరశంఖం నేను ఊదుతాను. నేనింకా థ్రిల్లర్ జోనర్‌లోనే ఉన్నాను.. సైకో కిల్లర్ జోనర్‌కి వెళ్లేలోగా మొదలెట్టేద్దాం..అంటూ తనదైన మేజరిజమ్స్ నాని చెప్పిన డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. ఐదుగురు ఆడవాళ్లు..వాళ్లతో ఒకడు అంటూ ప్రతినాయక పాత్రధారి కార్తికేయ సంభాషణలు ఉత్కంఠనుపంచాయి. ప్రతీకార లక్ష్యంతో రగిలిపోయే ఓ చిన్నారితో పాటు నలుగురు మహిళల బృందానికి నాయకుడిగా నాని కనిపించనున్నారు. 'రివేంజ్ రైటర్ పెన్సిల్‌గా నాని పాత్ర వినూత్నంగా ఉంటుంది. సెప్టెంబర్ 13న సినిమాను విడుదల చేయనున్నాం. ఇటీవల విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది' అని నిర్మాతలు చెప్పారు. కార్తికేయ, లక్ష్మి, శరణ్య, ప్రియాంక, అనీష్ కురువిళ్లా, ప్రియదర్శి, రఘుబాబు, వెన్నెలకిషోర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, సినిమాటోగ్రఫీ: మిరోస్లా కుబా బ్రోజెక్, మాటలు: వెంకీ.

లావణ్య

ప్రేమ గొప్పతనంతో

'కుటుంబ విలువలు, ప్రేమ, స్నేహం అంశాల కలబోతగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలు ఉత్సుకతను రేకెత్తిస్తాయి. ప్రేమను కొత్తకోణంలో ఆవిష్కరించే ఈ చిత్రం ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది' అని అన్నారు డాక్టర్ లింగేశ్వర్. గోల్డ్ టైమ్ ఇన్ పిక్చర్స్ పతాకంపై ఆయన నిర్మిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్నారు. నవీన్ నాయని దర్శకుడు. సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే నవతరం ప్రేమకథా చిత్రమిది. ఓ యువ జంట ప్రేమపయనంలోని అనుభూతులకు అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. కథను నమ్మి ఈ సినిమాను నిర్మించాం. తొలి చిత్రమైనా తరుణ్‌తేజ్, లావణ్య పరిణితితో కూడిన నటనను కనబరిచారు. వారి కెరీర్‌కు ఈ చిత్రం శుభారంభాన్ని అందిస్తుంది. అనుభవజ్ఞుడిలా దర్శకుడు నవీన్ ఈ సినిమాను తెరకెక్కించారు. వందశాతం విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. ప్రేమ గొప్పతనాన్ని చాటిచెప్పే సినిమా ఇదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: శ్రీనివాస్ విన్నకోట, సంగీతం: సాబు వర్గీస్.

సల్మాన్‌ఖాన్

రాను మండల్‌కు సల్మాన్ బహుమానం

నయా సోషల్ మీడియా సెన్సేషన్ రాను మండల్‌కు సల్మాన్‌ఖాన్ భారీ నజరానా ప్రకటించారు. రాను మండల్ గళానికి ముగ్ధుడైన బాలీవుడ్ స్టార్ ఆమెకు యాభై ఐదు లక్షల విలువైన ఇంటిని కానుకగా ఇచ్చినట్లు సమాచారం. దిగ్గజ గాయని లతా మంగేష్కర్ గాత్రాన్ని తలపించేలా 'ఎక్ ప్యార్ కా నగ్మా' అనే గీతాన్ని ఆలపించిన రాను మండల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె మధురగాత్రానికి పలువురు ప్రముఖులు ఫిదా అయ్యారు. సంగీత దర్శకుడు హిమేష్ రేషమ్మియా తాను రూపొందిస్తున్న 'హ్యాపీ హార్డీ హీర్' సినిమాలో రాను మండల్‌తో ఓ పాటను పాడించారు. పలు సింగింగ్ రియాలిటీ షోల నుండి ఆమెకు అహ్వానాలు అందుతున్నాయి. తాజాగా సల్మాన్‌ఖాన్ ఆమెకు 55 లక్షల ఇంటిని బహుకరించినట్లు తెలిసింది. అలాగే తాను నటిస్తున్న 'దబాంగ్-3'లో రాను మండల్‌తో ఓ పాటను పాడించబోతున్నట్లు సమాచారం.

అక్షయ్‌కుమార్

పుల్లెల గోపీచంద్ పాత్రలో..

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణపతాకం సాధించిన తెలుగు తేజం పీవీ సింధు జీవితం ఆధారంగా ఓ సినిమాను రూపొందించేందుకు చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. బాలీవుడ్ నటుడు సోనూసూద్ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా సింధు సాధించిన విజయాలతో పాటు అగ్రశ్రేణిక్రీడాకారిణిగా ఎదిగే క్రమంలో అమెకు ఎదురైన సవాళ్లతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ సినిమాలో సింధు విజయాల్లో కీలకభూమిక పోషిస్తున్న కోచ్ పుల్లెల గోపీచంద్ పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చిత్రబృందం అక్షయ్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు, అతడు ఈ సినిమాలో నటించడానికి సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఇటీవలే పాత్రికేయుల సమావేశంలో తన పాత్రలో అక్షయ్‌కుమార్ నటించనున్న వార్తలపై గోపీచంద్ స్పందిస్తూ 'నేను అమితంగా ఆరాధించే వ్యక్తుల్లో అక్షయ్‌కుమార్ ఒకరు. ఆయన నా పాత్రలో నటిస్తే అద్భుతంగా ఉంటుంది' అని తెలిపారు. ప్రస్తుతం ఈ బయోపిక్‌కు సంబంధించిన స్క్రిప్ట్ పనులు తుదిదశకు చేరుకున్నట్లు సమాచారం.

హీరోయిన్‌గా పనికిరానన్నారు!

విద్యాబాలన్

చిత్రసీమలో స్టార్‌డమ్ అంత సులభంగా సిద్ధించదు. నేటి విజయాల వెనక నిన్నటి కన్నీటిగాథలెన్నో ఉంటాయి. తారాపథంలో అగ్రస్థానం చేరుకోవడానికి ఎన్నో ప్రయాసల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. తనది అదే కథ అని చెబుతున్నది బాలీవుడ్‌లో అగ్రనాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న విద్యాబాలన్. కెరీర్ తొలినాళ్లలో ఆమె ఎన్నో తిరస్కారాల్ని ఎదుర్కొందట. ముఖ్యంగా దక్షిణాదిన తాను తీవ్ర అవమానాల్ని ఎదుర్కొన్నానని సంచలన విషయాల్ని బయటపెట్టింది విద్యాబాలన్. 'తమిళ, మలయాళ చిత్రాల్లో అవకాశాలు వచ్చినట్లే వచ్చి చేజారిపోయేవి. నన్ను ఎందుకు సినిమా నుంచి తొలగించారో కనీసం సమాచారం కూడా ఇచ్చేవారు కాదు. ఓ తమిళ సినిమాలో కథానాయికగా ఓకే చేశారు. రెండు రోజులు షూటింగ్ చేశారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి పిలుపు రాలేదు. నిర్మాత ఆఫీసుకి వెళ్లి అడిగితే...ఆయన నేను నటించిన సన్నివేశాల క్లిప్పింగ్స్ చూపించి 'మీరు హీరోయిన్‌గా కనిపిస్తున్నారా? నిజానికి మిమ్మల్ని తీసుకోవడం నాకు ఇష్టం లేదు. దర్శకుడి కోరిక మేరకు ఓకే చేశాం' అని అవమానకరరీతిలో మాట్లాడారు. ఇంటికి వెళ్లి అద్దంలో చూసుకొని నేను అందవిహీనంగా ఉన్నానా? సినిమాలకు పనికిరానా? అని మథనపడ్డాను. నా కుటుంబం అందించిన మానసికస్థైర్యంతో క్రమంగా కోలుకున్నాను. నన్ను నేను యథాతథంగా స్వీకరించి పరిశ్రమలో రాణించాను' అని చెప్పింది. 'డర్టీపిక్చర్' చిత్రానికిగాను జాతీయ ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకుంది విద్యాబాలన్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మిషన్ మంగళ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది.